www.vishvambhara.com
తెలుగు దినపత్రిక
# విశ్వంభర
అక్షరం సాక్షిగా..
గురువారం
24-10-2024
సంపుటి : 01 । సంచిక : 172 । పేజీలు : 12 । వెల : 5/- తెలంగాణ / ఆంధ్రప్రదేశ్






## హైదరాబాద్‌లో చెట్ల పరిరక్షణపై దృష్టి సారించిన హైడ్రా

**జీహెచ్ఎంసీ, అటవీ శాఖ అధికారులతో హైడ్రా కమిషనర్ రంగనాథ్ సమీక్ష**

**విశ్వంభర, హైదరాబాద్:** నగరంలో చెట్ల పరిరక్షణపై హైడ్రా దృష్టి సారించింది. జీహెచ్ఎంసీ, అటవీ శాఖ అధికారులతో హైడ్రా కమిషనర్ రంగనాథ్ సమీక్ష నిర్వహించారు. వాల్టా చట్టం అమలుపై అధికారులతో చర్చించారు. రోడ్లు, కాలనీల్లో కూలే స్థితిలో ఉన్న చెట్లను తొలగించాలని, ట్రీ ట్రాన్స్‌ప్లాంటేషన్‌కు ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశించారు.

## ఏపీపీఎస్సీ చైర్‌పర్సన్‌గా అనురాధ

**చీఫ్ సెక్రటరీ నీరభ్‌కుమార్ ఉత్తర్వులు జారీ**

**ఇంటెలిజెన్స్ విభాగానికి అధిపతిగా పనిచేసిన మొదటి మహిళా ఐపీఎస్ అధికారిగా ఆమెకు గుర్తింపు**




# మా మద్దతు ఎప్పుడూ దౌత్యానికే



**బ్రిక్స్ వేదికగా మోదీ పునరుద్ఘాటన**

ఉగ్రవాదాన్ని ఉగ్రవాదంగానే చూడాలి

సురక్షిత కృత్రిమ మేధకోసం మనమంతా కృషిచేయాలి

బ్రిక్స్.. ప్రపంచానికి స్ఫూర్తిగా నిలుస్తుంది

**రష్యా వేదికగా కజన్ లో జరుగుతోన్న బ్రిక్స్ సదస్సులో ప్రధాని నరేంద్ర మోదీ భారత్ దౌత్యం, చర్చలకు మద్దతు ఇస్తుందని, యుద్ధానికి కాదని పునరుద్ఘాటించారు. ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి, ఇతర అంతర్జాతీయ సంస్థల్లో సంస్కరణలు రావాల్సిన ఆవశ్యకతను మరోసారి గుర్తుచేశారు. అదేవిధంగా భారత్ ప్రధాని నరేంద్ర మోదీ , చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ మధ్య ద్వైపాక్షిక చర్చలు జరిగాయి. సరిహద్దు గస్తీపై జరిగిన ఒప్పందాన్ని ఇరువురు నేతలు స్వాగతించారు. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ.. సరిహద్దులో శాంతి, సుస్థిరతను కాపాడుకోవడం ఇరు దేశాల ప్రాధాన్యంగా ఉండాలని పిలుపునిచ్చారు.**

**ఢిల్లీ:** ప్రపంచాన్ని సరైనమార్గంలో తీసుకువెళ్లడంలో సానుకూలపాత్ర పోషిస్తుందని ప్రధాని ఆశాభావం రష్యా వేదికగా జరుగుతోన్న బ్రిక్స్ సదస్సులో ప్రధాని నరేంద్రమోదీ కీలకవ్యాఖ్యలు చేశారు. భారతదేశం దౌత్యం, చర్చలకు మద్దతు ఇస్తుందని, యుద్ధానికి కాదని ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం, పశ్చిమాసియా కల్లోల పరిస్థితులు, ఆర్థిక అస్థిరతలు, వాతావరణ మార్పులు, ఉగ్రవాదం వంటి పలు సమస్యలపై ఆందోళన వ్యక్తం చేశారు. ప్రపంచాన్ని సరైనమార్గంలో తీసుకువెళ్లడంలో బ్రిక్స్ సానుకూలపాత్ర పోషిస్తుందన్న ఆశాభావం మిగతా2లో...

## సరిహద్దులో శాంతి, సుస్థిరతకు ప్రాధాన్యం

బ్రిక్స్ వేదికగా.. మోదీ-జిన్‌పింగ్ ద్వైపాక్షిక చర్చలు

ఇద్దరు నేతల మధ్య ఐదేళ్ల తర్వాత అధికారికంగా జరిగిన సమావేశం




## సవరణలు చేసి చట్టాన్ని బలహీనం చేశారు

**కేంద్రంపై సుప్రీం అసహనం**

కాలుష్యాన్ని అరికట్టేందుకు శిక్షాస్పదమైన చర్యలు చేపట్టడం లేదు

కేవలం నామమాత్రపు జరిమానాలతో సరిపెడుతున్నారు

ఢిల్లీ కాలుష్యంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై మండిపాటు..

సీఏక్యూఎం చట్టం అమలుకావడం లేదు

కొత్త నిబంధనలు 10రోజుల్లో తెలియజేయాలి







## కొరియన్ స్పోర్ట్స్ వర్సిటీలా యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ

మూడో రోజు దక్షిణ కొరియాలో పర్యటించిన రాష్ట్ర బృందం

ఇంచియాన్‌లోని స్మార్ట్ సిటీల పరిశీలన

## నాగార్జున పరువు నష్టం దావాపై విచారణ

రిప్లై ఫైల్ చేసిన కొండా సురేఖ తరపు న్యాయవాది

విచారణ అక్టోబర్ 30కి వాయిదా




## శారదాపీఠం భూ కేటాయింపులు రద్దు

- ఆలయ కమిటీల్లో సభ్యుల సంఖ్య పెంపుకు ఆమోదం
- కమిటీల్లో బ్రాహ్మణులు, నాయీ బ్రాహ్మణులకు చోటు
- ఉచిత ఇసుకను అక్రమంగా విక్రయిస్తే పీడీ యాక్ట్
- పట్టా భూముల్లో ఎవరి ఇసుక వారు తీసుకునేందుకు ఆమోదం
- దీపావళి నుంచి మహిళలకు ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలెండర్లు
- ఏపీ కేబినెట్ కీలక నిర్ణయాలు

**విశ్వంభర, అమరావతి:** సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన సమావేశమైన ఏపీ మంత్రి వర్గం సమావేశమైంది. ఈసందర్భంగా ఇసుక, దేవాలయాలు, గ్యాస్ సిలెండర్లు మిగతా2లో...



## కొండా సురేఖ వ్యాఖ్యలతో నా పరువు ప్రతిష్ఠ దెబ్బతిన్నాయి

ఆమె మాటలు తీవ్ర అభ్యంతరకరం

నాంపల్లి కోర్టులో కేటీఆర్ వివరణ

కేసు విచారణ 30 కి వాయిదా



**విశ్వంభర, హైదరాబాద్:** సుదీర్ఘకాలం పాటు ప్రజా జీవితంలో ఉన్న తనకు మంత్రి కొండా సురేఖ వ్యాఖ్యలు తీవ్ర అభ్యంతరకరంగా ఉన్నాయని, ఒక మహిళ పట్ల తనకున్న గౌరవంతో ఆమె చెప్పిన మాటలు తిరిగి చెప్పలేకపోతున్నానని బీఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కోర్టుకు వివరించారు. కొండా సురేఖపై ఆయన వేసిన పరువు నష్టం పిటిషన్‌పై నాంపల్లి ప్రత్యేక కోర్టులో ఆయన విచారణకు హాజరయ్యారు. కోర్టుకు తన వాగ్మూలాన్ని వినిపించారు. ఆయనతో పాటు సాక్షిగా ఉన్న దాసోజు శ్రవణ్ స్టేట్‌మెంట్‌ను కోర్టు రికార్డు చేసింది. తదుపరి విచారణను ఈనెల 30కి వాయిదా వేసింది.

**నాంపల్లి కోర్టులో కేటీఆర్ వాంగ్మూలం**

మంత్రి కొండా సురేఖపై దాఖలు చేసిన పరువు నష్టం కేసులో నాంపల్లి కోర్టులో కేటీఆర్ వాంగ్మూలం ఇచ్చారు. కొండా సురేఖ వ్యాఖ్యలు తనతో పాటు పార్టీకి కూడా తీవ్రంగా నష్టం చేకూర్చే విధంగా ఉన్నాయని మిగతా2లో...

మరిన్ని తాజా వార్తల కోసం **స్కాన్** చేయండి

## మా కుటుంబం మీకు రుణపడి ఉంది

- ప్రపంచం అంతా మా సోదరుడికి వ్యతిరేకంగా ఉన్ననాడు.. మీరు మద్దతుగా నిలిచారు
  రోడ్ షోలో మాట్లాడిన ప్రియాంక
- వాయనాడ్ లోక్‌సభ స్థానానికి నామినేషన్ దాఖలు చేసిన ప్రియాంకాగాంధీ






## నేటి చికెన్ ధరలు

| ఫామ్ ధర | రిటైల్ |
|---|---|
| ₹ 120 | ₹ 142 |
| **స్కిన్** | **స్కిన్ లెస్** |
| ₹ 206 | ₹ 234 |



## ఒక్కో పార్టీకి 85 సీట్లు..

- ‘మహా’ విపక్ష కూటమి నిర్ణయం!
- 65 సీట్లకు అభ్యర్థుల్ని ప్రకటించిన ఉద్ధవ్

**ముంబయి:** మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు విపక్ష ‘మహా వికాస్ అఘాడీ’ కూటమిలో సీట్ల సర్దుబాటు వ్యవహారంలో ఏకాభిప్రాయం కుదిరింది. ఈ కూటమిలోని ప్రధాన పక్షాలైన శివసేన (యూబీటీ), కాంగ్రెస్, మిగతా2లో...

## కేటీఆర్ బాగోతం ప్రజలకు తెలుసు



- లీగల్ నోటీసులకు ఇక్కడ భయపడే వారెవరూ లేరు
- కేంద్ర మంత్రి బండి సంజయ్

**విశ్వంభర, హైదరాబాద్:** లీగల్ నోటీసులతో భయపెట్టాలని చూస్తే ఇక్కడ భయపడే వారెవరూ లేరని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. బీఆర్ ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ మిగతా2లో...

## పంచాంగం

**24-10-2024, గురువారం**

శ్రీ క్రోధినామ సంవత్సరం
ఆశ్వయుజ మాసం కృష్ణపక్షం
**తిథి:** అష్టమి రా.02.01 వరకు తర్వాత నవమి
**నక్షత్రం:** పుష్యమి ఉ.07.35 వరకు
**సూర్యోదయం:** ఉ.6.15
**సూర్యాస్తమయం:** సా.5.44
**వర్జ్యం:** మ.02.43 నుంచి సా.04.25వరకు
**దుర్ముహూర్తం:** ఉ.10.05 నుంచి ఉ.10.51 వరకు తిరిగి మ.02.41 నుంచి మ.03.27 వరకు
**రాహుకాలం:** మ.01.26 నుంచి మ.02.52 వరకు
**అమృత ఘడియలు:** రా.12.53 నుంచి రా.02.35 వరకు

# సవరణలు చేసి చట్టాన్ని బలహీనం చేశారు

**దిల్లీ:** శీతాకాలం సమీపిస్తుంటే చాలు.. దేశ రాజధాని దిల్లీలో గాలి నాణ్యత దిగజారుతుంది. ఈనేపథ్యంలో కేంద్రాన్ని ఉద్దేశించి సుప్రీంకోర్టు తీవ్రంగా స్పందించింది. 'పంట వ్యర్థాలు తగలబెట్టడం' సమస్యపై కఠిన చట్టాలు రూపొందించకపోవడంపై అసహనం వ్యక్తంచేసింది. సవరణలతో పర్యావరణ చట్టాలను ఎలాంటి ప్రభావం చూపనివాటిగా మార్చారంటూ వ్యాఖ్యానించింది. అలాగే వ్యర్థాలను తగలబెట్టేవారిపై కఠిన చర్యలకు సంబంధించి కొత్త నిబంధనలను 10 రోజుల్లో తెలియజేయాలని కేంద్రాన్ని ఆదేశించింది. ఇటీవల గాలి కాలుష్యాన్ని అరికట్టడంలో ఎయిర్ క్వాలిటీ మేనేజ్‌మెంట్ కమిషన్ విఫలం కావడంపై సుప్రీంకోర్టు తీవ్రస్థాయిలో మండిపడింది.



**ఢిల్లీ కాలుష్యంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై మండిపాటు..**
ఢిల్లీ కాలుష్యంపై కేంద్రంతో పాటు పంజాబ్, హర్యానా ప్రభుత్వాలపై సుప్రీంకోర్టు మండిపడింది. పొరుగు రాష్ట్రాల్లో చెత్తను తగులబెడుతుండడంతో ఢిల్లీలో ఏర్పడే కాలుష్యాన్ని అరికట్టేందుకు కేంద్రం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేసింది. సవరణలతో పర్యావరణ పరిరక్షణ చట్టాన్ని కోరల్లేనిదానిగా మార్చారంటూ ఘాటుగా స్పందించింది. కాలుష్యాన్ని అరికట్టేందుకు కేంద్రం శిక్షాస్పదమైన చర్యలు చేపట్టడం లేదని.. కేవలం నామమాత్రపు జరిమానాలతో సరిపెడుతున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేసింది.''పంట వ్యర్థాల సమస్యను పరిష్కరించడానికి కనీసం ఒక్క కమిటీ కూడా వేయలేదు. ఏటా ఈ సమస్యను చూస్తుంటే సీఏక్యూఎం చట్టం అమలుకావడం లేదని తెలుస్తోంది. కమిటీలు ఏర్పాటుచేశారా? చట్ట ప్రకారం ఏం చర్యలు తీసుకున్నారో కనీసం ఒక్కటైనా చూపించండి. దిల్లీ ఎన్‌సీఆర్ రాష్ట్రాలకు గతంలో చెప్పినవన్నీ గాల్లో మాటలుగానే మిగిలినట్లు కనిపిస్తోంది'' అని సీఏక్యూఎంను సుప్రీం ధర్మాసనం నిలదీసింది. కేవలం మీరు మౌన ప్రేక్షకులుగానే మిగిలిపోయారని మందలించింది. కేంద్రం తరఫున విచారణకు హాజరైన సొలిసిటర్ జనరల్ ఐశ్వర్య భాటి వాదనలు వినిపించారు. పది రోజుల్లో నిబంధనలు ఖరారు చేస్తామన్నారు. చట్టం పూర్తిగా అమలులోకి తీసుకువస్తామని జస్టిస్ అభయ్ శ్రీనివాస్ ఓకా ధర్మాసనానికి హామీ ఇచ్చారు.వాయు కాలుష్యం అరికట్టేందుకు చట్టాన్ని అమలు చేసేందుకు అవసరమైన యంత్రాంగం లేకుండానే ఎయిర్ క్వాలిటీ మేనేజ్‌మెంట్ చట్టాన్ని రూపొందించారని ధర్మాసనం పేర్కొంది. పరిశుభ్రమైన, కాలుష్య రహిత వాతావరణంలో జీవించడం పౌరుల ప్రాథమిక హక్కు అని ధర్మాసనం స్పష్టం చేసింది. పౌరుల హక్కులను కాపాడడం కేంద్ర, రాష్ట్రాల కర్తవ్యమని చెప్పింది. ఆర్టికల్ 21 ప్రకారం ప్రాథమిక హక్కులను ఉల్లంఘించడమేనని సుప్రీంకోర్టు పేర్కొంది. నిబంధనలు ఉల్లంఘించిన వారికి విధించే జరిమానాను పెంచేందుకు చట్టాన్ని సవరించాలని సుప్రీంకోర్టు కేంద్రాన్ని ఆదేశించింది. అయితే, పంజాబ్, హర్యానా రెండు రాష్ట్రాల కార్యదర్శి (పర్యావరణ), అదనపు ప్రధాన కార్యదర్శి (వ్యవసాయం)కి షోకాజ్ నోటీసులు అందించామని ఏఎస్‌జీ తెలిపారు.

**ఇదంతా రాజకీయం.. మరేమీ కాదు..**
కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు పర్యావరణాన్ని పరిరక్షించేందుకు సిద్ధంగా ఉంటే సెక్షన్ 15 సవరణకు ముందు ప్రతిదీ జరిగి ఉండేదని.. ఇదంతా రాజకీయం.. మరేమీ కాదని కోర్టు పేర్కొంది. మరో వైపు పంజాబ్, హర్యానా ప్రభుత్వాలపై సైతం సర్వోన్నత న్యాయస్థానం ఆగ్రహం చేసింది. చెత్తను దహనం చేసిన వారిపై రెండు రాష్ట్రాలు ఎలాంటి శిక్షార్హమైన చర్యలు తీసుకోలేదని పేర్కొంది. చట్టాన్ని అమలు చేసేందుకు రాష్ట్రాలకు ఆసక్తి ఉంటే కనీసం ప్రాసిక్యూషన్ అయినా ఖచ్చితంగా జరుగుతుందని కోర్టు పేర్కొంది. సుమారు 1,080 ఎఫ్ఐఆర్‌లు, 473 మంది నామమాత్రపు జరిమానాలే విధించారని పంజాబ్ సెక్రెటరీపై సుప్రీంకోర్టు పేర్కొంది. చట్టాన్ని ఉల్లంఘించిన వారికి ఏం చేయబోమంటూ సిగ్నల్ ఇస్తున్నారా? అంటూ ప్రశ్నించింది. గత మూడేళ్లుగా ఇదే జరుగుతోందని మండిపడింది. 400 వ్యవర్థాలు దహన ఘటనలు జరిగాయని హర్యానా ప్రధాన కార్యదర్శి సుప్రీంకోర్టుకు తెలిపారు. రాష్ట్రంలో 32 ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయని చెప్పగా.. సర్వోన్నత న్యాయస్థానం అసహనం వ్యక్తం చేస్తూ.. లెక్కలపై అబద్ధాలు చెబుతున్నారని కోర్టు పేర్కొంది. కొందరికి జరిమానాలు విధించి.. మరికొందరిపై ఎఫ్ఐఆర్ నమోదు చేయడంపై కోర్టు ఆందోళన వ్యక్తం చేసినట్లు చెప్పింది. ఇక వాయు కాలుష్యం కేసును దీపావళి తర్వాత విచారించనున్నట్లు తెలిపింది. ఢిల్లీలో వాహనాలతో కాలుష్యం, నగరంలోకి భారీ ట్రక్కుల ప్రవేశం, బహిరంగ ప్రదేశాల్లో చెత్త దహనం తదితర అంశాలను పరిగణలోకి తీసుకుంటామని సర్వోన్నత న్యాయస్థానం స్పష్టం చేసింది.

## ఏపీపీఎస్సీ ఛైర్‌పర్సన్‌గా అనురాధ

**విశ్వంభర, అమరావతి:** ఏపీపీఎస్సీ ఛైర్‌పర్సన్‌గా విశ్రాంత ఐపీఎస్ అనురాధను నియమిస్తూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరభ్ కుమార్ ప్రసాద్ ఉత్తర్వులు జారీచేశారు.గత వైసీపీ ప్రభుత్వం ఏపీపీఎస్సీ ఛైర్మన్‌గా గౌతమ్‌సవాంగ్‌ను నియమించింది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఆయన రాజీనామా చేయడంతో కొన్ని నెలలుగా ఏపీపీఎస్సీ ఛైర్మన్ పోస్టు ఖాళీగా ఉంది. దీంతో అనురాధను నియమిస్తూ సీఎస్ ఆదేశాలు జారీ చేశారు.ఏపీపీఎస్సీ బాధ్యతల్ని గాడిన పెట్టాలని భావిస్తున్న ప్రభుత్వం ఆ బాధ్యతల్ని సమర్ధవంతంగా, నిష్పాక్షికంగా నిర్వహించే అధికారుల కోసం జల్లెడ పట్టి ఏపీ క్యాడర్‌కు చెందిన అనురాధను నియమించింది. ఏఆర్ అనురాధ ఏపీలో ఇంటెలిజెన్స్ విభాగానికి అధిపతిగా పనిచేసిన మొదటి మహిళా ఐపీఎస్ అధికారిగా గుర్తింపు పొందారు. హోంశాఖ కార్యదర్శిగా అనురాధ బాధ్యతలు నిర్వహించారు. డీజీ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగంలో కూడా ఆమె పనిచేశారు. ఆమె ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పలు జిల్లాలోఎస్పీగా, ఐజీగా పనిచేశారు.1987 బ్యాచ్‌కు చెందిన ఏఆర్ అనురాధ భర్త నిమ్మగడ్డ సురేంద్రబాబు కూడా ఐపీఎస్ అధికారి కావడం విశేషం. అనురాధ నియామకానికి ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ సుముఖత తెలుపడంతో ఆమెను నియమించినట్లు సమాచారం. వైసీపీ హయాంలో ఏపీపీఎస్సీ గ్రూప్స్ పరీక్షల నిర్వహణలో పెద్ద ఎత్తున అక్రమాలు జరిగాయని టీడీపీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు తీవ్రంగా ఆరోపించింది. గ్రూప్ 1 పరీక్షల మూల్యాంకనంలో అక్రమాలకు పాల్పడ్డారని, తమకుకావాల్సిన వారికి మేలు చేసేందుకు ఒకటికి మూడు సార్లు మూల్యంకనం చేశారని విమర్శలు చేసింది. రాష్ట్రంలో ప్రభుత్వం మారిన వెంటనే మరో ఏడాది పదవీ కాలం ఉన్నా సవాంగ్ ఏపీపీఎస్సీ బాధ్యతల నుంచి తప్పుకున్నారు.

## కొండా సురేఖ వ్యాఖ్యలతో నా పరువు ప్రతిష్ఠ దెబ్బతిన్నాయి

**(మొదటి పేజీ తరువాయి)**
కోర్టులో కేటీఆర్ స్టేట్‌మెంట్ ఇచ్చారు. తనపై మంత్రి చేసిన కామెంట్లను చూసి సాక్షులు తనకు ఫోన్ చేశారన్నారు. కొండా సురేఖ వ్యాఖ్యలు అత్యంత జుగుప్సాకరంగా ఉన్నాయని వాటిని విని షాక్ గురయ్యానని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. సాక్షులు తనకు 18 ఏళ్లుగా తెలుసని వారు కూడా ఈ వ్యాఖ్యలు విని చాలా బాధపడ్డారని చెప్పారు. బాధ్యతగల మంత్రి పదవిలో ఉండి అత్యంత దిగజారుడు వ్యాఖ్యలను కొండా సురేఖ చేశారని కేటీఆర్ తన వాంగ్మూలంలో తెలిపారు. వాగ్మూలాన్ని న్యాయమూర్తి ఎదుట చెప్పేందుకు కేటీఆర్ ఇబ్బంది పడ్డారు. పిటిషన్‌లోనివి పరిగణనలోకి తీసకోవాలని కోరారు. మంత్రి మాట్లాడిన మాటలు కొన్ని చెప్పలేని విధంగా తీవ్ర ఆవేదన కలిగించేలా ఉన్నాయని కోర్టుకు చెప్పారు. నేను డ్రగ్ అడిక్ట్ అని, రేవ్ పార్టీలు నిర్వహిస్తానని ఎలాంటి ఆధారాలు లేకుండా కేవలం పబ్లిసిటీ కోసమే కొండా సురేఖ వ్యాఖ్యలు చేశారన్నారు.

**సాక్షుల స్టేట్‌మెంట్లను సేకరించిన కోర్టు :** దాదాపు అరగంట పాటు కోర్టులో కేటీఆర్ తన వాంగ్మూలాన్ని ఇచ్చారు. కొండా సురేఖ చేసిన కామెంట్ల వీడియోలను ఈ సందర్భంగా కోర్టుకు సమర్పించారు. కేటీఆర్‌తో పాటు సాక్షిగా ఉన్న దాసోజు శ్రావణ్ స్టేట్‌మెంట్‌ను కూడా కోర్టు నమోదు చేసుకుంది. మిగతా సాక్షుల స్టేట్‌మెంట్ల రికార్డును ఈ నెల 30కి వాయిదా వేసింది. కేటీఆర్ కోర్టుకు హాజరైన సమయంలో బీఆర్ఎస్ నేతలు అక్కడికి భారీగా చేరుకన్నారు.

బండికి కేటీఆర్ లోగల్ నోటీసులు : మరోవైపు కేంద్ర మంత్రి, బీజేపీ ఎంపీ బండి సంజయ్‌కు కేటీఆర్ లీగల్ నోటీసులు పంపారు. తనపై నిరాధారమైన ఆరోపణలు చేశారని, తన పరువుకు నష్టం కలిగేంచే వ్యాఖ్యలు చేశారని ఆ నోటీసుల్లో పేర్కొన్నారు. నిరాధార వ్యాఖ్యలకు వారం రోజుల్లో బేషరతు క్షమాపణలు చెప్పాలని, లేదంటే పరువునష్టం దావా వేస్తానని కేటీఆర్ హెచ్చరించారు. ఈనెల 19న బండి సంజయ్ మీడియాతో మాట్లాడుతూ తనపై తప్పుడు ఆరోపణలు చేశారని, తాను డ్రగ్స్ తీసుకుంటానని, బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడినట్టు సంజయ్ తనపై ఆరోపణలు చేసినట్లు పేర్కొన్నారు.

## కేటీఆర్ బాగోతం ప్రజలకు తెలుసు

**(మొదటి పేజీ తరువాయి)**
పంపిన లీగల్ నోటీసులపై ఆయన స్పందించారు. ''నన్ను రాజకీయంగా ఎదుర్కొనే దమ్ములేక లీగల్ నోటీసులు ఇవ్వడం చూస్తుంటే జాలేస్తోంది. తాటాకు చప్పుళ్లకు భయపడేది లేదు. నాపై తొలుత వ్యక్తిగత ఆరోపణలు చేసి అవమానించింది కేటీఆరే. అందుకు బదులుగానే నేను మాట్లాడాను. ఆయన బాగోతం ప్రజలకు తెలుసు. ఫోన్ ట్యాపింగ్, డ్రగ్స్ కేసు వ్యవహారంలో ఏం జరిగిందో, ఆ కేసులను ఏ విధంగా నీరుగార్చారో తెలుసు. ఇప్పటి వరకు మాటకు మాటతోనే బదులిచ్చాను. లీగల్ నోటీసులకు నోటీసులతోనే బదులిస్తా. మేం చట్టాన్ని, న్యాయాన్ని గౌరవించే వ్యక్తులం. చట్టం, న్యాయం ప్రకారం ముందుకు వెళ్తాం '' అని బండి సంజయ్ పేర్కొన్నారు.

## గోషామహల్‌లో భారీగా కుంగిన నాలా రోడ్డు

**విశ్వంభర, గోషామహల్:** హైదరాబాద్‌లోని గోషామహల్‌లో నాలా రోడ్డు భారీగా కుంగింది. దారుస్సలామ్ నుంచి చాక్నావాడికి వెళ్లే రోడ్డు మార్గంలో ఫ్లైవుడ్ దుకాణాల ముందు పెద్ద నాలా కుంగింది. బుధవారం తెల్లవారుజామున సుమారు 2 గంటల సమయంలో ఈ ఘటన చోటు చేసుకుంది. ఆ సమయంలో రాకపోకలు లేకపోవడంతో ప్రమాదం తప్పింది. అతి పురాతనమైన నాలా కావడంతో కుంగినట్లుగా స్థానికులు చెబుతున్నారు. గతంలోనూ ఇక్కడికి 200 మీటర్ల దూరంలో ఇదే నాలా కుంగింది.



# శారదాపీఠం భూ కేటాయింపులు రద్దు

**(మొదటి పేజీ తరువాయి)**
తదితర అంశాలపై కీలక నిర్ణయాలు తీసుకుంది. కేబినెట్‌లో తీసుకున్న నిర్ణయాలను మంత్రులు పార్థసారధి, అనిత, నాదెండ్ల మనోహర్, కొల్లు రవీంద్ర వివరించారు.

**ఉచిత ఇసుకను అక్రమంగా విక్రయిస్తే పీడీ యాక్ట్**
ఇసుక సీనరేజ్, జీఎస్టీ ఛార్జీలు రద్దుకు కేబినెట్ ఆమోదం తెలిపిందని అన్నారు. పూర్తిగా ఉచితంగా ఇసుకను అందజేస్తున్నామని తెలిపారు. ఉచిత ఇసుకతో వ్యాపారం చేసే వారిపై చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. ఉచిత ఇసుకను అక్రమంగా రవాణా చేసినా, విక్రయించిన వారిపై పీడీ యాక్ట్ కేసు నమోదు చేస్తామని తెలిపారు.ఇసుక కొరత ఉన్న ఐదు జిల్లాలో ప్రత్యామ్నయ్య పాయింట్లు ఏర్పాట్లు చేయనున్నామని వివరించారు. ఉచిత ఇసుకను ఇతర సరిహద్దు రాష్ట్రాలకు తరలించకుండా చెక్‌పోస్టులను బలోపేతం చేస్తామని, నిరంతరం సీసీ కెమెరాల ద్వారా పర్యవేక్షణ ఉంటుందని తెలిపారు. గత ప్రభుత్వం తీసుకొచ్చిన జీవోలన్నింటినీ ఈ పోర్టల్ గెజిట్‌లో పొందుపరిచేందుకు కేబినెట్ ఆమోదం తెలిపిందన్నారు.పట్టా భూముల్లో ఎవరి ఇసుక వారు తీసుకునేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఉచిత ఇసుక సరిగా అమలయ్యేలా చూడాలని మంత్రులు, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రులకు సీఎం ఆదేశాలు జారీ చేశారు. ఇసుక లేని జిల్లాల్లో మినరల్ డీలర్లను పెట్టి ధరల నియంత్రణ చేపట్టాలని నిర్ణయించారు. ఎర్రమట్టి దిబ్బల తవ్వకాల్లో అక్రమాలపై చర్యలకు కమిటీ వేయాలని మంత్రివర్గ సమావేశం నిర్ణయించింది.



**దేవాలయ కమిటీల్లో సభ్యత్వం..**
ఆలయ కమిటీల్లో సభ్యుల సంఖ్య పెంచే చట్ట సవరణకు ఆమోదం తెలిపింది.రూ. 20 కోట్ల ఆదాయం వచ్చే దేవాలయాల కమిటీల్లో ఇదివరకు ఉన్న 15 మంది గల సభ్యుల సంఖ్యను 17 కు పెంచేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. ఇందుల్లో బ్రాహ్మణులకు, నాయీ బ్రాహ్మణులకు సభ్యత్వం ఇవ్వాలని నిర్ణయించారు. విశాఖ నర్సింగ్ కళాశాలలో ప్రస్తుతమున్న సీట్లను 25 నుంచి 100 సీట్లకు పెంచుతూ నిర్ణయం తీసుకుందని పార్థసారథి తెలిపారు. ఇందులో 25 టీచింగ్ పోస్టులకు, 58 నాన్ టీచింగ్ పోస్టులు మంజూరు చేసిందన్నారు. మంగళగిరిలో 30 పడకల ఆసుపత్రిని 100 పడకల ఆసుపత్రిగా మారుస్తూ మంత్రి వర్గం తెలిపిందని మంత్రి వివరించారు. ప్రతి నియోజకవర్గంలో వంద పడకల ఆసుపత్రిని నిర్మించేందుకు గ్రీన్ సిగ్నల్ తెలిపిందని వెల్లడించారు.

**విశాఖ శారదాపీఠానికి భూ కేటాయింపు రద్దు..**
విశాఖకు చెందిన వివాదాస్పద పీఠాధిపతి స్వరూపానందేంద్రకు చెందిన శారదాపీఠానికి జగన్ ప్రభుత్వం అప్పనంగా కట్టబెట్టిన 15 ఎకరాల అత్యంత విలువైన భూమిని వెనక్కి తీసుకోవాలనే ప్రతిపాదనకు కేబినెట్ ఆమోదముద్ర వేసింది. వైసీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి సీఎం జగన్ తన గురువు, అత్యంత సన్నిహితుడైన స్వరూపానందేంద్ర కోరిందే తడవుగా.. భీమిలి పట్టణాన్ని ఆనుకుని కొత్తవలస గ్రామ పరిధిలో, సముద్ర తీరానికి దగ్గర్లో రూ.కోట్ల విలువ చేసే భూమిని ఎకరం రూ.లక్ష చొప్పున అడ్డగోలుగా ఇచ్చేశారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన అక్రమ భూ కేటాయింపులపై సమీక్షలో భాగంగా ఎన్డీయే ప్రభుత్వం దీన్ని గుర్తించింది. శారదాపీఠానికి భూముల కేటాయింపును రద్దు చేయాలని నిర్ణయించింది.

**దీపావళి నుంచి ఏడాదికి ఉచితంగా మూడు గ్యాస్ సిలెండర్లు**
ముఖ్యంగా ఎన్నికల్లో సూపర్ సిక్స్‌లో ఇచ్చిన హామీల మేరకు మహిళలకు ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకాన్ని ఈనెల 31 దీపావళి రోజు నుంచి పండుగ వాతావరణంలో ప్రారంభిస్తున్నట్లు మంత్రి మనోహర్ వెల్లడించారు. ఏడాదికి మూడు సిలిండర్లను ఒకే సారి కాకుండా నాలుగు నెలలకు ఒకటి చొప్పున అందించాలని కేబినెట్ నిర్ణయం తీసుకుంది. మూడు సిలిండర్ల పంపిణీ షెడ్యూల్‌ను ప్రకటించారు. ఏప్రిల్ 1 నుంచి జులైలో మొదటి గ్యాస్ సిలిండర్, ఆగస్టు నుంచి నవంబర్ వరకు రెండో గ్యాస్ సిలిండర్, డిసెంబర్ నుంచి మార్చి మధ్య వదకు మూడో గ్యాస్ సిలిండర్‌ను పొందవచ్చని పేర్కొన్నారు.సిలిండర్ డెలివరీ అయిన 48 గంటల్లో డీబీటీ పద్ధతిలో వినియోగదారుడి అకౌంట్‌లో డబ్బులు జమ అవుతాయని వివరించారు. గ్యాస్ సిలిండర్ సమస్యలను పరిష్కరించేందుకు గాను గ్రామ, వార్డు సచివాలయంలో ఫిర్యాదుల స్వీకరణ, పరిష్కారానికి ఏర్పాట్లు చేశామన్నారు. ఈ పథకానికి ప్రతి యేడాది రూ. 2, 684 కోట్లు వ్యయం అవుతుందని, పేద మహిళలకు దీపావళి కానుకగా ప్రకటించినందుకు మహిళల తరుఫున మంత్రి అనిత ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు.

## మా మద్దతు ఎప్పుడూ దౌత్యానికే

**(మొదటి పేజీ తరువాయి)**
వ్యక్తం చేశారు. ''కొవిడ్ వంటి సవాళ్లను ఎదుర్కొన్నట్టుగానే.. మనం భవిష్యత్తు తరాలకు కొత్త అవకాశాలను సృష్టించగలం. అలాగే ఉగ్రవాదం, ఉగ్ర సంస్థలకు వనరులను సమకూర్చడాన్ని కట్టడి చేసే విషయంలో ద్వంద్వ ప్రమాణాలు పాటించొద్దు. ఉగ్రవాదాన్ని ఉగ్రవాదంగానే చూడాలి. మన దేశాల్లో యువతను అతివాదభావజాలం వైపు మరల్చే చర్యలను అడ్డుకునే విషయంలో చురుగ్గా వ్యవహరించాలి. సైబర్ సెక్యూరిటీ, సురక్షిత కృత్రిమ మేధకోసం అంతర్జాతీయ నియంత్రణలను తీసుకువచ్చేందుకు మనమంతా కృషి చేయాలి'' అని సూచించారు. అలాగే బ్రిక్స్ భాగస్వాములుగా ఇతర దేశాలను ఆహ్వానించేందుకు భారత్ సిద్ధంగా ఉందన్నారు. ఈ విషయంలో వ్యవస్థాపక సభ్య దేశాల అభిప్రాయాలకు అనుగుణంగా నిర్ణయాలు ఉండాలన్నారు. ఐరాస భద్రతా మండలి, ఇతర అంతర్జాతీయ సంస్థల్లో సంస్కరణలు రావాల్సిన ఆవశ్యకతను మరోసారి గుర్తుచేశారు. గ్లోబల్ సౌత్(వర్ధమాన దేశాలు) దేశాల ఆకాంక్షలను పరిగణనలోకి తీసుకోవాలని ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. భిన్నమైన ఆలోచనాధోరణులు, భావజాల సమ్మేళనంగా ఏర్పడిన బ్రిక్స్.. ప్రపంచానికి స్ఫూర్తిగా నిలుస్తుందన్నారు. ఇది 'బ్రిక్స్' కూటమి 16వ శిఖరాగ్ర సదస్సు . ఈ సందర్భంగా సభ్య దేశాల నాయకులు దిగిన గ్రూప్ ఫొటోను భారత విదేశాంగ శాఖ ప్రతినిధి రణధీర్ జైశ్వాల్ ఎక్స్ వేదికగా పంచుకున్నారు. బ్రెజిల్, రష్యా, భారత్, చైనా, దక్షిణాఫ్రికాతో బ్రిక్స్ కూటమి ఏర్పాటైంది. ఇప్పుడు దాన్ని విస్తరించి ఈజిప్ట్, ఇథియోపియా, ఇరాన్, సౌదీ అరేబియా, యూఏఈలకూ సభ్యత్వం ఇచ్చారు. కూటమి విస్తరణ తర్వాత ఇదే తొలి శిఖరాగ్ర సదస్సు.

## సరిహద్దులో శాంతి, సుస్థిరతకు ప్రాధాన్యం

**కజన్:** రష్యాలోని కజన్‌లో జరుగుతోన్న బ్రిక్స్ దేశాల 16వ శిఖరాగ్ర సదస్సులో కీలక పరిణామం చోటుచేసుకుంది. భారత్ ప్రధాని నరేంద్ర మోదీ , చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ మధ్య ద్వైపాక్షిక చర్చలు జరిగాయి. సరిహద్దు గస్తీపై జరిగిన ఒప్పందాన్ని ఇరువురు నేతలు స్వాగతించారు. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ.. సరిహద్దులో శాంతి, సుస్థిరతను కాపాడుకోవడం ఇరు దేశాల ప్రాధాన్యంగా ఉండాలని పిలుపునిచ్చారు. ''ఐదేళ్ల తర్వాత అధికారికంగా సమావేశం అవుతున్నాం. భారత్-చైనా సంబంధాలు ఇరు దేశాల ప్రజలకే కాకుండా ప్రపంచ శాంతి, సుస్థిరత, పురోగతికి ఎంతో ముఖ్యమని విశ్వసిస్తున్నాం. గత నాలుగేళ్లుగా సరిహద్దులో తలెత్తిన సమస్యలపై ఇటీవల వచ్చిన ఏకాభిప్రాయాన్ని స్వాగతిస్తున్నాం. సరిహద్దులో శాంతి, సుస్థిరతను కాపాడుకోవడం మన ప్రాధాన్యంగా ఉండాలి. పరస్పర విశ్వాసం, గౌరవం, సున్నితత్వం అనేవి మన సంబంధాలకు ప్రాతిపదికగా ఉండాలి'' అని ప్రధాని మోదీ పేర్కొన్నారు. గత ఐదేళ్లలో మోదీ-జిన్‌పింగ్‌లు అధికారికంగా చర్చలు జరపడం ఇదే తొలిసారి. వాస్తవాధీన రేఖ (ఎల్ఏసీ) వెంబడి కొన్నేళ్లుగా కొనసాగుతున్న ఉద్రిక్తతలకు ముగింపు పలుకుతూ కీలక గస్తీ ఒప్పందం కుదిరిన నేపథ్యంలో వీరి భేటీ మరింత ప్రాధాన్యం సంతరించుకుంది.

## ఒక్కో పార్టీకి 85 సీట్లు..

**(మొదటి పేజీ తరువాయి)**
ఎన్సీపీ (ఎస్‌పీ) పార్టీలు 85 స్థానాల చొప్పున పోటీచేయాలని నిర్ణయించాయి. మొత్తంగా 270 సీట్ల విషయంలో ఏకాభిప్రాయం కుదరగా.. మిగతా 18 స్థానాలను సమాజ్‌వాదీ పార్టీ సహా ఇతర భాగస్వామ్యపక్షాలకు ఇచ్చేందుకు చర్చలు జరుగుతున్నట్లు కాంగ్రెస్ మహారాష్ట్ర అధ్యక్షుడు నానా పటోలే వెల్లడించారు. ఈ మేరకు ఆయన శివసేన (యూబీటీ) నేత సంజయ్ రౌత్, ఇతర నేతలతో కలిసి ముంబయిలో మీడియాతో మాట్లాడారు. మహారాష్ట్ర అసెంబ్లీలో మొత్తం 288 సీట్లు ఉండగా.. 270 సీట్లపై సామరస్యపూర్వకంగా ఏకాభిప్రాయానికి వచ్చినట్లు వెల్లడించారు. అయితే, సీట్ల పంపకాలపై తుది ఒప్పందానికి సంబంధించిన చర్చలు ఇంకా కొనసాగుతున్నట్లు చెప్పారు. దీనిపై సమాజ్‌వాదీ పార్టీతో పాటు కూటమిలోని ఇతర పార్టీలతో చర్చలు జరిపి.. గురువారం నాటికి అంతా పూర్తి చేస్తామని తెలిపారు. తామంతా మహా వికాస్ అఘాడీ కూటమిగా పోటీ చేస్తున్నామని.. ఎన్నికల్లో 'మహాయుతి కూటమి'పై విజయం సాధించి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని విశ్వాసం వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా.. సీట్ల సర్దుబాటులో జరుగుతోన్న జాప్యం పట్ల చిన్న పార్టీలు గుర్రుగా ఉన్న నేపథ్యంలో ఈ ప్రకటన వెలువడటం గమనార్హం. సమాజ్‌వాదీ పార్టీ, ఆప్, లెఫ్ట్, పీడబ్ల్యూపీలు కూటమిలో ఉన్నాయి. 12 సీట్లు ఆశిస్తున్న సమాజ్‌వాదీ పార్టీ ఇప్పటికే ఐదు చోట్ల అభ్యర్థులను ప్రకటించింది.

**65 సీట్లకు అభ్యర్థుల్ని ప్రకటించిన ఉద్ధవ్**
మరోవైపు, మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు శివసేన (యూబీటీ) అభ్యర్థుల తొలి జాబితా విడుదలైంది. మొత్తం 65మందితో జాబితాను విడుదల చేసింది. ముంబయిలోని వర్లి నుంచి మాజీ సీఎం ఉద్ధవ్ ఠాక్రే తనయుడు ఆదిత్య ఠాక్రే పోటీ చేయనున్నారు.

# కొరియన్ స్పోర్ట్స్ వర్సిటీలా యంగ్ ఇండియాస్పోర్ట్స్ యూనివర్సిటీ

**విశ్వంభర, హైదరాబాద్:** దక్షిణ కొరియాలో పర్యటిస్తున్న రాష్ట్ర బృందం మూడో రోజు ఇంచియాన్ నగరంలోని స్మార్ట్ సిటీలను సందర్శించింది. ప్రజాప్రతినిధులు, అధికారులు కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి స్మార్ట్ సిటీ వ్యవస్థను పరిశీలించారు. రాష్ట్రంలో ఏర్పాటు చేసే యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీకి సహకారం అందించే కొరియన్ నేషనల్ స్పోర్ట్స్ యూనివర్శిటీని సందర్శించారు. అక్కడి అధికారులతో సమావేశమై క్రీడాకారుల్నిమెరికల్లా తీర్చిదిద్దే విధానాల్ని తెలుసుకున్నారు. దక్షిణ కొరియా రాజధాని సియోల్‌లో రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధుల బృందం పర్యటన మూడో రోజు కొనసాగింది. దక్షిణ కొరియాలోని అత్యంత ప్రతిష్ఠాత్మక స్మార్ట్ సిటీ ప్రాజెక్టుల్లో ఒకటైన ఇంచియాన్ స్మార్ట్ సిటీని సందర్శించారు. సాంగ్డో ప్రాంతంలో దాదాపు 15వందల ఎకరాల్లో పర్యావరణ అనుకూల విధానాలతో ఈ స్మార్ట్ సిటీని అభివృద్ధి చేస్తున్నారు. నగరపాలక సంస్థ డైరెక్టర్ యుంగ్ జే సన్‌తో పాటు సభ్యులు, అక్కడి అధికారులతో సమావేశమయ్యారు. కమాండ్ సెంటర్ ద్వారా స్మార్ట్ సిటీల పర్యవేక్షణను బృందం పరిశీలించింది. కొరియాకు అత్యంత ప్రతిష్ఠాత్మకమైన ఇంచియాన్ స్మార్ట్ సిటీ ప్రాజెక్టులో అత్యాధునిక



సమాచార కమ్యూనికేషన్ టెక్నాలజీని కొరియా వినియోగిస్తోంది. ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ సిటిగా దీన్ని అభివృద్ధి చేస్తున్నారు. ఇంచియాన్ అంతర్జాతీయ విమానాశ్రయానికి దగ్గరగా ఉండటం వల్ల ఈ ప్రాంతం ప్రపంచవ్యాప్తంగా వ్యాపార, పర్యాటక హబ్‌గా మారింది. పర్యటనలో భాగంగా కొరియన్ నేషనల్ స్పోర్ట్స్ యూనివర్శిటీని మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు సందర్శించారు.

ఈ యూనివర్శిటీ సహకారంతో మన రాష్ట్రంలో యంగ్ ఇండియా స్పోర్ట్స్ వర్శిటీని ఏర్పాటు చేస్తున్నారు. ఒలింపిక్ సహా ఇతర ప్రతిష్టాత్మక టోర్నీల్లో దక్షిణ కొరియా సాధించే పతకాల్లో కొరియన్ స్పోర్ట్స్ వర్శిటీ వాటా దాదాపు 40శాతం వరకు ఉంది. ఈ స్ఫూర్తితోనే మన రాష్ట్రంలోనూ క్రీడాకారులు పతకాలు సాధించేలా యంగ్ ఇండియా వర్శిటీలో శిక్షణ ఇచ్చేలా కొరియన్ స్పోర్ట్స్ వర్శిటీతో ఒప్పందం చేసుకున్నారు. ఈ క్రమంలో సియోల్‌లో ఉన్న రాష్ట్ర బృందం ఆ వర్శిటీని సందర్శించి శిక్షణతో పాటు కల్పిస్తున్న సౌకర్యాలు, ఇతర అంశాలను పరిశీలించారు. దక్షిణ కొరియా సరిహద్దు ప్రాంతమైన డీఎం జోన్‌ను సియోల్‌లో పర్యటిస్తున్న జర్నలిస్టులు పరిశీలించారు. ఉత్తర, దక్షిణ కొరియాల సరిహద్దు భాగాన్ని సందర్శించి రక్షణ, ఇతర అంశాలను పరిశీలించారు. అనంతరం ఇండియన్ ఎంబసీని సందర్శించి అధికారులతో సమావేశమై అక్కడి పరిస్థితులను తెలుసుకున్నారు.

అలైడ్ హెల్త్ కేర్ సైన్సెస్

# కోర్సులతో భారీ దోపిడీ

- సైన్స్‌లో లేని కోర్సుల పేరిట మోసాలు
- మోసం చేస్తున్న కాలేజీలపై కఠిన చర్యలు తీసుకోవాలి
- విద్యార్థుల జీవితాలతో చెలగాటం
- మొద్దు నిద్రలో వైద్య శాఖ
- చర్యలు తీసుకోకపోతే మరో పోరాటానికి సిద్ధం
- ఏహెచ్ సీపీఏ జనరల్ సెక్రటరీ వంశీప్రసాద్



**విశ్వంభర, హైదరాబాద్:** అలైడ్ హెల్త్ కేర్ సైన్సెస్ కోర్సులతో విద్యార్థులను మోసగిస్తున్న కాలేజీలపై కఠిన చర్యలు తీసుకోవాలని అలైడ్ హెల్త్ కేర్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి కె. వంశీప్రసాద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో మీడియా సమావేశం ఏర్పాటు చేసిన కె. వంశీప్రసాద్ మాట్లాడుతూ... నాణ్యమైన వైద్య విద్యను అందించాల్సిన బాధ్యతను విస్మరించి కొన్ని కాలేజీలు విద్యార్థులకు హెల్త్ సైన్సెస్ కోర్సుల పేరిట మోసాలకు తెరలేపాయని దుయ్యబట్టారు. సైన్స్‌లో లేని B.Voc కోర్సు పేరిట మోసం చేస్తూ చట్టబద్ధత లేని, గుర్తింపు లేని కోర్సులను ప్రవేశపెట్టడంతో విద్యార్థుల భవిష్యత్తు సందిగ్ధంలో నెట్టివేయబడుతున్నారని, అర్హతలేని కళాశాలల వల్ల విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకుంటున్నాయని, సరైన గుర్తింపు లేకుండా నడుస్తున్న కొన్ని విద్యా సంస్థలు విద్యార్థులను మోసం చేస్తున్నాయన్నారు. కాలేజీ యాజమాన్యాలు ఇష్టాను రీతిలో విద్యార్థుల వద్ద లక్షల రూపాయలు ఫీజులు వసూలు చేసి వారి జీవితాలను రోడ్డున పడేస్తున్నారని, నిర్లక్ష్యానికి పాల్పడుతున్న యాజమాన్యాల మీద, మొద్దు నిద్రలో ఉన్న వైద్యశాఖ మేల్కొని గట్టి నిఘా పెట్టి చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థుల సర్టిఫికెట్లను బంధించి వారిని బ్లాక్‌మెయిల్ చేయడం ఆనావాయితిగా వస్తుందని, ఇలాంటి దుశ్చర్యల చేష్టలను అరికట్టాలన్నారు. మోసాలకు పాల్పడుతున్న కొన్ని కాలేజీలపై క్రిమినల్ కేసులు పెట్టి, వాటిని సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ మోసాల వల్ల వందలాది పేద విద్యార్థులు నష్టపోతున్నారని, వారిని ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. కాలేజీ యాజమాన్యాల వలన మోసపోయిన విద్యార్థులకు ఫీజులు వెంటనే తిరిగి చెల్లించాలని ఆయా కాలేజీలను హెచ్చరించారు. బాధిత విద్యార్థులకు ప్రభుత్వ కాలేజీల్లో ప్రవేశం కల్పించి వారి విద్య కొనసాగించేందుకు, వీలు కల్పించాలని ప్రభుత్వానికి సూచించారు. భవిష్యత్తులో ఇటువంటి మోసాలు పునరావృతం కాకుండా ప్రభుత్వం తగిన నియంత్రణ చర్యలు తీసుకోవాలని, ఇలాంటి మోసపూరిత కాలేజీలను నిలువరించాలన్నారు. తక్షణమే ప్రభుత్వం జోక్యం చేసుకుని విద్యార్థులకు తగు న్యాయం చేయాలన్నారు. గత ప్రభుత్వం చేసిన తప్పులకి విద్యార్థులు అనేకసార్లు అన్యాయానికి గురయ్యారని, ప్రభుత్వ నిర్లక్ష్యం ధోరణి తోటి ఈ ప్రైవేట్ అన్ రిజిస్టర్ కాలేజెస్ ఇష్టానుసారంగా పెట్రేగిపోతున్నాయని విమర్శించారు. మోసాలకు తెరలేపి విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్న మోసపూరిత కాలేజీల పట్ల ప్రజలకు అవగాహన కల్పిస్తూ ప్రభుత్వం చిత్త శుద్ధి నిరూపించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మానేపల్లి రాములు, వెంకటేష్, విద్యార్థుల తల్లిదండ్రులు దేవదీపిక పాల్గొన్నారు.

## టీజీఎస్పీ పోలీస్‌ల న్యాయమైన కోరికలు తీర్చాలి



**విశ్వంభర, హైదరాబాద్:** పోలీస్ కుటుంబాల న్యాయమైన కోరికలను పోలీస్ ఉన్నతాది కారులు ప్రభుత్వం తో చర్చించాలి. ఆందోళన చేస్తున్న పోలీస్ కుటుంబాలను వేధించవద్దు.ఆ పోలీస్‌లను ఉద్యోగాలనుంచి తొలగించవద్దు తెలంగాణ ప్రత్యేక పోలీస్ బలగాల కుటుంబసభ్యులు చేస్తున్న ఆందోళన న్యాయమైంది.పౌర సమాజం వాళ్లకు మద్ధతు ఇవ్వాలి.పోలీస్ ల హక్కు లకై వాళ్లకు వాళ్ళు పోరాడే పరిస్థితి లేదు కాబట్టి ఆ కుటుంబసభ్యులు చేస్తున్న పోరాటానికి ప్రజలుగా మనం మద్ధతు ఇవ్వాలి.పోలీస్ లు మిగతా ఉద్యోగుల్లా గానే అన్ని హక్కులు వున్నవాళ్లే. వాళ్లకు హక్కుల తో పాటు బాధ్యతలు వున్నాయి. పోలీస్ ల రాజకీయ నాయకుల మాటలు విని ఎక్కువ సందర్భాల్లో ప్రజా కంటకులుగా మారుతున్నారు. లాకప్ డెత్ లు, తప్పుడు కేసులు,నిర్లక్ష్యం,ఆక్రమణ దారులుకు, దూర్మార్గులకు రక్షణ కల్పించడం విచారణ పేరు తో హింసి ంచడం, ఉద్యమా లను ప్రజాపోరాటాలను అణిచివేయడానికి లాఠీ ఛార్జ్ నుంచి అనేక అప్రజాస్వామిక విధానాలు బూటకపు ఎదురుకాల్పుల వరకు అనేక చట్ట వ్యతిరేక కార్యకలాపాలు చేపట్టి అధికార పక్షానికి వత్తాసు పలకడం వరకు అనేక చెడ్డపనులు చేస్తూ ప్రజలకు దూరం అయ్యారు. అధికారం లో వున్నప్పుడు వాళ్ళను వాడుకుని ప్రతిపక్షం లోకి రాగానే పోలీస్ లను దూర్మార్గులు గా ప్రతిపక్షం వాళ్ళు విమార్శించడం పరిపాటి. అధికార పక్షం లోను వైరి వర్గాలు పోలీస్ లపై పిర్యాదులు చేయడం సర్వసధారణం పోలీసులు ఇవన్నీ అర్ధం చేసుకుని చట్టప్రకారం నడుచుకోవాలని, అధికార పక్షం మాటలు విని అన్యాయాలకు పాల్పడకవద్దని , అలా పాల్పడ్డ వాళ్లకు ఏ పరిస్థితులు వస్తున్నాయో గమనించి పోలీస్ లు మారాలని అంతిమంగా ప్రజల న్యాయమైన పిర్యాదులకు గౌరవం ఇవ్వాలని. చట్టాన్ని రాజ్యాంగాన్ని గౌరవించాలని కోరుకుంటూ.ప్రత్యేక పోలీస్ విభాగల పోలీస్ కుటుంబాలు చేస్తున్న పోరాటాలను అర్ధం చేసుకుని పోలీస్ ఉన్నతా ధికారులు ప్రభుత్వం తో మాట్లాడి వాళ్ల న్యాయమైన కోరికలను నెరవేర్చాలి అని కోరుతున్నాం.రోజుకు ఎనిమిది గంటలు పనిచేయించాలి.నెలకు నాలుగు రోజులు సెలవు దినాలు ఇతర సెలవులు కేటాయించాలి. రాష్ట్రంలో ఒకే పోలీస్ విధానం అమలు చేయాలి.

## త్వరలోనే జీహెచ్ఎంసీ యూనియన్ ఎన్నికలు

**మున్సిపల్ సహకార్ మజ్దూర్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఆదిల్**




**విశ్వంభర, హైదరాబాద్ :** త్వరలోనే జీహెచ్ఎంసీలో యూనియన్ గుర్తింపు ఎన్నికలు జరగనున్నట్లు మున్సిపల్ సహకార్ మజ్దూర్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఆదిల్ షరీఫ్ తెలిపారు. బుధవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో జరిగిన ఐఎన్టీయూసీ సమావేశానికి ఆయన ముఖ్య అతిధిగా హాజరయ్యారు. యూనియన్ కు కొత్త జనరల్ సెక్రటరీగా నియమితులైన ఏవీఎస్ గాంధీని ఆయన సత్కరించారు. ఈ సందర్భంగా ఆదిల్ షరీఫ్ మాట్లాడుతూ జీహెచ్ఎంసీలో ప్రస్తుతం తమ యూనియన్ మినహా మిగిలిన ఏ యూనియన్‌కు కార్మికుల్లో గానీ, ఉద్యోగుల్లో గానీ ఆదరణ లేదన్నారు. ఇప్పటి వరకు గుర్తింపు యూనియన్ ఎన్నికలో విజయం సాధించిన యూనియన్లు కార్మికులు, ఉద్యోగులను మోసం చేశాయన్నారు.

ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఇటీవలే సీఎం రేవంత్ రెడ్డి, సీఎం అడ్వైజర్ వేం నరేందర్ రెడ్డిని కలిసి వినతి పత్రాలు సమర్పించినట్లు ఆయన వివరించారు. తమ వినతికి అనుకూలంగా స్పందించినట్లు ఆయన తెలిపారు. ఎన్నికల్లో తాము విజయం సాధించిన వెంటనే ముఖ్యంగా జీహెచ్ఎంసీలో పర్మినెంట్ ఉద్యోగులకు సైతం ఆరోగ్య భద్రత కోసం వెంటనే హెల్త్ కార్డులను జారీ చేయిస్తామని, దీంతో పాటు పర్మినెంట్ ఉద్యోగులకు ఇండ్ల స్థలాలను కేటాయించేలా సర్కారును కోరనున్నట్లు ఆయన వివరించారు. జనరల్ సెక్రటరీగా బాధ్యతలు చేట్టిన ఏవీఎస్ గాంధీ మాట్లాడుతూ ఉద్యోగులు, కార్మికుల సంక్షేమం కోసం శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో యూనియన్ అడిషనల్ జనరల్ సెక్రటరీ కే. శివకుమార్, వైస్ ప్రెసిడెంట్ ఎం. మౌజెస్, ఐఎన్టీయూసీ వైస్ ప్రెసిడెంట్ విజయ్ కుమార్, జనరల్ సెక్రటరీ వి, నర్సింహాన్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీకి కాసులు కురిపించిన దసరా

*** రూ.307 కోట్ల ఆదాయం**



**విశ్వంభర , తెలంగాణ బ్యూరో :** దసరా పండుగకు తెలంగాణ ఆర్టీసీకి భారీగా కాసుల పంట పండింది. బతుకమ్మ, దసరా పండుగల నేపథ్యంలో టీజీఎస్ఆర్టీసీ 10,512 అదనపు బస్సులను నడిపించింది. పండుగల సందర్భంగా ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉంటుందని ఈనెల 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకు టీజీఎస్ఆర్టీసీ అదనపు బస్సులను అందుబాటులో ఉంచింది. తద్వారా ఆర్టీసీకి రూ.307 కోట్ల 16 లక్షల ఆదాయం సమకూరింది. 15 రోజుల్లో ఆర్టీసీ బస్సుల్లో సుమారు 707.73 లక్షల మంది ప్రయాణం చేసినట్లు ఆర్టీసీ అధికారులు చెబుతున్నారు. బతుకమ్మ, దసరా పండుగల సందర్భంగా ఆర్టీసీ బస్సుల్లో భారీ సంఖ్యలో ప్రయాణించారు. ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకుని టీజీఎస్ఆర్టీసీ 10,512 అదనపు బస్సులను నడిపిన ప్రయాణికులుకు ఇక్కట్లు తప్పలేదు.

ఈ ప్రత్యేక బస్సుల్లో ప్రయాణికుల సౌకర్యార్థం ముందస్తు రిజర్వేషన్ సౌకర్యాన్ని కూడా కల్పించారు. హైదరాబాద్, సికింద్రాబాద్ నుంచి రాష్ట్రం నలుమూలకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడిపించింది. పొరుగున ఉన్న ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర రాష్ట్రాలకు సైతం ఆర్టీసీ అదనపు బస్సులను నడిపించింది. పండుగల నేపథ్యంలో ఈనెల 9, 10, 11 తేదిల్లో ప్రయాణికులు ఎక్కువ సంఖ్యలో ప్రయాణించినట్లు ఆర్టీసీ అధికారులు అంచనావేస్తున్నారు. బతుకమ్మ, దసరా పండుగల నేపథ్యంలో టీజీఎస్ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడిపించింది.

ట్రాఫిక్ రద్దీ నేపథ్యంలో ప్రయాణికుల సమయాభావం తగ్గించేందుకు హైదరాబాద్ శివారు ప్రాంతాల నుంచి కూడా ప్రత్యేక బస్సులను నడిపించింది. సొంతూళ్లకు వెళ్లే వారి కోసం ఎంజీబీఎస్, జేబీఎస్, ఎల్బీనగర్, ఉప్పల్, ఆరాంఘర్, సంతోష్ నగర్, కేపీహెచ్‌బీ తదితర ప్రాంతాల నుంచి స్పెషల్ సర్వీసులను అందుబాటులో ఉంచింది. ఐటీ కారిడార్ ఉద్యోగుల సౌకర్యార్థం గచ్చిబౌలి ఓఆర్ఆర్ మీదుగా విజయవాడ, బెంగళూరు, తదితర ప్రాంతాల నుంచి ప్రత్యేక సర్వీసులను నడిపింది. గత దసరాతో పోల్చితే ఈ సారి మహాలక్ష్మి పథకం అమలు వల్ల రద్దీ ఎక్కువగా ఉంది.



వీ5 న్యూస్ ఛానల్ ఛైర్మన్ వెంకట్ యాదవ్ తండ్రి నర్సయ్య దశ దినకర్మ కార్యక్రమానికి హాజరై నర్సయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించిన వీ3 న్యూస్ ఛానల్ ఛైర్మన్ డా.కాచం సత్యనారయణ గుప్త, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ కార్యదర్శి కోదుమూరు దయాకర్ రావు, బెస్ట్ సేవా సొసైటీ వ్యవస్థాపకులు బుక్కా ఈశ్వరయ్య, సమాచార హక్కు వికాస సమితి వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ యర్రమాధ కృష్ణారెడ్డి, కాంగ్రెస్ నాయకులు దాము మహేందర్ యాదవ్ తదితరులు ఉన్నారు.

- విశ్వంభర, ఆత్మకూరు(ఎం)










# జర్నలిస్టులకు ఆదర్శం జి.ఎస్.వరదాచారి

## నేడు ఆయన జయంతి



వయోధిక పాత్రికేయులు, వయోధిక పాత్రికేయ సంఘు వ్యవస్థాపక అధ్యక్షులు, జి. ఎస్. (గోవర్ధన సుందర) వరదాచారి నిబద్ధత కలిగిన జర్నలిస్టు. ఎందరో గ్రామీణ జర్నలిస్టులకు మార్గ నిర్దేశనం చేశారు. చాలా మంది జర్నలిస్టులకు దిక్సూచి. వర్కింగ్ జర్నలిస్ట్ అసోసి యేషన్, హౌసింగ్ సొసైటీ , ఫిలిం క్రిటిక్స్ అసోసియేషన్ తో పాటు తెలుగు యూని వర్సిటీలో కూడా తన సేవలను అందించారు.

జి.ఎస్. వరదాచారి సీనియర్ తెలుగు భాషా సినీ విమర్శకుడు, పాత్రికేయులు.1988లో పదవీ విరమణ చేసే వరకు ఆంధ్రభూమి పత్రికకు సహ సంపాదకుడిగా ఉన్నారు. వరదాచారి 1932, అక్టోబరు 24న నిజామాబాదు జిల్లాలోని ఆర్మూరులో జన్మించారు. నిజాం పాలనలో బాల్యమంతా గడిసిన వరదాచారి, ఉస్మానియా విశ్వ విద్యాలయంలో డిగ్రీ, పి.జి. డిప్లమా ఇన్ జర్నలిజం చదివారు. తరువాత కొంతకాలం 'ది హిందూ' పత్రికలో ఇంటర్న్‌షిప్ చేశారు.

'కృష్ణా పత్రిక'ను తొలిసారిగా చదివిన వరదాచారి ఆ పత్రికకు పాఠకులుగా మారి, 1948లో ఆంధ్ర జనత పత్రికతో తన జర్నలిజం వృత్తిని ప్రారంభించారు. జర్నలిజం డిగ్రీతో ప్రవేశించిన అతికొద్ది మంది జర్నలిస్టులలో వరదాచారి ఒకరు. నాన్ ముల్కీ సంఘటనలు, ఆంధ్రప్రదేశ్ అవతరణ తరువాత జరిగిన చరిత్రకు ప్రత్యక్ష సాక్షిగా ఉన్న వరదాచారి రాసిన సంపాదక లేఖగా పంపిన 'స్వతంత్ర' అనే రచనను పత్రిక వ్యాసం రూపంలో ప్రచురించింది. అదే ఆయన తొలివ్యాసం. ఆంధ్రభూమి, ఈనాడు పత్రికల్లో జర్నలిస్టుగా పని చేశారు. తెలుగు భాషోద్యమ సమాఖ్య ఉపాధ్యక్షుడిగా ప్రభుత్వంలో తెలుగు భాష వినియోగం కోసం పోరాడారు. తెలుగు విశ్వ విద్యాలయంలో జర్నలిజం విద్యార్థులకు పాఠాలు బోధించారు. పాత్రికేయ రంగంలో తెలుగు విశ్వ విద్యాలయం నుండి గౌరవ డాక్టరేట్ అందుకున్నారు.

**వరించిన పురస్కారాలెన్నో..**

పత్రకార్ శిరోమణి బిరుదు (మొట్ట మొదటి హిందీ పత్రిక ఉదంత మార్తాండ్ 150వ వార్షికోత్సవం సందర్భంగా 1976, నవంబరు 26న కోల్‌కతాలో జరిగిన సర్వ భాష పత్రకార్ సమ్మేళనంలో), దాసరి గోల్డ్ మెడల్ ఉత్తమ ఫిల్మ్ జర్నలిస్ట్, (1986), పత్రికా రచనాచార్య బిరుదు (అక్టోబర్ 24, 1992న షష్టిపూర్తి కార్యక్రమంలో కిన్నెర సంస్థ), తెలుగు విశ్వవిద్యాలయం జర్నలిజంలో ప్రతిభా పురస్కారం (1999), ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుండి ఉత్తమ జర్నలిస్ట్‌గా విఆర్ నార్ల జీవన సాఫల్య పురస్కారం - 2005, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుండి ఉగాది పురస్కారం (2006), తెలుగు విశ్వ విద్యాలయం గౌరవ పురస్కారం (26 ఫిబ్రవరి 2007) అందుకున్నారు.

1956 జూన్ నుండి - 1961 మార్చి వరకు ఆంధ్ర జనత పత్రికలో అసిస్టెంట్ ఎడిటర్ గా, 1961నుండి 1982 వరకు ఆంధ్రభూమి దినపత్రికలో... న్యూస్ ఎడిటర్ గా విశ్రాంతులు (చాలాకాలం 'ఆయనే ఆంధ్రభూమి, ఆంధ్రభూమే ఆయన' అనే పేరు ఉండేది), 1983 నవంబర్ 21నుండి 1988 డిసెంబర్ 26 వరకు ఈనాడు దినపత్రిక ఉప సంపాదకులుగా,1963-64 జర్నలిస్టుల సహకార గృహ నిర్మాణ సంఘం అధ్యక్షుడుగా, 1964-1966 ఆంధ్ర ప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల యూని యన్ ప్రధాన కార్యదర్శిగా, 1980-1981 అధ్యక్షులుగా, 1980-81 ప్రెస్ క్లబ్ స్థాపక కార్యదర్శిగా, 1975-78 ఎ.పి. సినీగోయర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు, 1977 నుంచి. జర్నలిస్ట్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులుగా, రచన జర్నలిజం కళాశాల నిర్వహణ మండలి సభ్యత్వం కలిగి, 23 డిసెంబర్ 1988 డిసెంబర్ 23 నుండి సుదీర్ఘ కాలం తెలుగు విశ్వ విద్యాలయంలో జర్నలిజంలో విజిటింగ్ ప్రొఫెసర్ గా పని చేశారు.

రాష్ట్ర ప్రభుత్వ చలన చిత్ర సబ్సిడీ కమిటీ ఉన్నంత కాలం (1976-78) సభ్యత్వం,. జాతీయ చలన చిత్రాభివృద్ధి సంస్థ వారి స్క్రిప్టు కమిటీ సభ్యత్వం, తెలుగు అకాడమీ వారి పరిపాలనా న్యాయ పదకోశం - సలహా సంఘ సభ్యత్వం - 1981 రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటుచేసిన సాంస్కృతిక వ్యవహారాల రాష్ట్ర సలహా మండలి సభ్యత్వం 1981. ఆంధ్రప్రదేశ్ ప్రెస్ అకాడమీ సభ్యత్వం - 1999-2001 నంది చలన చిత్రాల అవార్డుల కమిటీ సభ్యత్వం కలిగి ఉన్నారు. ఇలాగేనా రాయడం, దిద్దుబాటు , నార్ల వెంకటేశ్వరరావు , మన పాత్రికేయ వెలుగులు, జ్ఞాపకాల వరద, నూరేళ్ళ పత్రికా రచన, తెలుగు పత్రికల పుట్టుక ... తదితర రచనలతో పాటు జర్నలిజం కోర్సు పుస్తకాలు కూడా రాశారు. ఇందిరాగాంధీ ఓపెన్ యూనివర్సిటీ పి.జి. డిప్లొమా విద్యార్థుల కోసం భారత రాజ్యాంగం- డా. బి.ఆర్. అంబేద్కర్, పాఠ్యాంశం, సార్వత్రిక విశ్వ విద్యాలయం వారికోసం పత్రికా చట్టాలు పాఠ్యాంశం రాశారు. అనేక పుస్తకాలకు సంపాదక మండలి సభ్యులుగా (పత్రికా పదకోశం) ఉన్నారు. రేడియో టీవీలలో అనేక ప్రసంగాలు, చర్చా గోష్ఠులు, తదితర కార్యక్రమాలతో బాటు పొలికేక, ప్రజాతంత్ర, తరుణ, కిరీటి వంటి తెలుగు పత్రికలలో, స్కైలైన్ ఇంగ్లీషు దిన పత్రికలో సినిమా శీర్షిక నిర్వహించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం, తిరుపతి మహిళా విశ్వ విద్యాలయం, కాకతీయ విశ్వవిద్యాలయం, జర్నలిజం బోర్డ్ ఆఫ్ స్టడీస్ సభ్యత్వం కలిగి ఉన్నారు.

నిజాన్ని నిర్భయంగా చెప్పటం ఆయన నైజం. తెలుగు దినపత్రికల్లో వస్తున్న భాషా దోషాలను, సంపాదకీయాల్లో దొర్లే గుణదోషాలను ఎత్తి చూపే ఒక శీర్షికను దిద్దుబాటు పేరుతో ఎంవిఆర్ శాస్త్రి సంపాదకత్వంలో నిర్వహించగా, ఆయన నాలుకకు పదును ఎక్కువ కాగా, తమ కలానికీ ఉన్న పదును ఎలాంటిదో చూపారు. 2022 నవంబర్ 3న వరదాచారి ఈ లోకాన్ని వదిలి వెళ్లారు.

దివంగత పాత్రికేయ దిగ్గజం వరదాచారికి హర్ష, శ్రీవాత్సవ ఇద్దరు కుమారులు, శుభ, సౌమ్య ఇద్దరు కుమార్తెలు. ధర్మపురి క్షేత్ర వైష్ణవ కుటుంబీకులు సరోజనను వివాహం చేసుకున్న వరదాచారి, తన కుమారునికి మళ్ళీ అదే కుటుంబ సంబంధం అమ్మాయిని కోడలుగా చేసుకోవడం ద్వారా క్షేత్రంతో విడదీయని సంబంధ బాంధవ్యాలు ఏర్పడ్డాయి. అలా సీనియర్ జర్నలిస్ట్ రామచంద్ర మూర్తి ద్వారా వరదాచారిని కలుసుకునే భాగ్యం పురాకృత సుకృతంగా నేను భావిస్తాను.



-రామ కిష్టయ్య సంగన భట్ల...
9440595494

# సేవా నిరతికి ప్రతిరూపం లక్ష్మీ సెహగల్

## నేడు (అక్టోబర్ 24) కెప్టెన్ లక్ష్మీ సెహగల్ జయంతి



కెప్టెన్ లక్ష్మీ సెహగల్ (అక్టోబర్ 24, 1914... జూలై 23, 2012) ప్రముఖ సంఘ సేవకురాలు, రాజ్యసభ సభ్యురాలు. ఆమె భారత రాష్ట్రపతి పదవికి పోటీ చేసిన తొలి మహిళ. ఆమె తండ్రి స్వామినాథన్ మద్రాసులో ప్రముఖ న్యాయవాది.

ఆమె బ్రిటిష్ ఇండియాలోని మలబార్, మద్రాస్ ప్రెసిడెన్సీలో 1914 అక్టోబర్ 24న జన్మించారు. ఆమె తండ్రి స్వామి నాథన్, తల్లి అమ్ముకుట్టి/ అమ్ము. తల్లి ఎ.వి.అమ్ము కుట్టి సామాజిక సేవా కార్యకర్త. చిన్నతనం లోనే సెహగల్ విదేశీ వస్తు బహిష్కరణ, మద్య నిషేధం వంటి జాతీయ పోరాటాలలో పాల్గొన్నారు. 1938 లో మద్రాసు వైద్య కళాశాలలో ఎం.బి., బి.ఎస్. గైనకాలజీ పూర్తయిన తరువాత 1940లో సింగపూర్ వెళ్లడానికి ముందు చెన్నైలోని ప్రభుత్వ ఆసుపత్రిలో డాక్టర్‌గా పని చేశారు. అక్కడ భారతీయ నిరుపేదల వాడలో వైద్యశాల స్థాపించి, స్థానికంగా ఉన్న భారతీయ కార్మికులకు సేవలందించారు. అక్కడ ఆమె ఉన్న సమయంలో, భారత జాతీయ సైన్యం సభ్యులను కలిసే అవకాశం లభించింది. భారత స్వాతంత్ర్య పోరాటంలో చురుకైన పాత్ర పోషించడం ప్రారంభించారు. ఆమె 1941లో ప్రముఖ స్వాతంత్ర్య సమర యోధుడు రాష్ బెహారీ బోస్ ఏర్పాటు చేసిన ఇండియన్ ఇండిపెండెన్స్ లీగ్‌లో చేరారు.

1943 లో సుభాష్ చంద్రబోస్ సింగపూర్ వచ్చినప్పుడు భారత స్వాతంత్ర్యం కోసం పోరాడటానికి ఒక మహిళా రెజిమెంట్ ప్రారంభించడం గురించి మాట్లాడారు. ఆ సమయంలో లక్ష్మీ సెహగల్ సుభాష్ తో సమావేశ మయ్యారు. నేతాజీ నుండి 'రాణి ఆఫ్ ఝాన్సీ' రెజిమెంట్‌ను స్థాపించడానికి ఆదేశాన్ని పొందారు. ఆయన స్థాపించిన ఇండియన్ నేషనల్ ఆర్మీ ఆధ్వర్యంలోని ఝాన్సీ రెజిమెంట్ కు ప్రాతినిధ్యం వహించారు. అలా ఆమె కెప్టెన్ లక్ష్మిగా మారి సేవలు అందించారు. డాక్టర్‌గా వైద్య సేవలు కూడా అంద జేశారు. ఆమెను 1945 లో బ్రిటిష్ సైన్యం అరెస్టు చేసింది. 1946 వరకు బర్మాలో ఉంచింది. ఆ తర్వాత ఆమెను ఇండియన్ నేషనల్ ఆర్మీ ట్రయల్స్ జరుగుతున్న సమయం లోనే ఇండియాకు పంపించారు.

లక్ష్మీ సెహగల్ 1947లో లాహోర్ కు చెందిన కర్నల్ ప్రేమ్ కుమార్ సెహగల్ ను లాహోర్‌లో వివాహం చేసుకొని కాన్పూర్ లో స్థిరపడి కాన్పూర్ ప్రజలకు వైద్య సేవలం దించారు. స్వాతంత్ర్యా నంతరం ఆల్ ఇండియా డెమొక్రటిక్ ఉమెన్స్ అసోసియేషన్ (ఐద్వా) ఉపాధ్యక్షురాలిగా వివిధ స్థాయిలలో సమాజ సేవకు అంకిత మయ్యారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత, 1971లో లక్ష్మీ సెహగల్ కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా (మార్క్సిస్ట్)... సిపిఎంలో చేరిన ఆమె జీవితాంతం వరకు క్రియాశీలక సభ్యురాలిగా కొనసాగారు.

1971లో, సీపీఎం పక్షాన లక్ష్మీ సెహ్‌గల్ రాజ్యసభ సభ్యురాలిగా ఎన్నికయ్యారు. బంగ్లాదేశ్ సంక్షోభ సమయంలో, ఆమె బంగ్లాదేశ్ నుండి భారత దేశానికి వచ్చిన శరణార్థుల సంరక్షణలో సహాయ పడ్డారు.1981లో ఏర్పాటైన ఆల్ ఇండియా డెమోక్రటిక్ ఉమెన్స్ అసోసియేషన్ వ్యవస్థాపకుల్లో ఆమె కూడా ఒకరు. అక్టోబరు 1984లో, ఇందిరా గాంధీ హత్య నేపథ్యంలో నగరంలో సిక్కు వ్యతిరేక అల్లర్లు చెలరేగినప్పుడు, ఆమె సిక్కు కుటుంబాలకు రక్షణగా నిలిచారు. తన ఆసుపత్రి సమీపంలో ఉన్న దుకాణాలకు, దుకాణదారులకు హాని జరగనివ్వలేదు. 1984 లో, గ్యాస్ విషాదం తర్వాత ఆమె వైద్య బృందంతో భోపాల్‌కు వెళ్లి సేవలు అందించారు. 1998లో ఆమెకు పద్మ విభూషణ్ పురస్కారం ప్రదానం చేయబడింది. 2002 లో జరిగిన రాష్ట్రపతి ఎన్నికల్లో ఏపీజే అబ్దుల్ కలాంకు వ్యతి రేకంగా వామపక్షాల మద్దతుతో వామపక్షాల అభ్యర్థిగా బరిలోకి దిగారు. అయితే కలాం ఎన్నికల్లో విజయం సాధించారు. సామ్యవాదం, సామ్రాజ్య వాద వ్యతిరేకత, సమానత్వం, లౌకికవాదం, సామాజిక న్యాయం, మహిళా సాధికారత వంటి ఆదర్శాలకు ఆమె జీవితాంతం కట్టుబడి ఉన్నారు. 97 సంవత్సరాల వయసులో లక్ష్మీ సెహ్‌గల్ 2012, జూలై 23న కాన్పూర్‌లో మరణించారు. ఆమె మృతదేహాన్ని కాన్పూర్ మెడికల్ కాలేజీకి దానం చేశారు.

## వ్యాసాలు, కవితలకు ఆహ్వానం

**విశ్వంభర ఎడిటోరియల్ పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను, కవితలను ఆహ్వానిస్తున్నాం. ఈ కింది చిరునామాకు పోస్టులో లేదా ఈ-మెయిల్ ద్వారా పంపించగలరు. మీ వ్యాసం 1000 పదాలకు మించకుండా ఉండాలి. తెలుగు యునీకోడ్‌లో టైప్ చేసి పంపిన వాటికి ప్రాధాన్యం ఉంటుంది. రచయితలు విశ్వంభరకు మాత్రమే పంపుతున్నామని హామీపత్రం జత చేయాలి.**

**చిరునామా:**
V3 న్యూస్, విశ్వంభర తెలుగు దినప్రతిక కార్యాలయం, ప్లాట్ నంబర్ 204, రెండో అంతస్తు, బాదం కాంప్లెక్స్, మెట్రో పిల్లర్ నంబర్ 1560 ఎదురుగా, చైతన్యపురి ఎక్స్ రోడ్డు, హైదరాబాద్-500060

ఈ-మెయిల్: editpagevishwambhara@gmail.com
ఇతర వివరాలకు సెల్ నం: 9441222429 సంప్రదించగలరు.

# ప్రపంచ శాంతికి అవిరళమైన కృషి చేస్తున్న ఐక్యరాజ్యసమితి

**నేడు ఐక్యరాజ్య సమితి దినోత్సవం**



ఐక్యరాజ్య సమితి అంతర్జాతీయ చట్టం, భద్రత, ఆర్థిక అభివృద్ధి, సామాజిక అభివృద్ధి , మానవ హక్కులపై సమష్టి కృషి చేసేందుకు ప్రపంచ దేశాలు ఏర్పాటు చేసుకున్న ఒక అంతర్జాతీయ సంస్థ. 20వ శతాబ్దం మానవాళిని అతలాకుతలం చేసింది. 1930 నాటి మహామాంద్యం వల్ల ఐరోపాలో నియంతలు అధికార పీఠాలు అధిరోహించారు. ఆపై సంభవించిన రెండో ప్రపంచ యుద్ధం, మానవాళి చరిత్రనే రక్తాక్షరాలతో లిఖించింది. అలాంటి పరిస్థితుల్లో ప్రపంచం ఎదుర్కొం టున్న సమస్యల పరిష్కారానికి ఒక బహుముఖీన అంతర్జాతీయ సంస్థ అవసరమని ప్రపంచ నాయకులు భావించారు. ఆ భావనకు ఒక రూపం కల్పించారు. తరవాత అదే ఐక్యరాజ్య సమితిగా ఆవిర్భ వించింది. నానాజాతి సమితి (లీగ్ ఆఫ్ నేషన్స్) రెండవ ప్రపంచ యుద్ధాన్ని నివారించుటలో విఫల మగుటచే దానికి ప్రత్యామ్నా యంగా 1945లో ఐక్యరాజ్య సమితి స్థాపించ బడింది. ప్రతి సభ్య దేశమూ ఐ.రా.స. సాధారణ సభలో సభ్యత్వం కలిగి ఉంటుంది. ఐ.రా.స. చార్టర్ 2వ ఛాప్టర్ 4వ ఆర్టికిల్ ప్రకారం ఏదైనా దేశానికి ఐ.రా.స. సభ్యత్వం రావాలంటే ఐ.రా.స. భద్రతా సభ ఆమోదంపై, ఐ.రా.స. సాధారణ సభ తీర్మానం జరగాలి. నియమాల ప్రకారం సంపూర్ణ స్వాధిపత్యం ఉన్న దేశాలు మాత్రమే సభ్యత్వానికి అర్హత కలిగి ఉంటాయి. కాని ఐ.రా.స. ఏర్పాటు సమయంలో చేరిన నాలుగు ఆరంభ సభ్య దేశాలకు (బెలారస్, భారత దేశం, ఫిలిప్పీన్స్, ఉక్రెయిన్) అప్పటికి సంపూర్ణ స్వాతంత్ర్యం లేదు. అంతే కాకుండా భద్రతా సభ ఆమోదం ఉండాలన్న నిబంధన కారణంగా మాంటివిడియో కన్వెన్షన్ ప్రకారం స్వాధిపత్యం కలిగిన కొన్ని దేశాలు కూడా, మరి కొన్ని ఐ.రా.స. సభ్య దేశాలు వ్యతిరేకించిన కారణంగా ఐ.రా.స. సభ్యత్వం కలిగి లేవు. 1945లో ఐ.రా.స. ఏర్పడినప్పుడు 51మంది సభ్య దేశాలున్నాయి. వాటిలో 49 దేశాలు ఇప్పటికీ సభ్యులుగా ఉన్నాయి. లేదా వారి సభ్యత్వం వేరే దేశాలకు సంక్రమించింది. ఉదాహరణకు సోవియట్ యూనియన్ సభ్యత్వం రష్యాకు సంక్రమించింది. ప్రస్తుతము 193 దేశాలు ఐక్యరాజ్య సమితిలో సభ్య దేశాలుగా ఉన్నాయి. ఐక్యరాజ్య సమితిలో ప్రధానంగా 6 అంగాలు ఉన్నాయి. సర్వప్రతినిధి సభలో ఐక్యరాజ్య సమితిలో ప్రవేశించిన అన్ని దేశాలకు సభ్యత్వం ఉండగా, భద్రతా మండలిలో 15 దేశాలకు మాత్రమే సభ్యత్వం ఉంటుంది. అందులో 10 దేశాలు రెండేళ్ళ కోసారి ఎన్నిక ద్వారా సభ్యత్వం పొందగా, మరో 5 దేశాలు శాశ్వత సభ్య దేశాలు. అవి: అమెరికా, రష్యా, బ్రిటన్, చైనా, ఫ్రాన్స్. ప్రధాన కార్యాలయం న్యూయార్క్ నగరంలో ఉంది. దీని ప్రస్తుత ప్రధాన కార్యదర్శి ఆంటానియో గుట్టెర్స్. ఐక్యరాజ్య సమితి స్థాపించబడిన అక్టోబరు 24వ తేదీని ప్రతి సంవత్సరం ఐక్యరాజ్య సమితి దినోత్సవంగా పాటిస్తారు. రెండవ ప్రపంచ యుద్ధం జరుగుతున్న సమయంలోనే 1941 ఆగస్టులో అమెరికా అధ్యక్షుడు థియోడార్ రూజ్‌వెల్ట్ , బ్రిటిష్ ప్రధాని విన్‌స్టన్ చర్చిల్ అట్లాంటిక్ సముద్రంలో ఒక ఓడలో సమావే శమై కుదుర్చుకొన్న ఒప్పందాన్ని అట్లాంటిక్ ఛార్టర్ అంటారు. ప్రాదేశిక సమగ్రత కాపాడడం, యుద్ధభయాన్ని తొలగించడం, శాంతిని నెలకొల్పడం, నిరాయుధీ కరణ వంటి ఎనిమిది అంశాలు ఈ ఒప్పందంలో ఉన్నాయి. ఈ ఒప్పందమే తరువాత ఐక్య రాజ్య సమితి సిద్ధాంతాలకు మౌలిక సూత్రాలుగా గుర్తింపు పొందినది.

తరువాత 1944లో వాషింగ్టన్ లోని డంబార్టన్ ఓక్స్ వద్ద జరిగిన సమావేశంలో అమెరికా, బ్రిటన్, రష్యా ప్రతినిధులు ఐ.రా.స. ప్రకటన పత్రం ముసాయిదాను తయారు చేశారు. 1945 ఫిబ్రవరిలో యాల్టా సమావేశంలో అమెరికా, బ్రిటన్, రష్యా నేతలు ప్రపంచ శాంతి పరిరక్షణ కోసం ఒక అంతర్జాతీయ సంస్థను స్థాపించాలని తీర్మానం చేశారు. శాన్ ఫ్రాన్సిస్కో నగరంలో 1945 ఏప్రిల్ 25నుండి జూన్ 26 వరకు జరిగిన అంతర్జాతీయ సమా వేశంలో 51 దేశాల ప్రతినిధులు పాల్గొని ఐక్య రాజ్య సమితి ఛార్టర్‌పై సంతకాలు చేశారు. 1945 అక్టోబరు 24న న్యూయార్క్ నగరంలో ఐక్య రాజ్య సమితి లాంఛనంగా ప్రారంభమైంది.

యుద్ధాలు జరగకుండా చూడటం, అంతర్జాతీయ తగాదాలను శాంతి యుతంగా పరిష్కరించడం, దేశాల మధ్య స్నేహ సంబంధాలను పెంపొందించడం, అంతర్జాతీయ బాధ్యతలను అన్ని దేశాలు గౌరవించేటట్లు చేయడం, సాంఘిక అభివృద్ధి సాధించి, మానవ జీవితాలను సుఖమయం చేయడం తదితరాలు సమితి ఆశయాలు. అప్పటి అమెరికా అధ్యక్షుడు ఫ్రాంక్లిన్ రూజ్‌వెల్ట్ 'యునైటెడ్ నేషన్స్' అనే పదాన్ని తొలిసారి ప్రవేశ పెట్టాడు. ఐరాస పతాకాన్ని 1947 అక్టోబరు 20న ఆమోదించారు. ఈ పతాకం లేత నీలం, తెలుపు రంగుల్లో ఉంటుంది. పతాకం మధ్యలో ఐరాస చిహ్నా మైన ప్రపంచ పటం రెండు ఆలివ్ కొమ్మల మధ్య ఉంటుంది. ఆలివ్ కొమ్మలు శాంతికి చిహ్నం. ఐరాసకు ఆరు అధికారిక భాషలున్నాయి అవి చైనీస్, ఇంగ్లిష్, ఫ్రెంచ్, రష్యన్, స్పానిష్, అరబిక్. ఐక్యరాజ్య సమితికి 6 ప్రధానాంగాలు ఉన్నాయి...

**సర్వ ప్రతినిధి సభ:** సభలో సభ్యదేశాలన్నింటికీ ప్రాతినిధ్యం ఉంటుంది. ప్రతి దేశానికి సమానంగా ఒక్క ఓటు ఉంటుంది. సమావేశాలకు ప్రతి సభ్యదేశం గరిష్ఠంగా 5 గురు సభ్యులను పంపవచ్చు. ఈ సభ సంవత్సరానికి ఒక పర్యాయం, సాధారణంగా సెప్టెంబరు మాసంలో, సమావేశమౌతుంది. భద్రతా మండలి: సమితి ప్రారంభమయ్యేనాటికి ఇందులో సభ్యదేశాల సంఖ్య 11. ప్రస్తుతం 15 సభ్యదేశాలు ఉన్నాయి. అందులో 5 శాశ్వత సభ్యదేశాలు కాగా 10 రెండేళ్ళ కాలవ్యవధి కొరకు ఎన్నిక కాబడు తాత్కాలిక సభ్యదేశాలు. అమెరికా, రష్యా, ఇంగ్లాండు, చైనా, ఫ్రాన్సులు ఇందులో శాశ్వత సభ్యదేశాలు. ఈ శాశ్వత సభ్యదేశాలకు వీటో అధికారం కూడా ఉంది.

సచివాలయం: ఇది ఐ.రా.స. వ్యవహారాలు నిర్వహించే కార్యనిర్వాహక విభాగం. దీని ప్రధాన కార్యాలయం న్యూయార్క్ నగరంలో ఉంది. ఇందులో పది వేలకు పైగా ఉద్యోగులు పనిచేస్తారు. సచివాలయానికి ప్రధానాధికారిని సెక్రటరీ జనరల్ అంటారు.

**ధర్మకర్తృత్వ మండలి:** కొన్ని పాశ్చాత్య దేశాల వలస పాలన క్రింద కొనసాగిన భూభాగాల ప్రయోజనాలను కాపాడడం ఈ మండలి లక్ష్యం. ఇక్కడి ప్రజలను స్వీయ ప్రతిపత్తికి లేదా స్వయం పాలనకు లేదా స్వాతంత్ర్యానికి సిద్ధం చేయడం ఈ మండలి బాధ్యత.

**ఆర్థిక, సాంఘిక మండలి:** ఇది సాధారణ సభ అధ్వర్యంలో పనిచేస్తుంది. ఇందులో 54 మంది సభ్యులుంటారు. ప్రజల జీవన స్థాయిని మెరుగు పరచడం, విద్య, సాంస్కృతిక, ఆరోగ్య రంగాలలో అంతర్జాతీయ సహకారానికి కృషి చేయడం, మానవ హక్కులను సమర్థించడం వంటివి ఈ మండలి ఆశయాలు.

**అంతర్జాతీయ న్యాయస్థానం:** ఇది "ప్రపంచ న్యాయస్థానం"గా పిలువ బడుతుంది. ఐక్యరాజ్య సమితి యొక్క ప్రాథమిక తీర్పులను ప్రకటించే అంగము. దీని కేంద్రం నెదర్లాండ్ లోని హేగ్ నగరంలోగల, శాంతి సౌధంలో యున్నది. అంతర్జాతీయ న్యాయస్థానంలో న్యాయమూర్తి పదవిని నలుగురు

**భారతీయులు చేపట్టారు.**

1.బెనగళ్ నరసింగరావు, 2. కె.నాగేంద్రసింగ్, . రఘునందన్ స్వరూప్ పాఠక్, 4. దల్వీర్ భండారీ (ప్రస్తుతం కొనసాగుతున్నారు.)

ఐక్యరాజ్య సమితి అనుబంధ సంస్థలు...ఆహార , వ్యవసాయ సంస్థ; అంతర్జాతీయ కార్మిక సంస్థ; ప్రపంచ ఆరోగ్య సంస్థ; ఐక్య రాజ్య సమితి శరణార్థుల హైకమిషనర్; విశ్వ తపాలా సంఘం - యూనివర్సల్ పోస్టల్ యూనియన్; ప్రపంచ వాతావరణ సంస్థ; అంతర్జాతీయ అణుశక్తి సంస్థ; ఐక్య రాజ్య సమితి వాణిజ్య అభివృద్ధి సదస్సు; అంతర్జాతీయ టెలికమ్యూనికేషన్ యూనియన్; అంతర్జాతీయ పునర్వ్యవస్థీకరణ, అభివృద్ధి బ్యాంకు లేదా ప్రపంచ బ్యాంకు; అంతర్జాతీయ ద్రవ్య నిధి - ఐ.ఎం.ఎఫ్. ఉన్నాయి. ఐక్యరాజ్య సమితి స్థాపించిన నాటి నుండి నేటి వరకు 76 సంవత్సరాల కాలంలో ప్రపంచ శాంతికి దోహదం చేసే ఎన్నో కార్యకలాపాలను నిర్వహించింది. ఐతే ప్రపంచాన్ని వణికిస్తున్న తీవ్రవాదాన్ని నివారించడంలో సమితి విఫలం అయ్యింది. ఐక్యరాజ్య సమితిలోని అగ్ర రాజ్యాల ఆధిపత్యం కొనసాగు తుండటం చిన్న దేశాలకు శాపంగా మారుతున్నది. అగ్ర రాజ్యాల చేతిలో ఉన్న ఐరాస తన లక్ష్యాలను నెరవేర్చలేక పోతున్నది. కాలం గడుస్తున్న కొద్దీ ఐరాస బలహీన పడుతున్నదనే విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి. 76 ఏళ్ళ పాటు ప్రపంచ శాంతికి అవిరళమైన కృషి చేసిన ఐరాస మరో ప్రపంచ యుద్ధం రాకుండా చూసి, మానవాళిని కాపాడ గలదని మనసారా ఆశిద్దాం.

# స్కాలర్‌షిప్స్, ఫీజు రీయంబర్స్‌మెంట్ విడుదల చేయాలి

## ఏఐఎస్ఎఫ్ డిమాండ్




**విశ్వంభరం, మహబూబాబాద్:** రియంబర్స్ మెంట్, స్కాలర్షిప్ విడుదల పై ప్రభుత్వ నిర్లక్ష్యం సరికాదని, పెండింగ్ లో ఉన్న స్కాలర్ షిప్ ఫీజు రియంబర్స్ మెంట్ లను వెంటనే విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మాగం లోకేష్, వెలుగు శ్రావణ్ ఆధ్వర్యంలో మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో భారీ ర్యాలీ చేపట్టారు. ప్రభుత్వాలు మారినా విద్యార్థుల జీవితాలు మారటం లేదని, తెలంగాణ రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్మెంట్, స్కాలర్షిప్ బకాయిలు విడుదల చేయడానికి నిధులు ఇవ్వకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తే విద్యార్థులు చదువుకునేది ఎట్లా అని, ఫీజు బకాయిల విడుదల పై అనాడు రేవంత్ రెడ్డి చెప్పింది ఏంది, నేడు చేస్తున్న జాప్యంఏంటని వారు ప్రశ్నించారు. ఫీజు బకాయిలను 27లోపు విడుదల చేయక పోతే చలో ఇందిరాపార్క్ నిర్వహిస్తామని వేలాది మంది విద్యార్థులతో హైదరాబాద్ దిగ్బంధనం చేస్తామని హెచ్చరించారు. బుధవారం ఏఐఎస్ఎఫ్ మహబుబాబాద్ జిల్లా కౌన్సిల్ ఆధ్వర్యంలో పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్మెంట్, స్కాలర్షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఛలో కలెక్టరేట్ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు ర్యాలీగా కలెక్టరేట్ కి వెళ్ళారు అక్కడ పోలీసులు అడ్డుకోవడంతో గేటు ముందు బైఠాయించి తమ నిరసనను తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో గత మూడు విద్యాసంవత్సరాల నుండి ఫీజు రియంబర్స్మెంట్, స్కాలర్షిప్ బకాయిల విడుదల లేకవిద్యార్థులు వారి తల్లి దండ్రులు, సిబ్బందికి జీతాలు ఇవ్వలేక భవన కిరాయిలు చెల్లించలేక ప్రైవేట్ డిగ్రీ, పీజీ ఇంజనీరింగ్ ఫార్మసీ కళాశాలల యాజమాన్యాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటూన్నాయని అన్నారు. గత మూడు సంవత్సరాల నుండి ఫీజుబకాయిలు విడుదల కాకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు నాలుగు రోజులు బంద్ చేసిన ప్రభుత్వం విడుదల చేయకుండా పెడచెవిన పెట్టడం సిగ్గు చేటనీ, గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఫీజు బకాయిల విడుదల చేయడంలో నిర్లక్ష్యం చేసిందని మాట్లాడిన కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఫీజు బకాయిలు మొత్తం ఒకే సారి విడుదల చేస్తామని చెప్పిన ఆనాటి పీసీసీ అధ్యక్షుడు, నేడు కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రిగా ఉన్న రేవంత్‌రెడ్డి అధికారంలోకివచ్చి పదినెలలు కావస్తున్న ఇప్పటికీ ఫీజురీయింబర్స్మెంట్, స్కాలర్షిప్ బకాయిల విడుదల చేయడంలో నిర్లక్ష్యం చేయడం సరికాదని, విద్యాశాఖ కూడా తన వద్దే పెట్టుకున్న విద్యాశాఖకి నిధులు కేటాయించి విద్యార్థులకు ఖర్చు చేయడంలో తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నారని, రాష్ట్రంలో అనేక రకాల ఖర్చులు చేస్తూ అనేక చెల్లింపులు చేస్తున్న ప్రభుత్వం ఫీజు బకాయిలు విడుదల చేయడంలో చేస్తున్న నిర్లక్ష్యం సరికాదని వెంటనే ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్నఫీజు బకాయిలు టోకెన్ ఇచ్చినవి కాకుండా పెండింగ్‌లో ఉన్న బకాయిలు మొత్తం ఒకే సారి విడుదల చేయాలని లేనిపక్షంలో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఫీజు బకాయిల విడుదల అయ్యే వరకు పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని, చలో సచివాలయం నిర్వహిస్తామని మణికంత రెడ్డి హెచ్చరించారు. ఏఐఎస్ఎఫ్ రాష్ట్రసమితి సభ్యులు బందు మహేందర్, జిల్లా సహాయ కార్యదర్శి మేకవెంకటేష్, పట్టన కార్యదర్శి చెలువూరి వికాస్, సాయి, ప్రకాష్, అశోక్, ప్రనయ్, విద్యార్థినీ విద్యార్దులు పాల్గొన్నారు.

## ఉచితంగా చేప పిల్లల పంపిణీ



**విశ్వంభర, భూపాలపల్లి:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలంలో ఉచితంగా చేప పిల్లలను పంపిణీ చేయడం జరిగింది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మత్స్యశాఖ ఏడీ అవినాష్ ఆదేశాల మేరకు ఫీల్డ్ ఆఫీసర్, ఫిల్డ్ అసిస్టెంట్లు బోచ్చె, రాహు, బంగారు తీగ రకాల చేప పిల్లలను కాటారం ఎంపీడీవో అడ్డూరి బాబు చేతుల మీదుగా పంపిణీ చేశారు. కాటారం మండలంలోని గంగపురి, ఇబ్రహీం పల్లి, కోత్తపల్లి, ధన్వాడ, రేగులగూడెం, విలాసాగర్ చెరువులు, కుంటల్లో పెంచడానికి మత్స్యకారులకు ఐదు లక్షల నాలబై వేల చేప పిల్లలు పంపిణీ చేసినట్లు ఎఫ్ వో రమేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా మత్స్యశాఖ అధికారులు, కాటారం ఎంపీడీవో మత్స్యశాఖ డైరెక్టర్లు, మత్స్యకారులు పాల్గొన్నారు.

# చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ గోడ పత్రిక ఆవిష్కరణ



**విశ్వంభర, మహబూబాబాద్:** జన విజ్ఞాన వేదిక మహబూబాబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ - 2024కు సంబంధించిన గోడ పత్రిక (పోస్టర్)ను మహబూబాబాద్ జిల్లా జాయింట్ కలెక్టర్ డేవిడ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు సాహితీ శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ సంవత్సరం కూడా ఈ చెకిముఖి సైన్స్ టాలెంట్ టెస్ట్ ను పాఠశాల స్థాయి, మండల స్థాయి, జిల్లా స్థాయి, రాష్ట్రస్థాయి ఇలా నాలుగు దశలలో నిర్వహిస్తున్నామన్నారు. ఈ పరీక్షలో పాల్గొనడం వల్ల విద్యార్థినీ, విద్యార్థులలో సైన్స్ పట్ల అభిరుచి, శాస్త్రీయ దృక్పథం పెంపొందుతుందని తెలియజేశారు. కనుక, ప్రభుత్వ మరియు ప్రైవేటు పాఠశాలలలో చదువుతున్నటువంటి 8వ, 9వ, 10వ తరగతుల విద్యార్థినీ, విద్యార్థులను పాల్గొనే విధంగా చూడాలని కోరారు. జిల్లాలోని ప్రభుత్వ మరియు ప్రైవేటు అన్ని పాఠశాలల ప్రధానాచార్యులు, యాజమాన్యాలు సహకారించాలని కోరారు. జిల్లా ప్రధాన కార్యదర్శి చొప్పరి శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ పరీక్షను మొదట పాఠశాల స్థాయి నవంబర్ 07 న, ఆ తర్వాత మండల స్థాయి నవంబర్ 21న, తర్వాత జిల్లాస్థాయి నవంబర్ 28న, చివరిగా రాష్ట్రస్థాయిలో డిసెంబర్ 14, 15, 16 న ఆదిలాబాద్ జిల్లాలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ పరీక్ష నిర్వహణలో మండల మరియు జిల్లా విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు, సైన్స్ ఉపాధ్యాయులు సహకరించాలని కోరారు. పరీక్ష పత్రాల కొరకు మండల చెకిముకి కన్వీనర్ లను సంప్రదించవచ్చని తెలిపారు. ఇతర వివరాల కోసం జిల్లా చెకుముకి కన్వీనర్ ఆగుర్తి సురేష్ 9291653497 నంబర్ ను సంప్రదించాలని కోరారు. ఇంకా ఈ కార్యక్రమంలో జిల్లా విద్యా కన్వీనర్, రాష్ట్ర బాధ్యులు, బ్రహ్మం, సీనియర్ నాయకులు కృష్ణ ప్రసాద్ పాల్గొన్నారు.

# అగ్ని ప్రమాదాలపై విద్యార్థులకు అవగాహన



**విశ్వంభర, సంగారెడ్డి:** పటాన్ చేరు పట్టణ పరిధిలోని కిడ్జి పాఠశాల విద్యార్థులకు బుధవారం అగ్ని ప్రమాదాల నివారణ, భద్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు చక్రవర్తిని సూచనల మేరకు పటాన్ చేరు అగ్నిమాపక సిబ్బంది అగ్ని ప్రమాదాల సమయంలో ఎలా వ్యవహరించాలో విద్యార్థులకు వివరించారు. ప్రమాదాలు జరిగినప్పుడు హడావుడి పడకుండా, నివారణకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. అగ్నిప్రమాదం జరిగినప్పుడు అందుబాటులో ఉన్న పరికరాలను ఎలా వినియోగించాలో విద్యార్థులకు స్వయంగా అగ్నిమాపక సిబ్బంది చూపిం చారు. అలాగే అగ్నిని నియంత్రించడం, తమను కాపాడు కోవడంతోపాటు, ఇతరులను రక్షించ డంపై అగ్నిమాపక కేంద్రంలో అవగాహన కల్పించారు. అగ్నిమాపక అధికారి నాగేంద్ర, అగ్నిమాపక సిబ్బంది, కిడ్జి పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు చక్రవర్తిని, ఉపాధ్యాయురాలు లలిత, వినోద్ పాల్గొన్నారు.



కేరళలోని వయనాడ్ లోక్‌సభ స్థానానికి జరిగే ఉపఎన్నికలో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా ప్రియాంక గాంధీ నామినేషన్ కార్యక్రమానికి హాజరైన లోక్‌సభ ప్రతిపక్షనాయకుడు రాహుల్ గాంధీని మర్యాదపూర్వకంగా కలిసిన టీపీసీసీ అధికార ప్రతినిధి బండి సుధాకర్ గౌడ్

(విశ్వంభర, హైదరాబాద్)

# ధాన్యం కొనుగోళ్లపై పూర్తి అవగాహన కలిగి ఉండాలి

## అధికారులకు సూచించిన కలెక్టర్ రాహుల్ శర్మ



**విశ్వంభర, భూపాలపల్లి:** ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. బుధవారం ఐడీఓసీ కార్యాలయంలో పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో 2024-25 వరి ధాన్యం కొనుగోలుపై జిల్లా పౌర సరఫరాల సంస్థ ఆధ్వర్యంలో మార్కెటింగ్, సహకార, డీఆర్డీఓ, వ్యవసాయ, తూనికలు, కొలతల శాఖల అధికారులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ధాన్యం కొనుగోళ్లలో ఎలాంటి ఇబ్బందులు రాకుండా కొనుగోలు కేంద్రాల ఇంచార్జిలు పూర్తి అవగాహన కలిగి ఉండాలని ఆదేశించారు. సన్న, దొడ్డు రకం ధాన్యాలను సకాలంలో, వేరువేరు కౌంటర్ల ద్వారా కొనుగోలు చేయడానికి కేంద్రాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేయాలనీ, రకాలను గుర్తు పట్టేందుకు స్పష్టమైన మార్కింగ్ చేయాలని సూచించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తగిన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. నవంబర్ మొదటి వారం నుండి ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చే అవకాశం ఉన్నందున, ముందస్తు చర్యలతో పూర్తిస్థాయిలో సన్నద్ధంగా ఉండాలని సూచించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియ పర్యవేక్షణను మండల, జిల్లా అధికారులు పర్యవేక్షకు నియమించనున్నట్లు తెలిపారు. రవాణాకు ఓపీఎంఎస్ ఎలాంటి తప్పులు లేకుండా నమోదులు చేయాలని పేర్కొన్నారు. సన్న, దొడ్డు రకం ధాన్యం గుర్తించడానికి వీలుగా పరికరాల ద్వారా పరిశీలన చేయాలని సూచించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియకు నూతనంగా అందుబాటులోకి తెచ్చిన సాఫ్ట్ వేర్ ను డౌన్లోడ్ చేసుకోవాలని అన్నారు. కొనుగోలు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో నిల్వ లేకుండా ఎప్పటికప్పుడు ట్యాగింగ్ చేసిన మిల్లులకు రవాణా చేయాలని ఆయన ఆదేశించారు. అకాల వర్షాలు వస్తే ధాన్యం తడవకుండా ఎతైన ప్రాంతాల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం సన్న, దొడ్డు రకాలు గుర్తించడం, కొనుగోళ్లలో పాటించాల్సిన జాగ్రత్తలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కొనుగోలు కేంద్రాల ఇంచార్జిలకు అవగాహన కల్పించారు. కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, పౌరసరఫరాల అధికారి శ్రీనాథ్, పౌర సరఫరాల సంస్థ డీఎం రాములు, మార్కెటింగ్ అధికారి కనుక శేఖర్, డీ ఆర్ డీ ఓ అవినాష్, సహకార అధికారి వాలియా నాయక్, వ్యవసాయ అధికారి విజయభాస్కర్, తూనికల కొలతల శాఖ అధికారి శ్రీలత, పాల్గొన్నారు.06

# పరిశుభ్రమైన త్రాగునీటిని అందించాలి

## ట్యాంక్ పైకెక్కి నీటిని పరిశీలించిన ఎంపీడీఓ కుసుమ మాధురి



**విశ్వంభర, ఆమనగల్లు:** త్రాగునీరు కలుషితం కాకుండా పరిశుభ్రమైన సుద్దనీటిని ప్రజలకు అందించాలని అమనగల్లు ఎంపీడీఓ కుసుమ మాధురి గ్రామపంచాయతీ కార్యదర్శులకు సూచించారు. బుధవారం ఆమనగల్లు మండలంలోని మేడి గడ్డ తాండ గ్రామపంచాయతీలో మీషన్ భగీరథ ఓహెచ్ఎస్ఆర్ వాటర్ ట్యాంక్ పైకెక్కి త్రాగునీటిని పరిశీలించారు. వారానికి 3 సార్లు ట్యాంక్ లను శుభ్రపరిచి బ్లీచింగ్ పౌడర్ వేయించాలని గ్రామపంచాయతీ కార్యదర్శి వెంకటయ్య కు తెలిపారు. ఇంటి ముందు ఉన్న నల్లాలు ట్యాంకుల ముందు అపరిశుభ్రంగా ఉండకుండా చూసుకోవాలని కోరారు. మురికి నీరు నిల్వవుండటం వల్ల త్రాగునీరు కలుషితమైన ప్రజలు రోగాలబారిన పడతారని వాటి వద్ద పరిశుభ్రంగా వుండే విదంగా చూసుకోవాలని కోరారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల అనుసారం ప్రతి గ్రామపంచాయతీ కార్యదర్శి, జీపీ ప్రత్యేక అధికారులు తమకు కేటాయించిన గ్రామాలను సందర్శించాలని కోరారు. ఆమె వెంట మిషన్ భగీరథ ఏఈ వాగ్దేవి, కార్యదర్శి వెంకటయ్య, గ్రామస్తులు విజయ్ రాథోడ్, రవీందర్‌లు పాల్గొన్నారు.

# నైపుణ్యం ఉంటే ఉపాధి మీ చెంతే..

## ఘనంగా గీతం 'కోగన్ ఫ్యూజన్ ఫెస్ట్'



**విశ్వంభర, సంగారెడ్డి:** ఎంపిక చేసుకున్న ఒక సాంకేతికత, అంశం లేదా రంగంలో భావి ఇంజనీర్లు నైపుణ్యం సాధిస్తే, ఉపాధే వారిని వెతుక్కుంటూ వస్తుందని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, హైదరాబాదులోని డైరెక్టరేట్ ఆఫ్ స్టూడెంట్ లైఫ్ ఆధ్వర్యంలో 'కోగన్ ఫ్యూజన్ ఫెస్ట్'ని బుధవారం ఘనంగా, ఉత్సాహభరితంగా నిర్వహించారు. ఇందులో భాగంగా సాంకేతిక చర్చ, ప్రాజెక్టుల ప్రదర్శనను కూడా ఏర్పాటుచేసి, విద్యార్థులు తమ సాంకేతిక నైపుణ్యాలను ప్రదర్శించడానికి, వినూత్న ఆలోచనలను పంచుకోవడానికి ఒక వేదికను అందించారు. అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలు, పరిశ్రమ పోకడపై అభ్యాసం, ఆవిష్కరణలు, నైపుణ్యాలను పెంపొందించడం లక్ష్యంగా దీనిని ఏర్పాటు చేశారు. జొమాటో పూర్వ సాంకేతికాభివృద్ధి ఇంజనీరు జి.బి. హరవర్ధన్, లేస్ట్ అకాడమీ ముఖ్య కార్యనిర్వహణాధికారి నరసింహ మిక్కిలినేని, స్కేలార్ ఆర్గానిక్ గ్రోత్ స్పెషలిస్ట్ స్వరూప్ వీఐటీబి, కేఎల్ఏ సాఫ్ట్ వేర్ ఇంజనీర్ వసంత కుమార్ తదితరులు ఈ కార్యక్రమంలో అతిథులుగా పాల్గొని, విద్యార్థులకు పలు సూచనలు చేశారు. అత్యాధునిక సాంకేతికతలు, కెరీర్ వృద్ధి, వేగంగా అభివృద్ధి చెందుతున్న టెక్ ల్యాండ్ స్కేప్ పై వారి నైపుణ్యాన్ని పంచుకున్నారు. రంగంలో ట్రెండింగ్ టెక్నాలజీలు, ఇంటర్న్ షిప్, జాబ్ మార్కెట్‌లపై అవగాహన కల్పించడమే గాక, విద్యార్థులకు మార్గనిర్దేశనం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు వినూత్న సాఫ్ట్ వేర్ ఆధారిత ప్రాజెక్టులను ప్రదర్శించి, వారి సృజనాత్మకత, సాంకేతిక నైపుణ్యాలను చాటి చెప్పారు. ప్రాజెక్ట్ ఎక్స్ పో విజేతలకు బహుమతులు, ప్రశంసా పత్రాలను ప్రదానం చేశారు. మొత్తంగా, ఈ వేడుకలో పాల్గొన్న వారు వృత్తిపరమైన పరిచయాలను పెంచుకోవడానికి, తాజా సాంకేతిక పోకడలపై లోతైన అవగాహనను ఏర్పరచుకున్నారు.

## పూసల సంఘం భవనానికి రూ. 5 లక్షలు మంజూరు



**విశ్వంభర, ఆమనగల్లు:** ఆమనగల్లు పూసల సంఘం ఆధ్వర్యంలో సంఘం భవన నిర్మాణము కొరకు కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డిని ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి వినతి పత్రం అందజేశారు. ఎమ్మెల్యే వెంటనే స్పందించి బీసీ భవనం కింద నియోజకవర్గ నిధుల నుండి ఐదు లక్షల రూపాయలను మంజూరు చేస్తూ ప్రొసిడింగ్ కాఫీలను సంఘం నాయకులకు అందజేశారు.

# టాలెంట్ టెస్ట్ పోస్టర్ ఆవిష్కరణ



**విశ్వంభర, భూపాలపల్లి:** మహాదేవపూర్ మండల కేంద్రంలో ని స్కూల్ కాంప్లెక్స్ ఆవరణలో చెకుముకి సైన్స్ సంబురాలు 2024 టాలెంట్ టెస్ట్ పోస్టర్ ను మహదేవపూర్ సబ్ ఇన్స్పెక్టర్ పవన్ కుమార్, కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయులు రాజిరెడ్డి, తెలంగాణ బయాలజికల్ సైన్స్ టీచర్స్ ఫోరమ్ జయశంకర్ అధ్యక్షులు బి. ప్రభాకర్రెడ్డి లచే పోస్టర్ ఆవిష్కరణ చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వచ్చిన సబ్ ఇన్స్పెక్టర్ మాట్లాడుతూ ప్రజలలో ఉన్న మూఢనమ్మకాలను తొలగిస్తూ విద్యార్థుల00లో సైంటిఫిక్ టెంపర్ డెవలప్ చేయుటకు ఇలాంటి టాలెంట్ టెస్టులు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. కాంప్లెక్స్ హెడ్మాస్టర్ రాజిరెడ్డి మాట్లాడుతూ జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఎన్నో శాస్త్రీయ ఆలోచనలు విద్యార్థులలో కలుగజేయడానికి, శాస్త్రీయ అవగాహన పెంపొందించడానికి ఇలాంటి పరీక్షలు ఉపయోగకరమని అన్నారు. జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సరిత మాట్లాడుతూ సమాజంలో ప్రజలలో శాస్త్రీయ దృక్పథం పెంపొందితే మూఢనమ్మకాలు వాటికవే అంతమవుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రజా పరిషత్ హై స్కూల్ మహాదేవపూర్ ప్రధానోపాధ్యాయురాలు కళ్యాణి, మండల పరిషత్ స్కూల్ ఎస్సీ కాలనీ ప్రధానోపాధ్యాయులు తిరుపతి రెడ్డి, నవీన, లచ్చయ్య, వీరేశం, సమ్మయ్య, పూర్ణిమ, సహేద బేగం, అనిల్, లీలారాణి, దీపిక పాల్గొన్నారు.

# బీమా చెక్కు పంపిణీ

**విశ్వంభర, భూపాలపల్లి:** జయ శంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ రాపల్లికోట గ్రామానికి చెందిన కాట్రేవుల రాజక్క ఇటీవల ప్రమాదవశాత్తు మరణించింది. ఆమె గతంలో శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్‌లో పాలసీ చేయడంతో ఆమె మరణాంతరం బీమామొత్తం లక్ష యాభైనాలుగు వేల రూ. నామిని లచ్చిమల్లుకు కంపె నీ వారు అందజేశారు. దానితో పాటు 750 రూపాయల చొప్పు న ప్రతినెల పెన్షన్ రూపంలో 10 సంవత్సరాలు నామిని కాట్రే వుల లచ్చిమల్లుకు ఇవ్వడం జరుగుతుంది అని శ్రీరామ్ ఫైనాన్స్ అధికారులు తెలిపారు. శ్రీరామ్ ఫైనాన్స్ (ఆర్ఆర్ ఛానల్) జోనల్ మేనేజర్ పిల్లమారి ప్రశాంత్, మంథని బ్రాంచ్ మేనేజర్ తడకల మురళీ, కామారెడ్డి బ్రాంచ్ మేనేజర్ చాంద్ పాషా, కాంగ్రెస్ సీనియర్ నాయకులు గుడాల శ్రీనివాస్, డాక్టర్ రాజు, రమేష్ రెడ్డి, మాజీ గ్రామ సర్పంచ్ సమ్మయ్య, మాజీ ఉప సర్పంచ్ శ్రీశైలం, ఏజెంట్ శ్రావణ్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# పోలీస్ అధికారుల త్యాగాలు మరువలేనివి

- అమరవీరులను స్మరించుకుంటూ కొవ్వొత్తుల ర్యాలీ
- ఏ సందర్భంలోనైనా ముందు వరుసలో ఉండేది పోలీస్ మాత్రమే
- జిల్లా ఎస్పీ సుధీర్ రంనాథ్ కేకన్




**విశ్వంభర, మహబూబాబాద్:** పోలీస్ అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా మహబూబాబాద్ జిల్లా ఎస్పీ సుధీర్ రంనాథ్ కేకన్ అధ్వర్యంలో మహబూబాబాద్ టౌన్ పోలీస్ స్టేషన్ నుండి నెహ్రూ సెంటర్ కూడలి, అక్కడి నుండి మోడల్ మార్కెట్ మీదిగా అంబేద్కర్ విగ్రహం, కోర్ట్ ముందు వరకు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. పోలీసు అమరవీరులను స్మరించుకుంటూ వారి త్యాగాలు గుర్తు చేసుకుంటూ పోలీసులు దేశభక్తి గీతాలతో పోలీస్ అమరవీరుల యొక్క త్యాగాలను, వారి సేవలను ప్రజలకు తెలియజేస్తూ కొవ్వొత్తుల ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్.పి మాట్లాడుతూ పోలీసుల సేవ ప్రతి ఒక్కరికి ఏదో ఒక సందర్భంలో అవసరం వస్తుందని, కొన్ని సందర్భాలలో కష్టమైనా, ప్రజా రక్షణ కోసం పనిచేయాల్సి వస్తుందని అన్నారు. ఇందులో త్యాగాలు కూడా ఉంటాయని. 24ఇ7 ప్రజా సేవకోసం ముందుండి రక్షణ కల్పించేది ఒక్క పోలీస్ శాఖ మాత్రమేనని, వ్యక్తిగతంగా ఎన్ని ఇబ్బందులు ఉన్నా అది బయటకు కనబడకుండా ఎంతో మంది ఇప్పటికి విధులు నిర్వహిస్తూనే ఉన్నారన్నారు. వీరి త్యాగాలను ఎప్పటికీ మర్చిపోకూడదని యస్.పి తెలిపారు. పోలీస్ అమరవీరుల వారోత్సవాలలో భాగంగా ఓపెన్ హౌస్, క్రీడా పోటీలు, వ్యాసరచన పోటీలు, హెల్త్ క్యాంపు, రక్త దాన శిబిరం లాంటి కార్యక్రమాలు నిర్వహించినట్లు ఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ తిరుపతి రావు, సి.ఐలు, ఆర్.ఐలు, యస్.ఐ లు, ఆర్.యస్.ఐ లు, పోలీస్ సిబ్బంది ప్రజలు, విద్యార్థులు, మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

# అంగన్వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్



**విశ్వంభర, భూపాలపల్లి:** భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ బుధవారం భూపాలపల్లి మున్సిపాలిటీ పరిదిలోని హనుమాన్ నగర్ -2 అంగన్వాడి కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. తనిఖీ సమయంలో ఆయన అంగన్వాడి కేంద్రంలో పౌష్టికాహారం పంపిణీ, పిల్లల హాజరు, పిల్లలు, బాలింతలు, గర్భిణీలకు అందిస్తున్న సేవల వివరాలను అడిగి తెలుసుకున్నారు. కేంద్రంలో పాటిస్తున్న ఆహార నాణ్యత, చిన్నారుల ఆరోగ్య పరిరక్షణ చర్యలను అభినందించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ అంగన్వాడి కేంద్రాలు బాలల భవిష్యత్తును నిర్మించడంలో ముఖ్య పాత్ర వహిస్తాయని అన్నారు. చిన్నారులకు క్రమం తప్పక ఎత్తు, బరువు పరీక్షలు నిర్వహించాలని, ఎత్తుకు తగిన బరువు లేని పిల్లలపై ప్రత్యేక ఫోకస్ చేయాలని, బాలామృతం అందించాలని సూచించారు. ప్రతి అంగన్ సిబ్బంది చిన్నారుల ఆరోగ్య పరిరక్షణకు సమర్థవంతంగా విధులు నిర్వహించాలని ఆయన ఆదేశించారు. అలాగే అంగన్ వాడి కేంద్రానికి వస్తున్న చిన్నారుల ఆరోగ్య పరిరక్షణ చర్యలు పాటించాలని సిబ్బందికి సూచించారు. ఈ సందర్భంగా అంగన్ వాడి సిబ్బంది అంగన్ వాడి కేంద్ర సమస్యలను జిల్లా కలెక్టర్‌కు తెలియచేశారు. కేంద్రంలో చిన్నారులకు కుర్చీలు, ఆట వస్తువులు వంటి సౌకర్యాలు కల్పిస్తామని, శాశ్వత భవన నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్లే స్కూల్ చిన్నారులకు మెప్మా ద్వారా యూనిఫామ్స్ అందచేస్తామని తెలిపారు. క్రమం తప్పక అంగన్వాడి కేంద్రాలను తనిఖీ చేసి సేవలను పర్యవేక్షణ చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మున్సిపల్ కమిషనర్ రాజేశ్వర్ పాల్గొన్నారు.



పోలీసు అమరవీరుల వారోత్సవాల్లో బాగంగా మహబూబాబాద్‌లో నిర్వహించిన పోలీస్ ఓపెన్ హౌస్‌లో విద్యార్థులతో కలిసి పాల్గొన్న మహబూబాబాద్ జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్. (విశ్వంభర, మహబూబాబాద్)

# రైల్వే కోచ్ ఫ్యాక్టరీ సాధించుకునేందుకు కృషి చేస్తా: ఎంపీ కావ్య



**విశ్వంభర, కాజీపేట:** అయోధ్యపురంలో 160 ఎకరాలలో నిర్మాణం చేస్తున్న రైల్వే వ్యాగన్ తయారీ పరిశ్రమ నిర్మాణ పనులను సంబంధిత శాఖ అధికారులతో కలిసి వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య పరిశీలించారు. చిరకాల కోరిక అయినా రైల్వే కోచ్ ఫ్యాక్టరీ సాధించుకునేందుకు నా వంతు కృషి చేస్తానని తెలిపారు. కోచ్ ఫ్యాక్టరీ సాధించుకుంటే కాజీపేట జంక్షన్ ను సికింద్రాబాద్ కు ధీటుగా అభివృద్ధి చేసుకోవచ్చని అన్నారు. అలాగే స్థానికంగా ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలు లభిస్తాయని అన్నారు. కాజీపేట రైల్వే డివిజన్, కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు శాయశక్తుల కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం వరంగల్ పశ్చిమ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డితో కలిసి కాజీపేట రైల్వే స్టేషన్ జంక్షన్ ను వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య సందర్శించారు. ఈ సందర్భంగా వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య మీడియాతో మాట్లాడుతూ ఉత్తర, దక్షిణ భారతదేశాన్ని కలిపే కాజీపేట రైల్వే జంక్షన్ పై రైళ్ల రద్దీ పెరుగుతోందని, రైళ్ల హాల్టింగ్, క్రాసింగ్‌తో రాకపోకలకు అంతరాయం ఏర్పడటమే కాకుండా ప్రయాణికులు కూడా అవస్థలు పడాల్సి వస్తోందని, ఈ సమస్యకు చెక్ పెట్టేందుకు మరికొన్ని ప్లాట్ ఫామ్ లను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని వరంగల్ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ కడియం కావ్య అన్నారు. రైల్వే స్టేషన్‌లో నిర్మాణంలో ఉన్న ఆర్‌ఓడీ తో పాటు వెయిటింగ్ హాల్ పనులను పరిశీలించిన ఎంపీ మహిళలకు ప్రత్యేకంగా వెయిటింగ్ హాల్ ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. దివ్యాంగులకు సైతం ప్రత్యేకంగా, వెయిటింగ్ హాల్ టాయిలెట్లను ఏర్పాటు చేయాలని చెప్పారు. రైల్వే స్టేషన్ లో ఉన్న ప్రయాణికులతో మాట్లాడిన ఎంపీ సౌకర్యాలపై ఆరా తీశారు. 30 ఏళ్లుగా రైల్వే స్టేషన్ సమీపంలో బస్టాండు లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని, అంతే కాకుండా డీజిల్ కాలనీలో తాగునీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నారని త్వరలో జీఎం దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని ఎంపీ స్పష్టం చేశారు. అనంతరం రైల్వే ఆసుపత్రిని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం సందర్శించి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగుల వద్దకు వెళ్లి వైద్య సేవలు ఎలా అందుతున్నాయో అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రిలోని ప్రతి విభాగాన్ని ఎంపీ డా. కడియం కావ్య క్షుణ్ణంగా పరిశీలించారు. ఆస్పత్రిలోని పలు సమస్యలను తెలుసుకున్న ఎంపీ త్వరలోనే వాటి పరిష్కార దిశగా కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం ప్లానింగ్ హెడ్ క్వాటర్ సికింద్రాబాద్ లక్ష్మీనారాయణ, సీనియర్ డీఎన్ఏ డీజిల్ కాలనీ వెంకట్, సీడీఎంఈ డీజిల్ అనికేత్, ఏడీఎన్ నార్త్ రామరాజు, ఎస్ ఎస్ సీ వర్క్స్ సత్యరావు,అధికారులు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## శివాని మహిళా కళాశాలలో వైద్య శిబిరం




**విశ్వంభర, ఎల్బీనగర్:** కొత్తపేటలోని శివాని మహిళా కళాశాలలో ఉచిత వైద్య శిబిరాన్ని లయన్స్ క్లబ్ హైదరాబాద్ క్యాపిటల్ సహాయంతో ఏర్పాటు చేసినట్లు కళాశాల చైర్మన్ డా. పి రాంరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ కళాశాలలో విద్యార్థినుల కోసం పలు రకాల వైద్య పరీక్షలు నిర్వహించడం జరిగిందని తెలిపారు. మలక్ పేట యశోద ఆసుపత్రి సౌజన్యంతో రక్త, ఈసీజీ పరీక్షలు నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఎంఎన్‌జే క్యాన్సర్ ఆస్పత్రి సౌజన్యంతో గర్భాశయ, బ్రెస్ట్ క్యాన్సర్ పరీక్షలు, మాక విజన్ కంటి ఆసుపత్రి సౌజన్యంతో కంటి పరీక్షలు, క్లావ్ డెంటల్ ఆసుపత్రి సహాయంతో దంత పరీక్షలు నిర్వహించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్, సెక్రటరీ వెదిరే సుదర్శన్ రెడ్డి, ప్రిన్సిపల్ అనిత పాల్గొన్నారని అన్నారు.

# విద్యార్థులు ఉన్నత లక్ష్యాలపై దృష్టి పెట్టాలి

## లయన్స్ క్లబ్ అధ్యక్షులు లక్ష్మారెడ్డి




**విశ్వంభర, తలకొండపల్లి:** తలకొండపల్లి మండల పరిధిలోని చుక్కాపూర్ ప్రాథమిక పాఠశాలకు కీర్తిశేషులు వీరబొమ్మ నారాయణ, కీర్తిశేషులు వీరబొమ్మ లింగమ్మ జ్ఞాపకార్థం లయన్స్ క్లబ్ కోఆర్డినేటర్ వీరబొమ్మ బిక్షపతి, సభ్యులు వీరబొమ్మ రామ్మోహన్‌లు సమకూర్చిన రూ. 6000ల విలువ గల వాటర్ ట్యాంకును స్కూల్ ప్రధానోపాధ్యాయులు మూడవత్ పాండుకి అందజేశారు. ప్రధానోపాధ్యాయులు ఎం. పాండు అధ్యక్షతన జరిగిన సమావేశంలో క్లబ్ అధ్యక్షులు లక్ష్మారెడ్డి మాట్లాడుతూ పాఠశాలల్లో మౌలిక వసతులు సమకూర్చుటకు లైన్స్ క్లబ్ సభ్యులం ఎప్పుడూ ముందుంటామని తలకొండపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు లయన్స్ క్లబ్ సీనియర్ సభ్యులు దోమ మోహన్ రెడ్డి రూ. 50 వేలు సమకూర్చినందుకు ఆయనను అభినందించారు. క్షేత్రస్థాయిలో 16 జిల్లాలకు ఆర్జేడిగా వ్యవహరించిన అనుభవం ఉన్నట్లు ఆయన తెలిపారు. ప్రతి ఒక్క విద్యార్థి విద్యార్థినీలు భావి పౌరులుగా ఎదిగి దేశానికి గర్వకారణంగా నిలవాలని ఆయన తెలిపారు. విద్యార్థినీ విద్యార్థులకు లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి ప్రత్యేక బహుమతులు సమకూరుస్తున్నట్లు ఆయన తెలిపారు. అలాగే మండల ప్రాథమిక పాఠశాల తలకొండపల్లిలో వంటగది మరమ్మత్తుకై లయన్స్ క్లబ్ సభ్యుల సహకారంతో పద్నాలుగు వేల రూపాయలను సమకూర్చి ఇచ్చినట్లు ఆయన తెలిపారు. లైన్స్ క్లబ్ కోఆర్డినేటర్ కె. రామ్ రెడ్డి, జిల్లా చైర్మన్లు ఎం. చంద్రశేఖర్, ఏం. అంజయ్య, ఓంకారం, లయన్ సభ్యులు ఏమి రెడ్డి పాండు రంగారెడ్డి, ఏ. శేఖర్ రెడ్డి, పాండురెడ్డి, మధుసూదన్ రెడ్డి, పెంటారెడ్డి, మోహన్ రెడ్డి, యాద య్య, రామ్మోహన్, పీఆర్ఓ పాషా, సాయిబాబా, సాయికుమార్, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## సీఐ శంషుద్దీన్‌కు శుభాకాంక్షలు తెలిపిన కాంగ్రెస్ నాయకులు



**విశ్వంభర, అచ్చంపేట:** నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గం చరకొండ పోలీస్ స్టేషన్ పరిధిలో సర్కిల్ ఇన్స్పెక్టర్‌గా శంషుద్దీన్ నూతనంగా భాధ్యతలు చేపట్టారు. సర్కిల్ ఇన్స్పెక్టర్ శంషుద్దీన్‌ను కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు కలసి శుభాకాంక్షలు తెలియజేశారు. అధ్యక్షులుబలరాం, మాజీవైఎస్ ఎంపీపీ జూపల్లివెంకటయ్య యాదవ, కేశ మౌనిశంకర్, వెంకటయ్య, నాయకులు పాల్గొన్నారు.

# సమస్యలను వెంటనే పరిష్కరించాలి

## మార్కెటింగ్ శాఖలోని ఖాళీలను భర్తీ చేయాలి

## అధ్యక్షులు చిలుక నరసింహారెడ్డి



**విశ్వంభర, ఎల్బీనగర్:** పత్తి, ధాన్యం కొనుగోలులో ఏర్పడే సమస్యలను వెంటనే మార్కెటింగ్ శాఖ అధికారులు పరిష్కరించాలని వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉద్యోగుల సెంట్రల్ ఫోరం అధ్యక్షుడు చిలుక నరసింహారెడ్డి అన్నారు. మార్కెట్ కమిటీ ఉద్యోగుల సెంటర్ ఫోరం రాష్ట్ర కార్యవర్గం సమావేశం ఎల్బీనగర్ లోని ఎన్టీఆర్ నగర్ మార్కెట్లో గల రాష్ట్ర యూనియన్ బిల్డింగులో నిర్వహించారు. ఈ సందర్భంగా చిలుక నరసింహారెడ్డి మాట్లాడుతూ శాఖా పరంగా ఉన్న సాఫ్ట్వేర్‌తో సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని, అలా కాకుండా సెంట్రలైజ్డ్ సాఫ్ట్వేర్ ను ఏర్పాటు చేయాలని అన్నారు. మార్కెటింగ్ శాఖ లో 1835 ఉద్యోగులకు గాను 605 మంది ఉద్యోగులే ఉండడంవల్ల ఉద్యోగులపై పని భారం పడుతుందన్నారు. వెంటనే ఖాళీల భర్తీకి చర్యలు చేపట్టాలని కోరారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు ఉద్యోగుల జీతభత్యాలు స్వయంగా డ్రా చేసుకునే వసతి ఉండేదని, ఇప్పుడు తిరిగి అదే విధంగా అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రతినెల జీతాలు 5 తారీకు లోపు వచ్చే విధంగా మార్కెటింగ్ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. 20 తారీకు వరకు కూడా జీతాలు అందడం లేదని దీంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న సమస్య కమిటీ దృష్టికి రావడంతో ఈ సమస్య ను వెంటనే పరిష్కారం అయ్యే విధంగా శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి ఎండి ముక్రం, సహాధ్యక్షులు వెంకటేశం, ట్రెజరర్ చంద్రశేఖర్, సెంట్రల్ యూనియన్ ఈసీ మెంబర్ సంతోష్, రాజ్ కుమార్, వెంకట్ రెడ్డి, శ్రీశైలం, అన్ని జిల్లాల అధ్యక్ష కార్యదర్శులు సెంట్రల్ ఫోరం కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

# చేప పిల్లలను పంపిణీ చేసిన ఎమ్మెల్యే సంజయ్



**విశ్వంభర, మెట్‌పల్లి:** మెట్‌పల్లి పట్టణంలోని పెద్ద చెరువులో రాష్ట్ర ప్రభుత్వంచే పంపిణీ చేయుచున్న బొచ్చె, రహు, బంగారు తీగ రకాల ఉచిత చేప పిల్లలను కోరుట్ల నియోజకవర్గ ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు చేపలు పట్టే వృత్తిపై ఆధారపడి బ్రతికే మత్స్యకారుల జీవితాల్లో వెలుగులు నింపేందుకు, మత్స్యకారులు ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి చేప పిల్లలు ఉచితంగా ఇవ్వడం ప్రారంభించారని అన్నారు. కేసీఆర్ హయాంలో మత్స్యకారులకు ఉచిత వాహనాలు అందించారని ఈ సందర్భంగా పేర్కొన్నారు. కాలేశ్వరం నీళ్లతో చెరువులన్నీ కళకళలాడుతున్నాయని తెలిపారు. కాగా జూన్ నెలలో విడుదల చేయాల్సినటువంటి చేప పిల్లలను కాంగ్రెస్ ప్రభుత్వం అక్టోబర్ లో విడుదల చేయాల్సి వచ్చిందని దీని వల్ల చేపలు దిగుబడి తక్కువ వస్తుందని మత్స్యకారులు నష్టపోతారని అన్నారు. జూన్, జూలై నెలలలో చేప పిల్లల పంపిణీ చేసినట్లయితే సకాలంలో చేప పిల్లల పంట మత్స్యకారులకు అందేదని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రణవేణి సుజాత సత్యనారాయణ, వైస్ చైర్మన్ బోయినపల్లి చంద్రశేఖర రావు మత్స్యశాఖ జిల్లా అధికారి విజయ, బీ సీ ఎఫ్ ఎస్ చైర్మన్ పల్లికొండ ప్రవీణ్, మున్సిపల్ కమిషనర్, కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది, గంగపుత్ర సంఘం కుల బంధువులు పాల్గొన్నారు.

# ప్రజాభిప్రాయ సేకరణలో నిరసన



**విశ్వంభర, రామన్నపేట:** యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలంలోని రామన్నపేట, కొమ్మాయిగూడెం గ్రామాల పరిధిలో నెలకొల్ప తలపెట్టిన అంబుజా సిమెంట్ కంపెనీ ప్రజాభిప్రాయ సేకరణలో లాయర్లు, ప్రజలు, కార్మికులు, కర్షకులు, రైతులు, విద్యార్థులు, మేధావులు, అందరూ తమ అభిప్రాయాన్ని ముక్తకంఠంతో వ్యతిరేకతను వ్యక్తం చేశారని ఆల్‌ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలు) జిల్లా అధ్యక్షుడు మామిడి వెంకట్ రెడ్డి తెలిపారు. వెంటనే అంబుజా సిమెంట్ కంపెనీ నెలకొల్పాలనే ఆలోచన విరమించుకోవాలని ఐలు జిల్లా అధ్యక్షుడు మామిడి వెంకట్ రెడ్డి యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. జనం నివసించే ప్రాంతాలకు దగ్గరలో నెలకొల్పాలనే ఆలోచన సరి కాదని, సిమెంట్ కంపెనీ వ్యర్థ రసాయణ కాలుష్యం, వాయు కాలుష్యం, నీటి కాలుష్యం విపరీతంగా ఉండడం జరుగుతుందని, ప్రజలు జీవనం విధానంపై తీవ్ర ప్రతికూల ప్రభావాన్ని చూపిస్తాయని, వెంటనే ఈ కంపెనీ స్థాపనను విరమించుకోవాలని కోరారు. మళ్లీ సిమెంట్ పరిశ్రమ నెలకొల్పాలనే ఆలోచన చేస్తే ఎంతటివరకైనా పోరాడేందుకు సిద్ధంగా ఉన్నామని ఆయన హెచ్చరించారు. కోర్టు నూతన భవణం కంపెనీకి 500 మీటర్ల సమీపంలో ఉందని, నూతన కోర్టు భవనాన్ని శంకుస్థాపన చేయనున్నామని, ఏడు మండలాల నుండి వందల సంఖ్యలో ప్రజలు నిరంతరం కోర్టుకు వచ్చి వెళుతుంటారని అన్నారు. అంబుజా సిమెంట్ కంపెనీ నెలకొల్పాలనే ఆలోచన విరమించుకోవాలని డిమాండ్ చేశారు.

## ఉద్యమ కళాకారుల జిల్లా కన్వీనర్‌గా గడ్డం స్వరూప

**విశ్వంభర, భూపాలపల్లి:** తెలంగాణ ఉద్యమ ఫోరం కళాకారుల విభాగం జిల్లా కన్వీనర్ గా గడ్డం స్వరూప ను ఎన్నుకున్నట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు చీమ శ్రీనివాస్ రావు ప్రకటించారు. నూతనంగా ఎన్నికైన గడ్డం స్వరూప మాట్లాడుతూ కళాకారుల సమస్యల పరిష్కారం కోసం కష్ట పడుతానని, ఉద్యమ కళాకారులను ప్రభుత్వం ఆదుకోవాలని అన్నారు. రాజకీయ పార్టీ లకు కళాకారుల ధూమ్ ధాం ఆటపాట లేకుండా ఏకార్యక్రమం జరగలేదని గుర్తు చేశారు. ప్రభుత్వ పథకాలను కూడా ప్రజల్లోకి తీసుకెళ్లడానికి కళాకారులు ఎంతో కష్టపడుతున్నారని తెలిపారు. కళాకారుల అభివృద్ధి కోసం తన వంతు కృషి చేస్తామని అన్నారు. తన ఎన్నికకు సహకరించిన రాష్ట కార్యదర్శి సురేందర్ రెడ్డి, కన్వీనర్ యొల్ల పోశెట్టి, ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షులు గడ్డం సుధాకర్ లకు ఆమె ధన్యవాదాలు తెలియజేశారు.

## వ్యవసాయ కమిషన్ సభ్యుడిగా కేవీఎన్ రెడ్డి



**విశ్వంభర, కల్వకుర్తి:** వ్యవసాయ కమిషన్ సభ్యుడిగాకేవీఎన్ రెడ్డి నియమితులైనట్టు ప్రభుత్వం ఉత్తర్వులు వెల్లడించింది. ఈ సందర్భంగా ఉద్యమ నాయకుడు కేవీఎన్ రెడ్డిని నియమించినందుకు కల్వకుర్తి నియోజకవర్గ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. కేవీఎన్ రెడ్డి జీవితం అంతా పోరాటాల మయమని, రైతు సమస్యలపై గళం విప్పి రాష్ట్ర స్థాయి లో రైతుల పాలిట ఒక శక్తి గా మారి కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్ కు జలసాధన సమితి అధ్యక్షుడిగా క్రియ శీలక భూమిక పోషించి, స్వరాష్ట్ర సాధన కోసం పల్లే పల్లేకు పాదయాత్ర ద్వారా తెలంగాణ నినాదాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లిన నేత, పదవుల కోసం కాదు, నా ప్రాంత బిడ్డలకు, నీళ్ళు నిధులు, ప్రభుత్వ ఉద్యోగా ల నియమాకాలలో తగిన వాటా కోసం పోరాటం చేసిన వ్యక్తి అని కొనియాడారు. కాబట్టి కేవీఎన్ రెడ్డి ని వ్యవసాయ శాఖ కమిషన్ సభ్యులుగా నియమించినందుకు కల్వకుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు ముఖ్యమంత్రికి అభినందనలు తెలియజేశారు.

# మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం



**విశ్వంభర, కడ్తాల్:** కడ్తాల్ మండలంలోని గానుగుమర్ల తండా గ్రామ పంచాయతీకి చెందిన ఆంగోత్ చందు బుధవారం అనారోగ్యంతో మరణించాడు. విషయం తెలుసుకున్న జర్పుల రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, మాజీ జెడ్పీటీసీ జర్పుల దశరథ్ నాయక్ వెంటనే చందు ఇంటికి వెళ్లి ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి, మృతదేహానికి పూలమాలేసి నివాళులర్పించారు. తదుపరి చందు కుటుంబ సభ్యులకు జర్పుల రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఐదు వేల రూపాయల ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ సేవ్య నాయక్, మాజీ సర్పంచ్ హరిచంద్ నాయక్, పాండు, శ్రీను నాయక్, బీమాన్ నాయక్, గోపయ్య, కిషన్, మోతిలాల్, సక్రు, పాండు, శంకర్, రాజు, హరియా పాల్గొన్నారు.

# ఐటీఐలో సీట్ల భర్తీకి అడ్మిషన్లు

**విశ్వంభర, భూపాలపల్లి:** భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని అడ్వాన్స్ ట్రైనింగ్ సెంటర్ నందు 172 సీట్లు భర్తీ చేయుటకు అడ్మిషన్లు జరుగుతున్నట్లు భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. బుధవారం ఐడీఓసీ కార్యాలయ సమావేశపు హాలులో ఈ నెల 24 గురువారం ఉదయం 11 గంటలకు అడ్మిషన్ల భర్తీపై నిర్వహించనున్న అవగాహన సదస్సు ఏర్పాట్లును ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ ను అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ మాట్లాడుతూ యువతకు ఉపాధి కల్పనే ధ్యేయంగా అవకాశాలున్న కోర్సులను ప్రభుత్వం అధ్యయనం చేసి ఈ సంవత్సరం నూతనంగా 6 కోర్సులను ప్రవేశ పెట్టినట్లు తెలిపారు. 10 వ తరగతి ఆపై విద్యార్హతలున్న అభ్యర్థులు అర్హులని తెలిపారు. ఈ నెల 30వ తేదీ వరకు దరఖాస్తు చేయుటకు అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సంవత్సరం అడ్మిషన్లు జరుగుతున్నాయని గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో అర్హత కలిగిన యువతీ, యువకులకు ఈ కోర్సులు అభ్యసించడంపై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నామని అధిక సంఖ్యలో పాల్గొనాలని సూచించారు. ఈ కోర్సులకు ఉపాధి అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని తెలిపారు. కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, ఐటీఐ ప్రిన్సిపల్ జామ్లా నాయక్, డీఆర్డీఓ అవినాష్, పౌర సరఫరాల అధికారి శ్రీనాథ్, మేనేజర్ రాములు, సహకార అధికారి వాలియా నాయక్ పాల్గొన్నారు.

## పారామెడికల్ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

**విశ్వంభర, మహబూబాబాద్:** తెలంగాణ రాష్ట్ర పారామెడికల్ బోర్డు హైదరాబాద్ వారి ఉత్తర్వుల ప్రకారం డి.యమ్.ఎస్.టి మరియు డి.ఇ.సి.జి పారామెడికల్ కోర్సులకు గాను అడ్మిషన్ పొందడానికి దరఖాస్తులను 30 అక్టోబర్ 2024 వరకు ప్రభుత్వ వైద్య కళాశాల మహబూబాబాద్ నందు స్వీకరించబడునని, ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తుతో పాటు అన్ని సర్టిఫికెట్స్ యొక్క నఖలు కాపీలను స్వీయ ధ్రువీకరణతో జతపర్చగలరని ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపల్ బుదవారం ఒక ప్రకటనలో తెలిపారు. అప్లికేషన్‌లో తప్పుడు సమాచారం సమర్పించినా, సంబంధిత సర్టిఫికెట్లు సమర్పించని యెడల అట్టి దరఖాస్తు తిరస్కరించబడుతాయన్నారు. దరఖాస్తు ఫారం మరియు సూచనలకై పూర్తి వివరాలకై www.tspmb.telangana.gov.in వెబ్సైట్‌లో చూడగలరని ఆయన పేర్కొన్నారు.

## ఫీజు రీయంబర్స్ మెంట్, స్కాలర్షిప్‌లను విడుదల చేయాలి



**విశ్వంభర, పరిగి:** పెండింగ్‌లో ఉన్న ఫీజు రియంబర్స్ మెంట్, స్కాలర్షిప్‌లను వెంటనే విడుదల చేయాలని బుధవారం పరిగి పట్టణంలో ఏబీవీపీ ఆధ్వర్యంలో విద్యార్థులు బస్టాండ్ ముందు బీజాపూర్ నేషనల్ హైవేపై బైఠాయించి ధర్నా చేపట్టారు. ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సాయిగణేష్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని కళాశాలలకు రావాల్సిన ఫీజు రియంబర్స్ మెంట్, స్కాలర్షిప్‌లు పెండింగ్ లో ఉన్నాయని, ఆ కారణంగా వివిధ కళాశాల లో చదువుతున్న పేద, బడుగు బలహీన వర్గాలవిద్యార్థులు అనేక రకాలుగా ఇబ్బందులకు గురవుతు న్నారని, గత ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా ఎంతో మంది విద్యార్థులు విద్యకు దూరం కావాల్సిన పరిస్థితి ఏర్పడిందని, రాష్ట్ర ప్రభుత్వానికి విద్యారంగం మీద చిత్తశుద్ధి ఉంటే ఫీజు రియంబర్స్ మెంట్, స్కాలర్షిప్‌లను విడుదల చేయాలని అన్నారు. విద్యార్థులకు న్యాయం జరిగే వరకు ఏబీవీపీ పోరాడుతుందని తెలిపారు. ప్రేమ్ కుమార్, రఘు, ఇమ్రాన్, ధనరాజ్, శివ, ప్రవీణ్, మల్లేష్, తరుణ్, పాల్గొన్నారు.

## డీఎంహెచ్‌ఓ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం



**విశ్వంభర,వరంగల్:** ఏస్.వీ. కన్వెన్షన్ హాల్లో మాజీ ఎమ్మెల్సీ కొండ మురళీధర్ రావు జన్మదినం సందర్భంగా వరంగల్ జిల్లా డీ ఎం అండ్ హెచ్ ఓ డాక్టర్. కే. వెంకటరమణ ఆధ్వర్యంలో ఉచిత వైద్య, ఆరోగ్య శిబిరం నిర్వహించడం జరిగినది. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె వెంకటరమణ మాట్లాడుతూ రక్త దానం ప్రాణదానంతో సమానమని అన్నారు. యువత ఇతరుల ప్రాణాలను కాపాడడానికి రక్తదానం చేయడం వారి ఆరోగ్యానికి సమాజానికి ఎంతో మేలు చేస్తుందని తెలిపారు. రెడ్ క్రాస్ సొసైటీ కార్యక్రమంలో విశేషంగా ప్రజలు ముందుకు వచ్చి రక్తదాన శిబిరంలో పాల్గొన్నందుకు డీఎంహెచ్‌ఓ సంతోషం వ్యక్తం చేశారు. ఈ శిబిరంలో ఎవరికి ఎలాంటి అనారోగ్య సమస్యలు ఉన్న వారికి ఉచితంగా అవగాహన కల్పించడం, చికిత్స అందించడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీ ఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ ఎన్. గోపాల్ రావు, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్. మోహన్ సింగ్, ఎం.జి.ఎం. పి.పి.యూనిట్ డాక్టర్ ఎం. యశస్విని, పల్లె దావకాన డాక్టర్లు, డిప్యూటీ డెమో అనిల్ కుమార్, ఆరోగ్య పర్యవేక్షకురాలు నర్మద, జాతీయ ఆరోగ్య మిషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్ ఖన్నా, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## లక్ష్మీనారాయణకు నివాళులు అర్పించిన కాంగ్రెస్ నేతలు

### ఆర్థిక సహకారం అందించిన ఫాక్స్ చైర్మన్ జిల్లాల శేఖర్ రెడ్డి

**విశ్వంభర, ఆత్మకూరు(ఎం):** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండలం పల్లెపహాడ్ గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు అలంశెట్టి లక్ష్మీనారాయణ అనారోగ్యంతో బాధపడుతూ తుదిశ్వాస విడిశారు. సమాచారం తెలుసుకున్న ఆత్మకూరు(ఎం) మండల పాక్స్ చైర్మన్ జిల్లాల శేఖర్ రెడ్డి మృతుని పార్థీవ దేహానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులకు 10,000 రూపాయలు ఆర్థిక సహకారం అందించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. మాజీ ఎంపీపీ తండ మంగమ్మ శ్రీశైలం గౌడ్, మాజీసర్పంచ్ సుబ్బారు వెంకటేష్, గ్రామశాఖ అధ్యక్షులు ఎగ్గిడి యాదగిరి, వర్కింగ్ ప్రెసిడెంట్ ముద్దసాని సిద్దులు, మండల కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కందడి అనంత రెడ్డి, మండల బీసీ సెల్ అధ్యక్షులు కట్టెకోల హన్మంతు గౌడ్, మండల ఓబీసీ అధ్యక్షులు బత్తిని ఉప్పలయ్య గౌడ్, పాక్స్ డైరెక్టర్‌లు నోముల వెంకట్ రెడ్డి, బొడిగే వెంకటయ్య, నాయకులు కందడి దశరథ రెడ్డి, పోకల భిక్షపతి, హరిబాబు, యెలెందర్, రమేష్, వెంకట్ నర్స్ పాల్గొన్నారు.

## హాస్పిటల్ ను ప్రారంభించిన ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి



**విశ్వంభర, పరిగి:** పరిగి పట్టణంలోని బహార్పేట్‌లో సాధన మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ను జిల్లా డీసీసీ అధ్యక్షులు, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి ప్రారంభించారు. అనంతరం ఆసుపత్రి యజమాని ఆంజనేయులు ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డిని శాలువాతో సన్మానించారు. రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ పేద, మధ్యతరగతి ప్రజలను దృష్టిలో ఉంచుకొని రోగులకు నాణ్యమైన వైద్య అందించాలని, ఆస్పత్రి యాజమాన్యం సేవా దృక్పథంతో సేవలు అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పరశురామ్ రెడ్డి, డీసీసీ కార్యదర్శి రామచంద్ర యాదవ్, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కృష్ణ, సీనియర్ నాయకులు బాల ముకుంద, సత్యనారాయణ, సాయి రెడ్డి, రాజ పుల్లారెడ్డి, వెంకట్ రెడ్డి పాల్గొన్నారు.

# బాలికలు క్రీడల్లో ప్రతిభను చాటాలి

## జిల్లా కలెక్టర్ ప్రావీణ్య




**విశ్వంభర, హనుమకొండ:** బాలికలు వివిధ క్రీడాంశాల్లో అత్యుత్తమ ప్రతిభను చాటాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య అన్నారు. బుధవారం హనుమకొండ జిల్లా కమలాపూర్ మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిబా ఫూలే తెలంగాణ వెనకబడిన తరగతుల సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, కళాశాలలో ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి మహాత్మా జ్యోతిబాఫూలే పాఠశాలల అండర్ -17 బాలికల క్రీడా పోటీల ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా కలెక్టర్ ప్రావీణ్య ముఖ్యఅతిథిగా హాజరై ముందుగా మహాత్మా జ్యోతిబా ఫూలే, సావిత్రిభాయి ఫూలేల చిత్రపటాలకి పూలమాలవేసి జ్యోతి ప్రజ్వలన చేశారు. క్రీడా పోటీల ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని జాతీయ జెండాను కలెక్టర్ ఆవిష్కరించారు. అనంతరం కలెక్టర్ క్రీడాజ్యోతిని వెలిగించి జిల్లాస్థాయి క్రీడా పోటీలను లాంఛనంగా ప్రారంభించారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని మహాత్మా జ్యోతిబాఫూలే గురుకుల పాఠశాలలకు చెందిన క్రీడాకారిణులు మార్చ్ పాస్ట్‌ను నిర్వహించారు. క్రీడాకారిణులతో క్రీడా స్ఫూర్తిని కొనసాగించాలని కలెక్టర్ ప్రతిజ్ఞ చేయించారు. జిల్లా స్థాయి క్రీడా పోటీలను ప్రారంభించిన అనంతరం కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 18 పాఠశాలలకు చెందిన 600 మందికి పైగా విద్యార్థినులు పాల్గొనడం చాలా సంతోషకరమని పేర్కొన్నారు. కమలాపూర్ పాఠశాలలో మూడు రోజుల పాటు జిల్లా స్థాయి క్రీడా పోటీలు పెద్ద ఎత్తున నిర్వహిస్తుండడం అభినందనీయమని తెలిపారు. వివిధ క్రీడాంశాలలో బాలికలు ఉత్సాహంగా పాల్గొనాలని అన్నారు. క్రీడల్లో బాలికలు క్రీడా స్ఫూర్తిని చాటాలని పేర్కొన్నారు. గత నెలలో ఇదే పాఠశాలలో హాస్టల్ నిద్ర చేసినప్పుడు విద్యార్థినులు ఉత్సాహంగా క్రీడల్లో పాల్గొనడం తాను గమనించానని పేర్కొన్నారు. అంతర్జాతీయ స్థాయిలో పేరుతెచ్చుకున్న నిఖత్ జరీన్, దీప్తి జీవంజీలను బాలికలు ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం కల్లెడ కు చెందిన దీప్తి జీవంజి పారా ఒలింపిక్స్ పోటీలో పతకం సాధించి దేశానికి కీర్తి ప్రతిష్టలను తీసుకువచ్చారని అన్నారు. బాక్సింగ్ లో నిఖత్ జరీన్, అథ్లెటిక్స్ లో దీప్తి జీవంజీ లను బాలికలు ఆదర్శంగా తీసుకుని జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అత్యుత్తమ ప్రతిభను చాటి దేశానికి కీర్తి ప్రతిష్టలను తీసుకురావాలన్నారు. నిఖత్ జరీన్‌కు ప్రభుత్వం డీఎస్పీ ఉద్యోగం కల్పించిందన్నారు. ఎక్కువ మంది బాలికలను క్రీడల్లో ప్రోత్సహించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కమలాపూర్ తహసీల్దార్ సురేష్ కుమార్, ఎంపీడీవో గుండె బాబు, మహాత్మా జ్యోతిబాఫూలే గురుకుల పాఠశాలల జిల్లా కన్వీనర్ వెంకట ప్రసాద్, కమలాపూర్ పాఠశాల ప్రిన్సిపల్ సౌజన్య, ఇతర పాఠశాలల ప్రిన్సిపాల్స్ ఓదెల మల్లయ్య, తదితరులతో పాటు ఉపాధ్యాయులు, ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన మహాత్మా జ్యోతి బా ఫూలే గురుకుల పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.



చిల్కానగర్ డివిజన్ కార్పొరేటర్ జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కమిటీ మెంబర్ బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజ్ కుటుంబ సమేతంగా తిరుమల తిరుపతి శ్రీవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారు శ్రీవారి ఆశీస్సులు కేసీఆర్, కేటీఆర్, ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిలపై ఉండాలని కోరుకున్నట్టు తెలిపారు.

– విశ్వంభర, సికింద్రాబాద్

### మల్లికార్జున నగర్ కాలనీ అధ్యక్షుడిగా కొండోజు అశోక్ చారి



**విశ్వంభర, సికింద్రాబాద్:** చిల్కానగర్ డివిజన్ లోని మల్లికార్జున నగర్ కాలనీ అధ్యక్ష ఎన్నికల్లో ప్రత్యర్థిపై మంచి మెజారిటీతో గెలుపొందిన కొండోజు అశోక్ చారిని బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ఏదుల్ల కొండల్ రెడ్డి, ఈరెల్లి రవీందర్ రెడ్డి, మాస శేఖర్ ప్రతాప్ రెడ్డి, షఫీ, ఎండి గౌస్, హనీఫ్‌లు శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ.. కాలనీలోని సమస్యలను ఎమ్మెల్యే, కార్పొరేటర్ దృష్టికి తీసుకువచ్చి వారి సహకారంతో ఒక్కొక్కటిగా మల్లికార్జున నగర్ కాలనీ సమస్యలు పరిష్కరించే దిశగా పనిచేయాలని అన్నారు. కార్యక్రమంలో మల్లికార్జున నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు చిన్న పెంటయ్య, ఉపేందర్, సుందర్, ప్రసాద్ చారి, సంతోష్ రెడ్డి, పెంటయ్య చారి, నాయకులు దర్శన్ గౌడ్ ఇమాం సాబ్ మౌలాలి, శ్రీనివాస్ యాదవ్, బలరాజ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# మిస్టరీగా మారిన.. షేక్ హసీనా 'రాజీనామా లేఖ'!




**ఢాకా:** బంగ్లాదేశ్‌లో విద్యార్థుల ఆగ్రహానికి గురైన షేక్ హసీనా .. ప్రధానమంత్రి పదవికి రాజీనామా చేసి దేశం వీడాల్సి వచ్చింది. అక్కడ తాజాగా మళ్లీ ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. అయితే, ఈసారి మాత్రం దేశాధ్యక్ష పదవి నుంచి మొహమ్మద్ షహాబుద్దీన్ వైదొలగాలని డిమాండు చేస్తూ అధ్యక్ష భవనం 'బంగాభబన్'ను ఆందోళనకారులు చుట్టుముట్టారు. ఇందుకు షేక్ హసీనా 'రాజీనామా లేఖ' కారణమయ్యింది. ఆ లేఖ గురించి ఇటీవల ఓ ఇంటర్వ్యూలో అధ్యక్షుడు చేసిన వ్యాఖ్యలు తాజా దుమారానికి తెరలేపాయి. ఇంతకీ ఏం జరిగిందంటే..!బంగ్లాదేశ్ అధ్యక్షుడు మొహమ్మద్ షహాబుద్దీన్ ఇటీవల ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. "ఆ రోజు షేక్ హసీనా ప్రధానమంత్రి పదవికి రాజీనామా చేసినట్లు విన్నాను. అయినప్పటికీ దానిని ధ్రువీకరించేందుకు రాజీనామా లేఖ సహా నా దగ్గర ఎటువంటి ఆధారాలు లేవు. ఎంత ప్రయత్నించినా ఆ లేఖ లభ్యం కాలేదు. బహుశా లేఖ ఇచ్చేందుకు ఆమె (షేక్ హసీనా)కు సమయం ఉండకపోవచ్చు" అని పేర్కొన్నారు. ఇదే విషయంపై సైన్యాధిపతిని వాకబు చేయగా అక్కడ నుంచీ ఇదేవిధమైన సమాధానం వచ్చిందన్నారు. హసీనా రాజీనామా లేఖ గురించి అధ్యక్షుడు చేసిన వ్యాఖ్యలపై తాత్కాలిక ప్రభుత్వం అసహనం వ్యక్తం చేసింది. అధ్యక్షుడు విరుద్ధ ప్రకటనలు చేశారని ప్రస్తుత ప్రభుత్వ న్యాయ సలహాదారు ఆసిఫ్ నజ్రుల్ పేర్కొన్నారు. "తన వద్ద హసీనా రాజీనామా లేఖ లేదని అంటున్నారు. ఆగస్టు 5న త్రివిధదళాధిపతుల సమక్షంలో జాతినుద్దేశించిన ప్రసంగంలో హసీనా రాజీనామా చేశారని.. తాను ఆమోదించానని అధ్యక్షుడు చెప్పారు. ఇప్పుడు మాత్రం తనవద్ద ఆ లేఖ లేదని చెబుతున్నారు" అని చెప్పారు. ఇదిలాఉంటే, రిజర్వేషన్లకు వ్యతిరేకంగా జరిగిన ఆందోళనలతో బంగ్లాదేశ్ ఇటీవల అట్టుడుకిపోయింది. అవి హింసాత్మకంగా మారడం, దాదాపు 300 మంది నిరసనకారులు ప్రాణాలు కోల్పోయారు. ఈ క్రమంలో షేక్ హసీనా అధికార నివాసాన్ని ఆందోళనకారులు ముట్టడించారు. దీంతో ఆగస్టు 5న దేశాన్ని వీడిన హసీనా.. భారత్‌కు వచ్చి ఆశ్రయం పొందారు. బంగ్లాలో కొత్త ప్రభుత్వం ఏర్పడి.. పరిస్థితులు కుదుటపడుతోన్న సమయంలోనే హసీనా రాజీనామా గురించి అధ్యక్షుడు చేసిన వ్యాఖ్యలు మరోసారి ఆందోళనలకు కారణమయ్యాయి.

# ఛార్జీలు పెంచుకునేందుకు అవకాశమివ్వండి

## ఈఆర్సీకి డిస్కంల విజ్ఞప్తి

## ఆర్థిక వనరులపై నియంత్రణమండలి విచారణ



**విశ్వంభర, హైదరాబాద్:** ఉత్పత్తి సంస్థల నుంచి కొంటున్న కరెంట్?కు, వినియోగదారులకు పంపిణీ చేస్తున్న విద్యుత్?కు భారీగా లోటు ఉందని వాటిని పూడ్చుకునేందుకు చార్జీలు పెంచుకునేందుకు స్వల్పంగా అవకాశం ఇవ్వాలని డిస్కంలు ఈఆర్సీ ఎదుట పిటిషన్ దాఖలు చేశాయి. ఇందులో ఛార్జీల పెంచడం ద్వారా రూ.1,200 కోట్లు సమకూరితే, మిగిలిన 13 వేల 22 కోట్ల రూపాయలను రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే రాయితీ రూపంలో అందుతుందని ఈఆర్సీకి నివేదించాయి. విద్యుత్ పంపిణీ సంస్థల వార్షిక ఆదాయ వనరులపై విద్యుత్ నియంత్రణ మండలి బహిరంగ విచారణ చేపట్టింది. ఎస్పీడీసీఎల్?కు సంబంధించిన వార్షిక ఆదాయ నివేదికపై బహిరంగ విచారణ చేపట్టింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2024-25లో డిస్కంలకు రూ. 14 వేల 222 కోట్లు ఆదాయలోటు ఉన్నదని డిస్కంలు విద్యుత్ నియంత్రణ మండలికి పిటిషన్ దాఖలు చేశాయి. ఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ ఫరూఖీ, సంస్థ ఇతర ఉన్నతాధికారులు ఈ బహిరంగ విచారణకు హాజరయ్యారు. విద్యుత్ ఛార్జీలు పెంచడం లేదని, ఎల్.టి, హెచ్.టీ వినియోగదారుల నుంచి ఫిక్స్‌డ్ ఛార్జీల రూపేణా వసూలు చేసే వెసులుబాటు కల్పించాలని సీఎండీ ముషారఫ్ ఫరూఖీ స్పష్టం చేశారు. బీఆర్ఎస్ తరుపున వాదనలు వినిపించిన మండలిలో ప్రతిపక్ష నేత మధుసూదనాచారి ఛార్జీలు పెంచకూడదని పేర్కొన్నారు. కమిషన్ విచారణకు హాజరైన వినియోగదారులు : బహిరంగ విచారణలో వివిధ రంగాలకు చెందిన విద్యుత్ రంగ నిపుణులు, వ్యాపారవేత్తలు, వినియోగదారులు, రైతులు, రాజకీయ నేతలు సైతం కమిషన్ ఎదుట హాజరై తమ వాదనలు వినిపించారు. విద్యుత్ డిమాండ్?ను కావాలని అధికంగా చూపెడుతున్నారని విద్యుత్ రంగ నిపుణుడు వేణు గోపాల్?రావు ఆందోళన వ్యక్తం చేశారు. మరోవైపు వాస్తవ రెవెన్యూ గ్యాప్ రూ. 5,958 కోట్లు ఉంటుందని ఎస్పీడీసీఎల్ అంచనా వేస్తోంది. రాబోయే అక్టోబర్ - మార్చి మాసాల్లో ప్రతిపాదిత ఫిక్స్‌డ్ ఛార్జీల ద్వారా రూ. 1,028 కోట్లు వస్తోందని ఎస్పీడీసీఎల్ భావిస్తోంది. వీటిలో ఎల్.టీ వినియోగదారుల నుంచి ఫిక్స్‌డ్ ఛార్జీల రూపంలో రూ. 328 కోట్లు, హెచ్.టీ వినియోగదారుల నుంచి రూ. 94 కోట్లు, హెచ్.టీ వినియోగదారులకు పెంచిన ఎనర్జీ ఛార్జీల రూపేణా రూ.606 కోట్లు సమకూరే అవకాశం ఉందని డిస్కంలు భావిస్తున్నాయి.

# భూముల బదిలీ ఎలా జరిగింది?

## ఎవరు ఒత్తిడిచేశారు?

## ఐఏఎస్ అధికారి అమోయ్‌కుమార్‌పై ఈడీ ప్రశ్నల వర్షం



**విశ్వంభర, హైదరాబాద్:** రంగారెడ్డి జిల్లా భూదాన్ భూముల కేటాయింపుల్లో జరిగిన అక్రమాలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ దర్యాప్తు కీలక మలుపు తిరిగింది. ఈ అక్రమాల విషయంలో సీనియర్ ఐఏఎస్ అధికారి అమోయ్‌కుమార్‌ను బుధవారం ఈడీ సుదీర్ఘంగా ప్రశ్నించింది. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం నాగారంలో వందల కోట్ల విలువైన 42ఎకరాల భూదాన్ భూములను అక్రమంగా బదిలీ చేశారని ఆరోపణలు రావడంతో అప్పట్లో దీనిపై విజిలెన్స్ అధికారులు విచారణ జరిపారు. అక్రమాలపై నిజానిజాలను తేల్చేందుకు ఈడీ రంగంలోకి దిగింది.దర్యాప్తులో భాగంగా ఆ సమయంలో రంగారెడ్డి, మేడ్చల్ జిల్లా కలెక్టర్‌గా ఉన్న అమోయ్ కుమార్‌ను విచారణకు రావాలని ఈడీ 4 రోజుల క్రితం నోటీసులు జారీచేసింది. ఈనెల 22 లేదా 23న విచారణకు రావాలని అందులో సూచించింది. ఈ మేరకు బుధవారం ఉదయం 8గంటలకే న్యాయవాదితో కలిసి అమోయ్ కుమార్ బషీర్ బాగ్‌లోని ఈడీ కార్యాలయానికి చేరుకున్నారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం ఆరున్నర గంటల పాటు దాదాపు విచారించారు. భూములు ఏ విధంగా బదిలీ చేశారు, ఎవరెవరికి బదిలీ చేశారు, ఎవరి ఒత్తిడితో ఈ వ్యవహారం కొనసాగింది తదితర అంశాలపై అమోయ్‌కుమార్‌ను అధికారులు ప్రశ్నించినట్టు తెలుస్తోంది. విచారణ పూర్తయిన తర్వాత ఆయన తన న్యాయవాదితో కలిసి తిరిగి వెళ్లిపోయారు. అయితే రేపు మరోసారి అమోయ్‌కుమార్ ఈడీ విచారణకు హాజరయ్యే అవకాశం కనిపిస్తోంది.

# గొంతులో దోశ ఇరుక్కొని వ్యక్తి మృతి

## నాగర్ కర్నూల్‌లో విషాదం

**విశ్వంభర, నాగర్‌కర్నూల్:** గొంతులో దోశ ఇరుక్కొని ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన నాగర్ కర్నూల్ జిల్లాలో చోటు చేసుకున్నది. కల్వకుర్తికి చెందిన వెంకటయ్య అనే వ్యక్తి మద్యం సేవించి ఆ తర్వాత దోశ తిన్నాడు. అయితే, దోశ గొంతులో ఇరుక్కుపోవడంతో ఊపిరాడలేదు. కొద్దిసేపటికే అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. ఆయనను వెంటనే ఆసుపత్రికి తరలించగా.. అప్పటికే మరణించినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ప్రస్తుత ఈ ఘటన అందరినీ షాక్‌కు గురి చేస్తోంది. గతంలో కేరళలోనూ ఇదే తరహా ఘటన చోటు చేసుకున్నది. వలయార్‌లో ఇడ్లీలు తినే పోటీలు జరిగాయి. 50 సంవత్సరాల వయసున్న ఓ వ్యక్తి పోటీలో పాల్గొన్నాడు. పోటీలో భాగంగా ఇడ్లీలు తింటున్న సమయంలో ఊపిరాడక ప్రాణాలు కోల్పోయాడు. స్థానికులు అతన్ని ప్రానాలు కాపాడేందుకు గొంతులో నుంచి ఇడ్లీలను బయటకు తీసి సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించి ప్రాణాలు కోల్పోయాడు.

# నాగార్జున పరువు నష్టం దావాపై విచారణ

## రిప్లై ఫైల్ చేసిన కొండా సురేఖ తరపు న్యాయవాది



**విశ్వంభర, హైదరాబాద్:** మంత్రి కొండా సురేఖపై ప్రముఖ సినీనటుడు నాగార్జున వేసిన పరువునష్టం దావాపై నాంపల్లి స్పెషల్ కోర్టులో విచారణ జరిగింది. మంత్రి కొండా సురేఖ తర ఫున అడ్వకేట్ గుర్మీత్ సింగ్ రిప్లై ఫైల్ చేశారు. తదుపరి విచారణను న్యాయస్థానం అక్టోబర్ 30కి వాయిదా వేసింది. సినీనటుడు నాగార్జున కుటుంబాన్ని, వ్యక్తిగత విషయాలను ప్రస్తావి స్తూ ఇటీవల మంత్రి కొండా సురేఖ చేసిన వ్యాఖ్య లు తెలుగు రాష్ట్రాల్లో తీవ్ర దుమారం రేపిన సంగ తి తెలిసిందే. ఈక్రమంలో నాగార్జున ఆమెపై పరువు నష్టం దావా వేశారు. తమ కుటుంబ గౌరవాన్ని, ప్రతిష్ఠ దెబ్బతీసేలా సురేఖ వ్యాఖ్యలు చేశారంటూ నాంపల్లి న్యాయస్థానాన్ని ఆశ్రయించారు.

# బీఆర్ఎస్, ప్రజా సంఘాల నేతలు అరెస్ట్




**విశ్వంభర, రామన్నపేట:** యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండల కేంద్రంలోని రామన్నపేట, కొమ్మాయిగూడెం గ్రామాల పరిదిలో ఏర్పాటు చేయబోయే అంబూజా సిమెంట్ పరిశ్రమ కోసం మంగళవారం ప్రజాభిప్రాయ సేకరణను అడ్డుకుంటారన్న సమాచారంతో ఎక్కడిక్కడ బీఆర్ఎస్ నేతలు, పలువురు ప్రజా సంఘాల నేతలను ముందస్తుగా పోలీసులు అరెస్ట్ చేశారు. బీ.ఆర్.ఎస్. జిల్లా అధ్యక్షుడు రమావత్ రవీంద్ర కుమార్, మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డిలను గృహ నిర్భంధం చేశారు. తమను ఎందుకు అరెస్ట్ చేశారని పోలీసులతో ఎమ్మెల్యేలు వాగ్వివాదానికి దిగారు. అభిప్రాయ సేకరణ కోసం రామన్నపేటకు వెళ్తుండగా, చిట్యాల శివారులో నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్యను పోలీసులు అరెస్ట్ చేశారు. మంగళవారం రామన్నపేటలో అంబుజా సిమెంట్ పరిశ్రమ ఏర్పాటు కోసం ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమంలో పరిశ్రమ ఏర్పాటును రాజకీయ పార్టీలు, అధికార, ప్రతిపక్షాలు, ప్రజా సంఘాలు, ప్రజలు వ్యతిరేకిస్తున్నాయి.

# క్షిపణి దాడి.. క్షణాల్లో మట్టిలో కలిసిన అపార్ట్‌మెంట్



**బీరుట్:** హెజ్‌బొల్లా ఇజ్రాయెల్ మధ్య క్షిపణులు, డ్రోన్ దాడులు జరుగుతున్నాయి. మంగళవారం ఇజ్రాయెల్ చేసిన క్షిపణి దాడిలో లెబనాన్ రాజధాని బీరుట్ సమీపంలోని ఒక అపార్ట్‌మెంట్ కుప్పకూలింది. క్షణాల్లో ధూళిగా మారిపోయింది. దీనికి సంబంధించిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఈ క్షిపణి దాడికి 40 నిమిషాల ముందు ఇజ్రాయెల్ హెచ్చరిక చేసింది. బీరుట్ దక్షిణాన ఉన్న రెండు నివాస భవనాలు, దాని చుట్టుపక్కల ఇళ్లలో ఉండే పౌరులు ఖాళీ చేయాలని సోషల్ మీడియా వేదికగా వెల్లడించింది.ఇదిలా ఉంటే, గతవారం హెజ్‌బొల్లా.. ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు నివాసంపై డ్రోన్ల దాడి చేసిన విషయం తెలిసిందే. మొత్తం మూడు డ్రోన్లను ప్రయోగించింది. ఇందులో ఒకటి ఉత్తర ఇజ్రాయెల్‌లోని సెసెరియా నగరంలో ప్రధాని నివాసం ఉన్న భవనాన్ని తాకింది. ఇంటిలో నెతన్యాహు, ఆయన భార్య లేరని ఇజ్రాయెల్ అధికార వర్గాలు తెలిపాయి.

# సంపన్నుల జాబితాలో మరోసారి చోటు దక్కించుకున్న ట్రంప్



**వాషింగ్టన్:** మరో రెండు వారాల్లో అమెరికాలో అధ్యక్ష ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీ నుంచి డొనాల్డ్ ట్రంప్, డెమోక్రటిక్ పార్టీ నుంచి కమలా హారిస్‌లు బరిలో ఉన్నారు. ఈనేపథ్యంలో అత్యంత సంపన్నుల జాబితాలో ట్రంప్ మరోసారి చోటు దక్కించుకున్నారు. బ్లూమ్‌బర్గ్ బిలియనీర్స్ ఇండెక్స్ సూచీ ప్రకారం ప్రపంచంలోని 500 మంది సంపన్నుల జాబితాలో ట్రంప్ 481వ స్థానంలో ఉన్నారు. సెప్టెంబరు చివరిలో ట్రంప్ మీడియా- టెక్నాలజీ గ్రూప్‌లోని ట్రూత్ సోషల్ మీడియా షేర్లు మూడు రెట్లు పెరిగాయి. దీంతో ఆయన సంపద 6.5 బిలియన్ డాలర్లకు పెరిగింది. నవంబరు 5న అమెరికాలో అధ్యక్ష ఎన్నికలు జరగనున్నాయి. ఇక, ఈ ఎన్నికల్లో కమలాహారిస్‌కు గెలిచే అవకాశాలు ఎక్కువగా ఉన్నట్లు పలు సర్వేలు వెల్లడిస్తున్నాయి. మరోవైపు ట్రంప్‌నకు సైతం గెలిచే అవకాశం ఉన్నట్లు పలువురు విశ్లేషకులు పేర్కొంటున్నారు. ఈక్రమంలోనే ఆయన సంపన్నుల జాబితాలో మరోసారి చోటు దక్కించుకోవడం గమనార్హం.

# రష్యాకు ఉత్తర కొరియా బలగాలు



**బ్రస్సెల్స్/ సియోల్:** ఉక్రెయిన్‌పై యుద్ధానికి మద్దతుగా ఉత్తర కొరియా మరో 1500 మంది సైనికులను రష్యాకు తరలించిందని దక్షిణ కొరియా ఇంటెలిజెన్స్ చీఫ్ చావోతాయ్ యంగ్ వెల్లడించారు. ఈ విషయానికి సంబంధించిన విషయాలను తమ దేశ చట్టసభ సభ్యులకు యంగ్ తెలియజేశారు. డిసెంబర్ నాటికి 10,000 మంది సైన్యాన్ని పంపాలని ప్యాంగ్‌యాంగ్ ప్రణాళిక రచిస్తున్నట్లుగా పేర్కొన్నారు. అయితే ఇప్పటికే ఉక్రెయిన్‌పై పోరాడేందుకు ఉత్తర కొరియా ఈ నెలలో రష్యాకు 1,500 మందిని ప్రత్యేక దళంగా పంపినట్లు దక్షిణ కొరియా గూఢచార సంస్థ ధ్రువీకరించింది. 2023 ఆగస్టు నుంచి రష్యాకు 13 వేల ఆయుధాలను పంపిందని తెలిపింది. రష్యా యుద్ధ నౌకల ద్వారా 1500 మందితో కూడిన ఉత్తరకొరియా ప్రత్యేక బలగాలు రష్యాలోని వ్లాదివోస్టోక్ రేవు నగరాన్ని చేరుకున్నాయని దక్షిణ కొరియా నిఘా సంస్థ (ఎన్ఐఎస్) పేర్కొంది. త్వరలో మరిన్ని బలగాలు అక్కడికి వెళతాయని తెలిపింది. రష్యాలో మోహరించిన ఉత్తర కొరియా సైనికులకు రష్యా సైనిక యూనిఫామ్‌లు, ఆయుధాలు, నకిలీ గుర్తింపు పత్రాలు అందించినట్లు పేర్కొంది. ప్రస్తుత యుద్ధ పరిస్థితులకు అనుగుణంగా శిక్షణ పూర్తి చేసుకున్నాక వారిని పోరులోకి దించే అవకాశం ఉందని తెలిపింది.కాగా ఉత్తర కొరియా బలగాలను తాము వినియోగించు కుంటున్నట్లు వచ్చిన వార్తలను రష్యా అధ్యక్ష భవన అధికార ప్రతినిధి దిమిత్రీ పెస్కోవ్ ఖండించారు.రష్యా రాయబారి జార్జి జినోవిచ్‌తో సమావేశమైన దక్షిణ కొరియా విదేశాంగ ఉపమంత్రి కిమ్ హాంగ్ క్యూన్.. ఉత్తర కొరియా చర్యను తీవ్రంగా ఖండించారు. ఉత్తర కొరియాతో తమ సహకారం దక్షిణ కొరియా భద్రతా ప్రయోజనాలకు వ్యతిరేకం కాదని జినోవిచ్ స్పష్టంచేశారు. అధ్యక్షుడు జెలెన్‌స్కీ స్పందిస్తూ యుద్ధంలో మూడో దేశం ప్రవేశిస్తే అది మూడో ప్రపంచ యుద్ధానికి దారితీయవచ్చని హెచ్చరించారు.

# తండ్రి మరణం, కుమారుడి జననం

## గద్వాల జిల్లాలో హృదయాన్ని మెలిపెట్టే ఘటన



**విశ్వంభర, గద్వాల:** రోడ్డు ప్రమాదంలో తండ్రి మరణం, ఆ తర్వాత గంట సేపటికే కుమారుడు జన్మించిన ఘటన కర్నూలు జిల్లా ప్రభుత్వాసుపత్రిలో చోటు చేసుకుంది. జోగులాంబ గద్వాల జిల్లా రాజోలి మండలం తుమ్మలపల్లికి చెందిన శివ అనే వ్యక్తి మంగళవారం సాయంత్రం రాజోలి నుంచి సొంత గ్రామానికి ద్విచక్ర వాహనంపై వెళ్తున్నారు. మార్గమధ్యలో ఒక్కసారిగా కుక్క అడ్డు రావడంతో అదుపుతప్పి అతని వాహనం ప్రమాదానికి గురైంది.ఈ ఘటనలో తీవ్ర గాయాల పాలైన శివను హుటాహుటిన కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మరోవైపు శివ భార్య లక్ష్మీ గర్భవతిగా ఉంది. కొద్ది రోజుల క్రితం లక్ష్మీ ప్రసవం కోసం పుట్టింటికి వెళ్ళింది. ఆమెకు నొప్పులు రావడంతో పుట్టింటివారు నంద్యాల జిల్లా బలపాలపల్లి నుంచి దగ్గరలో ఉన్న బేతంచెర్ల ఆసుపత్రికి తీసుకువెళ్లారు. బీపీ అధికంగా ఉండడంతో ఆమెను కర్నూలు జిల్లాలోని ఆసుపత్రికి తరలించాల్సిందిగా వైద్యులు సూచించారు. గంట తర్వాత మరణం: ప్రమాదానికి గురైన శివ ప్రాణపాయ స్థితిలో, ప్రసూతి కోసం వచ్చిన లక్ష్మి ఇద్దరు కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చేరారు. కానీ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన శివ కొన ఊపిరితో కొట్టు మిట్టాడుతూ ప్రాణాలు విడిచాడు. మరోవైపు ప్రసవం కోసం వచ్చిన లక్ష్మికి పండంటి మగ శిశువు జన్మించాడు. శివ మరణించిన ఓ గంట సమయం తర్వాత అతనికి కుమారుడు పుట్టాడు. కానీ తనయుడిని చూసేందుకు ఆయన ప్రాణాలతో లేరు. అయితే లోబీపీ ఉండడంతో వైద్యుల సూచన మేరకు ఆమెకు భర్త మృతి చెందిన విషయాన్ని కుటుంబీకులు చెప్పలేదు. తర్వాత చివరి చూపుకోసం చెప్పడంతో ఆమె రోదన కలచివేసింది. విధి ఆడిన నాటకంలో ఆమె భర్త అంత్యక్రియలకు సైతం వెళ్లలేకపోయింది.

# మున్సిపాలిటీలో అవినీతిపై ప్రజాప్రతినిధుల మౌనం

## బహుజన సమాజ్ పార్టీ ఆరోపణ



**విశ్వంభర, నాగర్ కర్నూల్:** బహుజన సమాజ్ పార్టీ(బీఎస్పీ) నాగర్ కర్నూల్ అసెంబ్లీ కమిటీ ఆధ్వర్యంలో మున్సిపాలిటీ కార్యాలయం ముందు ధర్నా కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా అధ్యక్షులు, అడ్వకేట్ బోనాసి రాంచందర్ మాట్లాడుతూ ఈనెల 7న మున్సిపాలిటీలో కోట్ల రూపాయల అవినీతిపై విచారణ చేపట్టి, దోషులుగా తేలిన వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించామని తెలిపారు. దాదాపు 15 రోజులు గడుస్తున్నా ఇప్పటికీ జిల్లా కలెక్టర్ కార్యాలయం నుండి ఎలాంటి స్పందన లేదని స్పష్టం చేశారు. జిల్లా కేంద్రంలోనీమున్సిపాలిటీలో అవినీతి జరిగి, ప్రాథమిక విచారణల ఫైల్స్ జిల్లా అధికారుల టేబుల్స్ మీద ఉన్నా కూడా అవినీతి పరులను ఎందుకు కాపాడుతున్నారని ప్రశ్నించారు. అవినీతి పరులను ఎవరూ కాపాడుతున్నారని నిలదీశారు. నిరంతరం జిల్లా కేంద్రంలో ఉండే ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ఎంపీలు ఇప్పటి వరకూ మున్సిపాలిటీ అవినీతిపై ఎందుకూ స్పందించడం లేదనివిమర్శించారు. మున్సిపాలిటీ కౌన్సిల్‌లో ఉన్న అధికార, ప్రతిపక్ష పార్టీల కౌన్సిలర్లు జరిగిన అవినీతిపై ఎందుకు మౌనం పాటిస్తున్నారని దుయ్యబట్టారు. జిల్లాల్లో ఆడిట్ సెల్ ఎందుకు సక్రమంగా పనిచేయడం లేదని అడిగారు. ఆడిట్ జరిగినప్పుడు, ఈఅవినీతితంతు ఎందుకు బయట పడలేదని సందేహం వెలి బుచ్చారు. ఆడిట్ అధికారులను ఎవరు మేనేజ్ చేశారో కూడా మున్సిపాలిటీ ప్రజలకు తెలుపాలని రాంచందర్ కోరారు. ధర్నా ప్రాంగణం నుండే జిల్లా స్థానిక సంస్థల కలెక్టర్ కు రాంచందర్ కాల్ చేయడం జరిగింది. జిల్లా స్థానిక సంస్థల కలెక్టర్ స్పందిస్తూ అవినీతి పరులపై ఎఫ్ఐఆర్ నమోదు చేశామని, ప్రజాధనం కూడా కొంతమేర రికవరీ చేశామని ఫోన్ తెలిపారు. అవినీతి పరులను ఎప్పుడూ జైలుకు పంపిస్తారని అడిగితే స్పందన లేదని అన్నారు. జిల్లా స్థానిక సంస్థల కలెక్టర్‌కు 24 గంటల్లో అవినీతి పరులను సస్పెండ్ చేయాలనీ రాంచందర్ డిమాండ్ చేశారు. లేని పక్షంలో జిల్లా కలెక్టర్ కార్యాలయం ముట్టడి కార్యక్రమం నిర్వహిస్తామని హెచ్చరించారు. చివరగా వినతి పత్రాన్ని ఆఫీస్ గోడకు అంటించి తమ నిరసనను వ్యక్తం చేశారు. బీఎస్పీ మాజీ జిల్లా అధ్యక్షులు పృథ్వీరాజ్, అసెంబ్లీ అధ్యక్షులు సి. కళ్యాణ్, ప్రధాన కార్యదర్శి మడుపు నాగేష్, టౌన్ అధ్యక్షులు మధు, టౌన్ కమిటీ ఉపాధ్యక్షులు బాల నాగయ్య, నాయకులు శ్రీనువాసులు, శివరాజ్, రమేష్, నాగరాజు, బాలయ్య, రాజశేఖర్, శాంతయ్య, మధు, శ్రీకాంత్ పాల్గొన్నారు.

## అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీ స్థాపనను విరమించుకోవాలి

**విశ్వంభర, రామన్నపేట:** , కొమ్మాయిగూడెం గ్రామాల పరిధిలో నిర్మించ తలపెట్టిన ఆదానీ అంబుజా సిమెంట్ కంపెనీ రద్దు చేయాలని, యువజన సంఘాల ఆధ్వర్యంలో అంబేద్కర్ కు పూలమాలవేసి అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీని ఈ ప్రాంతం నుండి తొలగించాలని నినాదాలు చేస్తూ ముందుకు వెళ్లారు. బీ.ఆర్.ఎస్.వి నాయకులు వల్లమల్ల సూర్యప్రకాష్ మాట్లాడుతూ రామన్నపేటలో ఎట్టి పరిస్థితుల్లోనూ సిమెంట్ కంపెనీ ఏర్పాటు చేయనివ్వమని, ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న సిమెంట్ కంపెనీని ప్రాణం పోయినా ఇటుక కూడా నిర్మాణం కానివ్వమని, ఈ ప్రాంతంలోని ప్రజలు మొదటి నుండి వ్యవసాయం, కులవృత్తి చేసుకునేవారు ఈ కార్యక్రమంలో జట్టి శివప్రసాద్ యాదవ్, కొండగడప చింటూ, జిల్లెల మచ్చగిరి, జడల శాంతి కుమార్, మహేష్, సురేష్, కుక్కుడాల ఉపేందర్, శివకుమార్, ఆవుల సాయి కుమార్ యాదవ్, పాల్గొన్నారు.

## ప్రజాభిప్రాయ సేకరణలో నిరసన వ్యక్తం చేసిన బార్ అసోసియేషన్

**విశ్వంభర, రామన్నపేట:** యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలంలోని రామన్నపేట, కొమ్మాయిగూడెం గ్రామాల పరిధిలో నెలకొల్ప తలపెట్టిన అంబుజా సిమెంట్ కంపెనీ ప్రజాభిప్రాయ సేకరణలో బార్ అసోషియేషన్ సభ్యులు అందరూ తమ అభిప్రాయాన్ని ముక్త కంఠంతో వ్యతిరేకతను వ్యక్తం చేశారని వెంటనే సిమెంట్ కంపెనీ నెలకొల్పాలనే ఆలోచన విరమించుకోవాలని, రామన్నపేట బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎండి మజీద్ యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. జనావాసాలకు దగ్గరలో కాలుష్యకారక కంపనీ పెట్టే ఆలోచన చేయొద్దని, రామన్నపేటలో సబ్-కోర్టు మంజూరు అయిందని, కోర్టు నూతన భవనం కంపెనీకి 500 మీటర్ల సమీపంలో ఉందని, నూతన కోర్టు భవనాన్ని శంకుస్థాపన చేయనున్నామని, ఏడు మండలాల నుండి వందల సంఖ్యలో ప్రజలు నిరంతరం కోర్టుకు వచ్చి వెళుతుంటారని ఆయన అన్నారు. కాలుష్యపు సిమెంట్ కంపెనీ నెలకొల్పే ఆలోచన విరమించుకోవాలని లేదంటే న్యాయస్థాన్ని ఆశ్రయించి, న్యాయపోరాటం చేసైనా అడ్డుకుంటామని డిమాండ్ చేశారు.

# సదానందంకు ఘనంగా సన్మానం



**విశ్వంభర, కల్వకుర్తి:** తెలంగాణ రాష్ట్ర అతిథి అధ్యాపకుల సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎన్నికైన కల్వకుర్తికి చెందిన అయిల్ సదానందం గౌడుని కల్వకుర్తి మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్ కుమార్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శాలువాతో ఘనంగా సన్మానించారు. ఉన్నత విద్యావంతుడు, తెలంగాణ ఉద్యమ నేత, అధ్యాపకుల హక్కుల కోసం నిరంతరం పాటుపడే సదానందం గౌడుని రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గా నియమించడం న్యాయమైందని ఆనంద్ కుమార్ సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సదానందం గౌడ్ మాట్లాడుతూ ఈ పదవితో నా బాధ్యత మరింత పెరిగిందని ఎదిగిన కొద్ది ఒదిగి ఉంటు అతిథి అధ్యాపకుల కుటుంబాలకు న్యాయం జరిగే విదంగా కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హ్యూమన్ రైట్స్ మహిళా నేత రేష్మా బేగం, అస్మబేగం, రాంపర్వతాలు, సురేష్, చెన్నకేశవులు, ఎల్లికట్ట మాజీ సర్పంచ్ రాకేష్, దస్తగిరి పాల్గొన్నారు.

# బీజేపీతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యం

## జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్



**విశ్వంభర, వరంగల్:** తెలంగాణలో బీజేపీని బలోపేతం చేసే సంకల్పంతో జరుగుతున్న బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యులు కర్నె రవీందర్ నేతృత్వంలో మండల అధ్యక్షులు జాటోతు శ్రీనివాస్ ఆధ్వర్యంలో పర్వతగిరి మండలం ఏనుగల్ గ్రామంలో బీజేపీ సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వరంగల్ బీజేపీ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్, రాష్ట్ర ఎస్సీ మోర్చా అధ్యక్షులు కొండేటి శ్రీధర్ పాల్గొని స్థానిక రైతులకు, ప్రజలకు సభ్యత్వాలు కల్పించారు. అలాగే స్థానిక గ్రామ పెద్దలు మండల బీజేపీ నాయకులతో కలిసి కర్నె రవీందర్ నివాసంలో అల్పాహారం చేస్తూ వారితో ముచ్చటిస్తూ బీజేపీ బలోపేతం పై సభ్యత్వ నమోదు కార్యక్రమల పై దిశ నిర్దేశం చేశారు.అనంతరం జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్ మాట్లాడుతూ రైతులు మొదలుకొని మధ్యతరగతి ప్రజల జీవనోపాధిని మెరుగుపరిచే లక్ష్యంతో అనేక కీలక నిర్ణయాలు, కార్యక్రమాలను కేంద్ర బీజేపీ ప్రభుత్వం అమలు చేసిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లాడి తిరుపతి రెడ్డి, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు బైరి నాగరాజు, జిల్లా నాయకులు బాబూరావు, కుడికాల శ్రీధర్, మండల సభ్యత్వ ప్రముఖ్ గూడ నరేందర్, కర్నె వాసుదేవ్, బూత్ అధ్యక్షులు దేసు రాము, తొర్రి లక్ష్మణ్, వక్కల రాజు, మండల నాయకులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పథకాలపై విస్తృత ప్రచారం నిర్వహించాలి

## పథకాలను యువత సద్వినియోగం చేసుకొని ఉపాధి పొందాలి

### - జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్



**విశ్వంభర,మహబూబాబాద్:** ప్రభుత్వ పథకాలను యువత సద్వినియోగం చేసుకొని ఉపాధి పొందాలన్నారు జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్. బుధవారం కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో (డీఐపీసీ) జిల్లా స్థాయి ఇండస్ట్రియల్ ప్రమోషన్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ టీ - ప్రైడ్ స్కీమ్ ద్వారా జిల్లాలోనీ షెడ్యూల్ ట్రైబ్ (ఎస్టీ) 12 మందికి 41, 26,216 లక్షలు రూపాయలు, షెడ్యూల్ క్యాస్ట్ (ఎస్సీ) 03 మందికి 8,47,615 లక్షలు రూపాయలు, మొత్తం 49 లక్షల 73వేల 831 రూపాయల నిధుల కేటాయింపు కోసం కమిటీ, ప్రభుత్వ నిబంధనల ప్రకారం 15 మంది ఎస్సీ, ఎస్టీ, లబ్ధిదారులకు సబ్సిడీ ఋణాల ప్రతిపాదనలు పంపనున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలు పీఎం విశ్వకర్మ, టీ ప్రైడ్, తదితర సౌకర్యాల ద్వారా జిల్లాలోని యువతీ, యువకులు వ్యాపార రంగాల్లో ప్రవేశించి ఉపాధి అవకాశాలను పొందాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా పరిశ్రమల శాఖ జీఎం ఏ.సత్యనారాయణ, ఎస్పీడీసీఎల్ ఎస్ఈ నరేష్, బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ నరసింహ స్వామి, కాలుష్య నియంత్రణ మండలి ఈఈ సునీత, టీపీఓ సాయిరాం, ఎస్టీ, ఎస్సీ సంక్షేమశాఖల అధికారులు, ఆర్టీవో సాయి చరణ్, సంబధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# అష్టలక్ష్మీ ఆలయంలో ఈటల ప్రత్యేక పూజలు



**విశ్వంభర, ఎల్బీనగర్:**మహేశ్వరం నియోజకవర్గం ఆర్కే పురం డివిజన్ లోని సుప్రసిద్ధ అష్టలక్ష్మీ ఆలయంలో మల్కాజ్గిరి ఎంపీ ఈటల రాజేందర్ బుదవారం సిర్పూర్ ఎమ్మెల్యే హరీశ్ రావుతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రత్యేక గుర్తింపు పొందిన ఆలయాలలో అష్టలక్ష్మీ ఆలయం ముందు వరసలో ఉందన్నారు. ప్రతి వ్యక్తి ఆధ్యాత్మిక చింతన కల్గి ఉండాలన్నారు. కారక్రమంలో కార్పొరేటర్లు రాధా ధీరజ్ రెడ్డి, రంగా నర్సింహా గుప్త, కొప్పుల నరసింహ రెడ్డి, ఆలయ ఫౌండర్ ఛైర్మన్ గౌరి శెట్టి చంద్రశేఖర్ గుప్త, ఛైర్మన్ సోమ సురేష్, కార్యదర్శి గంప జగన్, ఆలయ కోశాధికారి అయిత అంజయ్య గుప్త పాల్గొన్నారు.

# ఈ నెల 27న మాదిగల ధర్మయుద్ధ మహాసభ

## హలో మాదిగ..ఛలో జగిత్యాల్ అనే నినాదంతో మహాసభ

## హాజరుకానున్న ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ



**విశ్వంభర, జగిత్యాల:** జగిత్యాల జిల్లా రాయికల్ పట్టణ కేంద్రంలో బుధవారం ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు దొబ్బల వేణుగోపాల ఆధ్వర్యంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఎస్సీలో ఉన్నటువంటి అన్ని కులాలకు సామాజిక సమానత్వం రావాలంటే ఎస్సీ వర్గీకరణ అవసరమని భావించి ఆగస్టు 1న ఎస్సీ వర్గీకరణను రాష్ట్ర ప్రభుత్వాలు చేసుకోవచ్చంటూ సుప్రీంకోర్టు రాష్ట్రాలకు అధికారాలు ఇవ్వడం జరిగింది. సుప్రీంకోర్టు తీర్పు వివరించిన తరుణంలో రాష్ట్రముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసెంబ్లీలో అన్ని రాష్ట్రాల కన్నా ముందే వర్గీకరణ అమలు చేస్తామని చెప్పారు. అలాగే ప్రస్తుతం ఉన్న నోటిఫికేషన్ లో అన్నిటిలో వర్గీకరణ అమలు చేస్తామని చెప్పారు. 30 ఏళ్ల ఆకాంక్ష నెరవేరిందని అనుకున్న తరుణంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన మాటను తప్పినందున`క్షణమే ఎస్సీరిజర్వేషన్ల వర్గీకరణను అమలు చేయాలని ఉద్యమ కార్యాచరణలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా అక్టోబర్ 25 నుండి 30 వరకు మాదిగల ధర్మయుద్ధ ఉమ్మడి జిల్లా మహాసభలు, నవంబర్ 4నుండి 14వరకు 119 నియోజకవర్గ కేంద్రాలలో, అన్ని మండల కేంద్రాలలో మాదిగల ధర్మ యుద్ధ దీక్షలు, నవంబర్ 16న దండోరా ధర్మ యుద్ధ రథయాత్ర కోదాడ నుండి మొదలవుతుందని తెలిపారు. నియోజకవర్గ కో కన్వీనర్ పోడేటి సునీల్, ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు బాబురావు నరసయ్య, పాలేపు బాలరాజు, పాలెపు సురేష్ మసీదు అజయ్, పాలెపు గణేష్, సుమంత్, నేరెళ్ల అరవింద్ పాల్గొన్నారు.

# సీ ఎం రిలీఫ్ ఫండ్‌తో పేదలకు లబ్ధి

## ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి



విశ్వంభర, ఎల్బీనగర్: ముఖ్యమంత్రి సహాయనిది పేదలకు ఎంతో మేలు అని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి అన్నారు. హయత్‌నగర్ డివిజన్ పరిధిలోని హైకోర్టు కాలనీలో నివాసం ఉంటున్న వెంకటేశ్వర్లు, రేణుక దంపతుల బాబు పుట్టుకతో చెవులు వినిపించక, నోట మాట లేకుండా పుట్టాడు. ఆర్థికస్థితులు బాగోలేని వెంకటేశ్వర్లు, రేణుక దంపతులు ఎల్.బి.నగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుదీర్ రెడ్డిని సంప్రదించారు. వెంటనే స్పందించిన సుదీర్ రెడ్డి ఆపరేషన్‌కు కావలసిన డబ్బుల వివరాలను ముఖ్యమంత్రి సహాయనిదికి దరఖాస్తు చేయడం జరిగింది. దానికి గాను వారికి రూ. 4,50,000ల ఎల్.ఓ.సీ. మంజూరయ్యింది. మంజూరైన చెక్కును వెంకటేశ్వర్లు, రేణుక లకు ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో గడ్డిఅన్నారం డివిజన్ మాజీ కార్పొరేటర్ భవాని ప్రవీణ్ కుమార్, సీనియర్ నాయకులు సదానంద్ రెడ్డి, బైర శంకర్, సత్తిరెడ్డి, కిట్టు యాదవ్ పాల్గొన్నారు.

# మాదిగల అసెంబ్లీ నియోజవర్గ సమ్మేళనం

## కరపత్రం ఆవిష్కరణ



**విశ్వంభర, హైదరాబాద్:** తెలంగాణలో మాదిగలకు 12% రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేస్తూ.. మాదిగల అసెంబ్లీ నియోజవర్గ సమ్మేళనం విజయవంతం చేయాలని బుధవారం హైదరాబాద్‌లో మాదిగ జేఏసీ సభ్యులు మంత్రి జూపల్లి కృష్ణారావుతో కరపత్రం రిలీజ్ చేయించారు. ఈ సందర్భంగా మాదిగ జేఏసీ సభ్యులు మాట్లాడుతూ.. 30 సంవత్సరాలుగా %జా% రిజర్వేషన్ కొరకు అనేక రకాలుగా.. వివిధ సంఘాలులను కలుపుకొని అన్ని నియోజకవర్గాల్లో మాదిగ సమ్మేళనలను నిర్వహిస్తున్నామన్నారు. రాజకీయ పార్టీలు మాదిగలతో ఓట్లు వేయించుకొని ఆయా పార్టీలు అధికారంలోకి వస్తున్నాయే తప్ప ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణను మాత్రం పట్టించుకోవడం లేదన్నారు. సుప్రీంకోర్టు రాష్ట్రాల వారిగా ఎస్సీ రిజర్వేషన్ చేసుకోవచ్చు అన్న తీర్పుకు అనుకూలంగా ముఖ్యమంత్రి స్పందించి తొందర్లోనే వర్గీకరణ అమలు జరుపుతామని తెలిపారని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంలోని 119 నియోజవర్గంలో ఉన్నటువంటి మాదిగలను చైతన్యవంతం చేసి వర్గీకరణ మాదిగల చిరకాల ఆకాంక్ష అయినటువంటి తీరుస్తామని డాక్టర్ పిడమర్తి రవి అన్నారు. డా పిడమర్తి రవి, ఎమ్మార్పీఎస్ నందు నరసింహారావు. మాదిగ జేఏసీ యూత్ అధ్యక్షుడు నక్క మహేష్. బీఎస్ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ బోరెల్లి సురేష్, జేఏసీ ఉస్మానియా యూనివర్సిటీ అధ్యక్షుడు జోగు గణేష్, జేఏసీ రాష్ట్ర నాయకుడు దేవరకొండ నరేష్ పాల్గొన్నారు.

# యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి

## డా. రఘునాథ్ బాబు



**విశ్వంభర, కూకట్ పల్లి:** నేటి యువత గంజాయి, మాదకద్రవ్యాలు, మద్యపానంకు బాధితులై చెడు మార్గాల్లో పయనిస్తున్నారని వారినీ సక్రమమైన మార్గాల్లో నడిపించే విధంగా కృషి చేస్తున్నట్లు ఆదరణ ఫౌండేషన్, మాతృదేవోభవ సత్సంగ్ సంయుక్త ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆదరణ ఫౌండేషన్ ఆఫ్ ఫౌండర్ డాక్టర్ రఘునాథ్ బాబు అన్నారు. కుల మతాలకతీతంగా వైద్య శిబిరాలు, సాంస్కృతిక అవగాహన సదస్సులు కరపత్రాల ద్వారా ప్రజల్లోకి తీసుకు వెళ్తున్నట్లు ఆయన తెలి పారు. మాతృదేవోభవ సత్సంగ్ ఫౌండర్ కేబీ శ్రీధర్, ఇండియన్ ప్రజా కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల కంటెస్టెడ్ ఎంపీ బీవీ నాయక్, సంఘసంస్కర్త వెంకటరమణ స్వామి, సామాజికవేత్త శివప్రసాద్‌లు పాల్గొన్నారు.

# విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవు

**విశ్వంభర, భూపాలపల్లి:** విధుల పట్ల నిర్లక్ష్యం వస్తే కఠిన చర్యలు తప్పవని భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ హెచ్చరించారు. బుధవారం జిల్లా కేంద్రంలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ రాహుల్ శర్మ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆరోగ్య కేంద్ర సిబ్బంది సమయపాలన పాటించడం లేదని, విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, సిబ్బంది సకాలంలో విధులకు హాజరు కాకపోవడంపై జిల్లా కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆకస్మిక తనిఖీలో సమయపాలన పాటించనట్లు గుర్తించిన వైద్యాధికారి డా నిహారిక, స్టాఫ్ నర్సు జి.సంధ్యారాణి, ఫార్మసిస్ట్ వి.చైతన్య, సహాయక సిబ్బందికి, అలాగే ఓపీ ఏఎన్ఎం లకు తక్షణమే షో కాజ్ నోటీస్ జారి చేయాలని జిల్లా వైద్యాధికారిని ఆదేశించారు. భవిష్యత్తులో ఏదేని ఇలాంటి సంఘటనలు జరిగితే విధుల నుండి శాశ్వతంగా తొలగిస్తామని ఆయన హెచ్చరించారు.

# వర్కింగ్ జర్నలిస్టులకు ప్రభుత్వ పథకాలు వర్తింపజేయాలి



**విశ్వంభర, ఆత్మకూరు(ఎం):** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండల కేంద్రంలోని తెలంగాణ జర్నలిస్ట్ యూనియన్ కార్యాలయంలో టీజేయూ మండల అధ్యక్షులు గడ్డం నాగరాజు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మండలంలోని వివిధ పత్రికలలో పనిచేస్తున్న వర్కింగ్ జర్నలిస్టులకు ఇంటి నిర్మాణానికి సరిపోయే విదంగా సుమారు ఒక 200 గజాల వుండే విదంగా ఇండ్ల స్థలాల పట్టాలు ఇచ్చి ఇందిరమ్మ పథకంలో ఇండ్లు నిర్మించి జర్నలిస్టులకు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. పొద్దుగాల లేచిన దగ్గర నుంచి రాత్రి పొద్దుపోయే వరకు ప్రజా ప్రతినిధుల, ప్రభుత్వ అధికారుల వార్తలను సేకరించి ప్రజలకు తెలియజేసే జర్నలిస్టులకు ప్రభుత్వ పథకాల్లో ప్రత్యేక కోటా ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరారు. అక్రిడేషన్ కార్డ్‌తో సంబంధం లేకుండా చిన్న పత్రికలు, పెద్ద పత్రికలు అనే తారతామ్యం చూపకుండా కష్టపడే వర్కింగ్ జర్నలిస్టులందరికి న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీ జే యూ మండల గౌరవ అధ్యక్షులు నోముల రవీందర్ రెడ్డి, గౌరవ సలహాదారులు గుర్రాల నాగరాజు, ఉపాధ్యక్షులు షేక్ అజీజ్, ప్రధాన కార్యదర్శి గుర్రం మల్లేష్, కార్యదర్శి పొన్నగాని సతీష్ గౌడ్, సహాయ కార్యదర్శి పానుగంటి బాల గంగాధర్, కోశాధికారి కట్టెకోల రమేష్ గౌడ్, మహిళా కన్వీనర్ దంతూరి సుమలత గౌడ్, కార్యవర్గ సభ్యులు గుర్రం సురేష్ పాల్గొన్నారు.

# ఎమ్మార్పీఎస్ మండల నూతన కమిటీ ఎన్నిక



**విశ్వంభర, చింతపల్లి:** ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ పిలుపు మేరకు ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు వింజమూరు కృష్ణయ్య మాదిగ ఆధ్వర్యంలో చింతపల్లి మండలంలో నూతన మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడిగా కొడుదుటి లక్ష్మణ్, ఉపాధ్యక్షులుగా నల్ల కాశయ్య, ప్రధాన కార్యదర్శిగా ఎర్ర కిరణ్, సహాయ కార్యదర్శి గా కొడుదుటి జంగయ్య, రామకృష్ణలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అలాగే ఎమ్మార్పీఎస్ ఇంచార్జిగా ఆరెకంటి యాదగిరి, ఎంఎస్ఎఫ్ నియోజకవర్గ ఇంచార్జిగా నల్ల శ్రీకాంత్ ఎన్నికైనారు. ఈ ఎన్నికకు సహకరించిన జిల్లా అధ్యక్షులు ఇరిగి శ్రీశైలం మాదిగ, శ్రీనివాస్ మాదిగ, నాగార్జున మాదిగ, ఆరెకంటి యాదయ్య, మాసం పెద్దయ్య, బావాండ్లపల్లి చెన్నయ్య, ఆరెకంటి జంగయ్య, ఇరిగి శేఖర్, నల్ల శంకర్, విజయ్ కుమార్ లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# రోడ్ నిర్మాణ పనులను పరిశీలించిన కార్పొరేటర్ సామల హేమ



**విశ్వంభర, సికింద్రాబాద్:** సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావు గౌడ్ ఆదేశాల మేరకు మధుర నగర్‌లోని ఎస్ఆర్ హాస్పిటల్ వెనుక కార్పొరేటర్ సామల హేమ, అధికారులు, నాయకులతో కలిసి రోడ్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ రోడ్ పనులను దాదాపు 30 లక్షల వ్యయంతో పనులు చేపట్టినట్లు తెలిపారు. రోడ్ పనులు గత ప్రభుత్వం బీఆర్ ఎస్ హయంలో మంజూరు చేసినట్లు తెలిపారు. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల కోడ్ నేపథ్యంలో వాయిదా పడుతూ వచ్చిందని అన్నారు. ఇప్పుడు పనులు మొదలు పెట్టామని, బస్తి వాసులకు ఎలాంటి ఇబ్బందులూ లేకుండా త్వరగా పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. దీంతో ఉద్రిక్తత వాతావరణం చోటు చేసుకోగా బస్తివాసులు కలగచేసుకొని పరిశీలించే అధికారం, ప్రారంభించే అధికారం స్థానిక ఎమ్మెల్యే, కార్పొరేటర్లకు ఉందని మీ కాంగ్రెస్ నాయకుల బెదిరింపులు ఏంటని ప్రశించగా కాంగ్రెస్ నాయకులు అక్కడి నుండి వెళ్ళిపోయారు. జీ హెచ్ ఎం సీ ఎ ఈ కౌశిక్, బీ అర్ ఎస్ నాయకులు జాకీర్, శైలెందర్, ఆనంద్, అక్రమ్, ఫజిల్, కలీమ్ మహిళా నాయకులు లక్ష్మి, సరోజినీ, లలిత, ఝాన్సీ, బస్తీవాసులు పాల్గొన్నారు.

# ప్రహరీగోడ నిర్మాణాన్ని ఆపివేయాలి




**విశ్వంభర, హైదరాబాద్:** ట్యాంక్ బండ్ వద్ద భారతరత్న డా.బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద నిర్మిస్తున్న ప్రహరీగోడను వెంటనే ఆపివేయాలని ఎస్సీ వర్గీకర్ణ వ్యతిరేక పోరాట యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో జీహెచ్ఎంసీ అధికారులకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు మన్నె శ్రీధర్ రావు (ఛైర్మన్), పి బల్వంత్ రావు (కన్వీనర్), టి రాజేష్ (కో-కన్వీనర్), ఎస్ అంజలి (కో-కన్వీనర్), ఎస్ ప్రవీణ్ (కో-కన్వీనర్), జి.కళ్యాణ్ (కో-కన్వీనర్), ఎం ఆదర్శ్ (కో-కన్వీనర్), ద జి కమల్ (కో-కన్వీనర్) పాల్గొన్నారు. శ్రీధర్ రావు మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు గాని, దళిత సంఘాలనిగాని ఎలాంటి సంప్రదింపులు చేయకుండా అక్కడ ప్రహరీగోడ నిర్మించడంచడం తగదన్నారు. ప్రహరీ గోడను నిలుపుదల చేసి దళితుల మనోభావాలను గౌరవించాలన్నారు.

# గార్బేజ్ లిఫ్టింగ్ రిక్షాలు పంపిణీ చేసిన ఎమ్మెల్యే కాలేరు



**విశ్వంభర, అంబర్ పేట్:** అంబర్ పేట్ డివిజన్‌లో ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ కార్పొరేటర్‌లు పద్మ వెంకటరెడ్డి, విజయ్ కుమార్ గౌడ్‌తో కలిసి పారిశుద్ధ్య కార్మికులకు గార్బేజ్ లిఫ్టింగ్ రిక్షాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మున్సిపల్ కమిషనర్ మారుతి దివాకర్, ఏఎంహెచ్ఓ డా. హేమలత, ఇతర అధికారులు, పారిశుద్ధ కార్మికులు పాల్గొన్నారు.

# మా కుటుంబం మీకు రుణపడి ఉంది: ప్రియాంకాగాంధీ



**వయనాడ్:** కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంకా గాంధీ వయనాడ్ లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేస్తున్న విషయం తెలిసిందే. దానిలో భాగంగా బుధవారం ఆమె నామినేషన్ వేశారు. రెండు చోట్ల ఎంపీగా గెలవడంతో రాహుల్ గాంధీ వాయనాడ్ లోక్‌సభ స్థానానికి రాజీనామా చేశారు. ఆ స్థానంలో తన సోదరి ప్రియాంకాగాంధీ బరిలో దిగుతుందని నియోజకవర్గ ప్రజలకు రాహుల్‌గాంధీ మాటిచ్చారు.ఆ మేరకు కాంగ్రెస్ హైకమాండ్ ప్రియాంకాగాంధీనివాయనాడ్ అభ్యర్థిగా ప్రకటించింది. ప్రియాంకాగాంధీ వాద్రా తొలిసారి ఎన్నికల బరిలో నిలిచారు. వాయనాడ్ లోక్‌సభ స్థానానికి జరుగుతున్న ఉప ఎన్నికల్లో ఆమె కాంగ్రెస్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్, తల్లి సోనియాగాంధీ , లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు, సోదరుడు రాహుల్‌గాంధీ , కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే , పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ సమక్షంలో ప్రియాంకాగాంధీ ఎన్నికల రిటర్నింగ్ అధికారికి తన నామినేషన్ పత్రాలను సమర్పించారు.

## నామినేషన్‌కు ముందు వాయనాడ్‌లో ప్రియాంకాగాంధీ రోడ్ షో..

అంతకుముందు ప్రియాంకాగాంధీ తన సోదరుడు రాహుల గాంధీ, పలువురు ఇతర కాంగ్రెస్ నేతలతో కలిసి వాయనాడ్ నియోజకవర్గంలోని కల్పెట్ట పట్టణంలో రోడ్ షో నిర్వహించారు. ఈ రోడ్ షోలో ప్రియాంకాగాంధీకి మద్దతుగా పలువురు నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు. రాహుల్‌గాంధీ, ప్రియాంకాగాంధీ వాహ నంపై అభివాదం చేస్తూ వెళ్తుంటే జనం నీరాజనం పట్టారు.ఈ రోడ్ షోలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఛత్తీస్‌గఢ్ మాజీ ముఖ్యమంత్రి భూపేశ్ బఘేల్, కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ తదితర నేతలు ప్రియాంకాగాంధీ రోడ్ షోలో పాల్గొన్నారు. రోడ్ షో ప్రారంభానికి ముందు ప్రియాంకాగాంధీ స్థానికంగా ఉన్న రిసార్టులో స్థానిక కాంగ్రెస్ నేతల సమక్షంలో నామినేషన్ పత్రాలపై సంతకం చేశారని ఆ పార్టీ వర్గాలు తెలిపాయి.

## మా కుటుంబం మీకు రుణపడి ఉంది ప్రియాంకాగాంధీ

రోడ్ షో అనంతరం కల్పెట్టలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రియాంకాగాంధీ, రాహుల్‌గాంధీ ప్రసంగించారు.వాయనాడ్ నియో జకవర్గ అభివృద్ధికి కృషి చేస్తామని ప్రియాంక గాంధీ చెప్పారు. వాయనాడ్ ప్రజలకు తమ కుంటుంబం రుణపడి ఉన్నదని అన్నారు. ప్రపంచం అంతా తన సోదరుడికి వ్యతిరేకంగా ఉన్ననాడు వాయనాడ్ ప్రజలు అండగా నిలిచారని కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రెటరీ ప్రియాంకాగాంధీ అన్నారు. మీరు ఇచ్చిన మద్దతుతోనే ఆయన దేశంలో 8 వేల కిలోమీటర్ల యాత్ర చేయ గలిగారని ఆమె పొగిడారు. నా సోదరుడికి మద్దతుగా నిలిచిన మీ అందరికీ మా కుటుంబం రుణపడి ఉంటుందని చెప్పారు. ఆయన ఇప్పుడు మిమ్మల్ని విడిచి వెళ్లాల్సి వచ్చిందని, కానీ నేను ఆయనకు, మీకు మధ్య బంధాన్ని బలోపేతం చేస్తానని హామీ ఇస్తున్నానని అన్నారు.కాగా ప్రియాంకాగాంధీ తొలిసారి ప్రత్యక్షంగా ఎన్నికల బరిలో దిగారు. ఆమె ఇప్పటివరకు ఏ ఎన్నికల్లో కూడా ప్రత్యక్షంగా పోటీపడలేదు. అయితే గత 35 ఏళ్లుగా దేశంలో జరిగిన వివిధ ఎన్నికల్లో పార్టీ తరఫున ప్రచారం చేస్తూ వచ్చారు. ఇప్పుడు తొలిసారి ఆమె తనకోసం తాను ప్రచారం చేసుకోబోతున్నారు. కాగా వాయనాడ్ లోక్‌సభ స్థానానికి నవంబర్ 20న పోలింగ్ జరగనుంది. నవంబర్ 23న ఓట్లను లెక్కించి ఫలితాలను వెల్లడించనున్నారు.

## దేశంలో ఇద్దరు ఎంపీలున్న ఏకైక నియోజకవర్గం వాయనాడ్ : రాహుల్‌గాంధీ

దేశంలో ఇద్దరు ఎంపీలు ఉన్న ఏకైక లోక్‌సభ నియోజకవర్గం వాయనాడ్‌అని లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు, కాంగ్రెస్ ఎంపీ రాహుల్‌గాంధీ అన్నారు. రోడ్ షోలఅనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు.శంలో ఏ లోక్‌సభ స్థానానికైనా ఒకరే ఎంపీ ఉంటారని, కానీ వాయనాడ్‌కు మాత్రం ఇద్దరు ఎంపీలు ఉంటారని రాహుల్‌గాంధీ చెప్పారు. ప్రియాంకా గాంధీ అధికారిక ఎంపీగా ఉంటే, తాను అనధికారిక ఎంపీగా కొనసాగుతానని అన్నారు. ఇద్దరం కలిసి వాయనాడ్ అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. ఈ ర్యాలీలో ప్రియాంకాగాంధీ, రాహుల్‌గాంధీతోపాటు కాంగ్రెస్ పార్టీ గౌరవ అధ్యక్షురాలు సోనియా గాంధీ, పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ తదితరులు కూడా పాల్గొన్నారు.

# గ్యాంగ్‌స్టర్ చోటా రాజన్‌కు బెయిల్ మంజూరు



**దిల్లీ:** ఒకప్పటి అండర్‌వరల్డ్ డాన్‌గా పేరొందిన చోటా రాజన్‌కు బాంబే హైకోర్టు బెయిల్ మంజూరుచేసింది. 2001లో హోటల్ యజమాని జయాశెట్టి హత్య కేసులో చోటా రాజన్ దోషిగా తేలడంతో జీవిత ఖైదు విధిస్తూ తీర్పు ఎంసీవోసీఏ కోర్టు వెలువరించడంతో నాటినుంచి జైలు శిక్ష అనుభవిస్తున్నారు. తాజాగా ఆ శిక్షను రద్దు చేస్తూ బాంబే హైకోర్టు ఆయనకు బెయిల్ మంజూరుచేసింది.న్యాయమూర్తులు రేవతి మోహితే దేరే, పృథ్వీరాజ్ చవాన్‌లతో కూడిన డివిజన్ బెంచ్ చోటారాజన్‌కు బెయిల్ ఇవ్వడం కోసం రూ.లక్ష బాండ్ ఇవ్వాలని ఆదేశించింది. అయితే అతడిపై ఉన్న ఇతర క్రిమినల్ కేసుల వల్ల ఆయన ప్రస్తుతం జైల్లోనే ఉంటారని పేర్కొంది. కాగా దాదాపు 20 సంవత్సరాలుగా పరారీలో ఉన్న గ్యాంగ్‌స్టర్ ప్రసాద్ పూజారిని ఈ ఏడాది మార్చిలో ముంబయి క్రైం పోలీసులు ఎట్టకేలకు భారత్‌కు రప్పించారు. చైనా నుంచి దిల్లీకి అక్కడినుంచి ముంబయికి తీసుకొచ్చి అరెస్టు చేశారు.

## ఏమిటీ హోటల్ యజమాని కేసు?

సెంట్రల్ ముంబయిలోని గామ్‌దేవి ప్రాంతంలో ఉన్న 'గోల్డెన్ క్రౌన్' హోటల్ యజమాని జయశెట్టిని కొందరు దుండగులు 2001నమే 4న హోటల్ మొదటి అంతస్తులోచోటా రాజన్ ముఠాలోని ఇద్దరు సభ్యులుకాల్చి చంపారు. చోటా రాజన్ గ్యాంగ్‌సభ్యుడు హేమంత్ పూజారి డబ్బులు ఇవ్వాలని జయశెట్టిపై బెదిరింపులకు పాల్పడ్డారని.. డబ్బులు చెల్లించేందుకు అతడు నిరాకరించడంతో ఆయనను హత్య చేసినట్లు విచారణలో తేలినట్లు పోలీసులు పేర్కొన్నారు. ఈ హత్య కేసులో చోటారాజన్‌తో పాటు మరికొందరిని దోషులుగా నిర్ధరించిన ప్రత్యేక కోర్టు వారికి యావజ్జీవ కారాగార శిక్ష విధించింది. తన శిక్షను సస్పెండ్ చేసి, మధ్యంతర బెయిల్ మంజూరుచేయాలని చోటా రాజన్ బాంబే హైకోర్టులో అప్పీలు చేశారు. ప్రముఖ క్రైమ్ రిపోర్టర్ జే డే హత్య కేసులో ప్రస్తుతం జీవిత ఖైదు అనుభవిస్తున్న రాజన్ ప్రస్తుతం దిల్లీలోని తిహాడ్ జైల్లో ఉన్నారు.

# లారెన్స్ బిష్ణోయ్ సోదరుడితో సిద్ధిఖీ హత్య కేసు నిందితుల చాట్



**ముంబయి:** ఎన్సీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి బాబా సిద్ధిఖీహత్య.. మహారాష్ట్రతోపాటు బాలీవుడ్‌లోనూ సంచలనం రేపింది. కాగా ఈ కేసులో మరో కీలకవిషయం వెలుగులోకి వచ్చింది. సిద్ధిఖీని హత్య చేయడానికి ముందు లారెన్స్ బిష్ణోయ్ సోదరుడు అన్మోల్ బిష్ణోయ్‌తో షూటర్లు సంప్రదింపులు జరిపినట్లు పోలీసులు వెల్లడించారు. స్నాప్‌చాట్ ద్వారా నిందితులు తరచూ అన్మోల్‌తో సంభాషణలు జరిపినట్లు గుర్తించామని తెలిపారు. స్నాప్‌చాట్‌లో 24 గంటల్లోపు చాట్ మాయమయ్యే ఆప్షన్‌ను ఉపయోగించి సంప్రదింపులు జరుపుకునేవారని, దానిద్వారానే అన్మోల్ వారికి సిద్ధిఖీ, అతడి కుమారుడి ఫొటోలు పంపాడని నిందితులు పేర్కొన్నట్లు వెల్లడించారు. ఇప్పటివరకు ఈ కేసులో 10 మంది నిందితులను అరెస్టు చేశామని, మరో నిందితుడు శివకుమార్ గౌతమ్ పరారీలో ఉన్నాడని తెలిపారు.స్నాప్‌చాట్‌లో 24 గంటల తర్వాత మెసేజ్‌లు మాయమయ్యే ఆప్షన్ ఉండటం వల్ల వారి సంభాషణలను సేకరించలేకపోయినట్లు పేర్కొన్నారు. సిద్ధిఖీని హత్య చేసేందుకు కాంట్రాక్ట్ తీసుకున్న షూటర్లు దాడికి ముందు అటవీ ప్రాంతంలో చెట్లను లక్ష్యంగా చేసుకొని షూటింగ్ ప్రాక్టీస్ చేసినట్లు పేర్కొన్నారన్నారు. దీనిపై విచారణ కొనసాగుతోందని తెలిపారు.ఈ కేసుకు సంబంధించి ఇప్పటివరకు మొత్తం తొమ్మిది మందిని పోలీసులు అరెస్టు చేశారు. మరో ముగ్గురు కీలక నిందితులు పరారీలో ఉన్నారు. వారికోసం గాలింపుచర్యలు ముమ్మరం చేశారు. ముంబయిలోని బాంద్రాలో తన కుమారుడి కార్యాలయంలో ఉన్న సిద్ధిఖీపై దుండగులు ఆరు రౌండ్లు కాల్పులు జరిపిన సంగతి తెలిసిందే. వెంటనే ఆయన్ని లీలావతి ఆసుపత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతి చెందారు. అనంతరం సిద్ధిఖీని చంపింది తామే అని లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ ప్రకటించింది. అండర్ వరల్డ్ డాన్ దావూద్ ఇబ్రహీంతో ఎన్సీపీ నేతకు సంబంధం ఉన్నందు వల్లే ఆయనను హత్య చేసినట్లు పేర్కొంది. బాలీవుడ్ నటుడు సల్మాన్‌ఖాన్‌పై బెదిరింపులకు పాల్పడింది. సిద్ధిఖీ కుమారుడు ఎమ్మెల్యే జీషన్ సిద్ధిఖీ కూడా బిష్ణోయ్ గ్యాంగ్ హిట్‌లిస్ట్‌లో ఉన్నట్లు పోలీసువర్గాలు వెల్లడించాయి.

# దేశం ఎల్లప్పుడూ శివసేన సెంచరీ కొట్టాలనే కోరుకుంటుంది : ఎంపీ సంజయ్ రౌత్



**ముంబయి:** మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఉద్ధవ్ థాకరే వర్గం శివసేన ఎంపీ సంజయ్ రౌత్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 'వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో శివసేన వందకుపైగా స్థానాల్లో పోటీ చేయాలనుకుంటోందా..?' అని మీడియా ప్రశ్నించగా.. రౌత్ ఆసక్తికరంగా క్రికెట్ పరిభాషలో సమాధానం ఇచ్చారు. 'దేశం ఎప్పుడూ శివసేన సెంచరీ కొట్టాలనే కోరుకుంటుంది' అని చెప్పారు. తమకు అసెంబ్లీ ఎన్నికల్లో సెంచరీ కొట్టే సత్తా ఉన్నదని, కొట్టి తీరుతామని అన్నారు.ముంబైలో క్రికెట్ ఆడటం, చూడటం బాగానే జరిగిందని, క్రికెట్‌లో సంచరీకి చాలా ప్రాముఖ్యం ఉంటుందని సంజయ్ రౌత్ వ్యాఖ్యానించారు. శివసేన , ఎన్సీపీ , కాంగ్రెస్ పార్టీలతో కూడిన మహా వికాస్ అఘాడీ లో సీట్ల పంపకంపై పీఠముడి వీడటం లేదనే ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో రౌత్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. మహా వికాస్ అఘాడీలో సీట్ల పంపకంపై ఇంకా మంతనాలు జరుగుతున్నాయి. శివసేన అధిక సీట్లు డిమాండ్ చేస్తుండగా అందుకు కూటమి నేతలు ఒప్పుకోవడం లేదని తెలిసింది.మరోవైపు మంగళవారం శివసేన (యూబీటీ) అధ్యక్షుడు ఉద్ధవ్‌థాకరే, ఎంపీ సంజయ్ రౌత్ కేంద్ర హోం మంత్రి అమిత్ షాను కలిసినట్లు వార్తలు వినిపిస్తున్నాయి. అంటే ఉద్ధవ్ శివసేన కూడా అధికార మహాయుతి కూటమితో కలువబోతున్నదా..? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కానీ కొందరు రాజకీయ విశ్లేషకులు మాత్రం సీట్ల విషయంలో తన పంతం నెగ్గించుకోవడం కోసమే ఉద్ధవ్ థాకరే వర్గం శివసేన నేతలు ఈ విధమైన లీకులు ఇస్తున్నారని చెబుతున్నారు.

# బెంగళూరులో భవనం కుప్పకూలిన ఘటనలో ముగ్గురిపై ఎఫ్ఐఆర్ నమోదు



**బెంగళూరు:** కర్ణాటక రాజధాని బెంగళూరులో నిర్మాణంలో ఉన్న భవనం కుప్పకూలిన ఘటనకు సంబంధించి పోలీసులు ముగ్గురు బాధ్యులపై కేసులు నమోదు చేశారు. భవనం యజమాని మునిరాజ రెడ్డి, మోహన్‌రెడ్డి, ఏలుమలై అనే వ్యక్తులపై ఎఫ్ఐఆర్ రిజిస్టర్ చేసినట్లు హన్నూర్ పోలీసులు తెలిపారు. నిందితులపై బృహత్ బెంగళూరుమహానగర పాలక సంస్థ చట్టంలోనివివిధ సెక్షన్ల కింద కేసులు నమోదు చేసిట్లు వెల్లడించారు.ప్రస్తుతం భవన యజమాని మునిరాజరెడ్డి కుమారుడు భువన్‌రెడ్డి, కాంట్రాక్టర్ యునియప్ప తమ అదుపులో ఉన్నారని బెంగళూరు ఈస్ట్ డీసీపీ తెలిపారు. పరారీలో ఉన్న నిందితుల కోసం గాలిస్తున్నట్లు చెప్పారు. కాగా మంగళవారం సాయంత్రం బెంగళూరులో నిర్మాణంలో ఉన్న నాలుగంతస్తుల భవనం కుప్పకూలింది. దాంతో పలువురు కూలీలు శిథిలాల కింద చిక్కుకున్నారు. పోలీసులు, రెస్క్యూ టీమ్స్ రంగంలోకి దిగి సహాయక చర్యలు చేపట్టారు. కొందరు సురక్షితంగా బయటపడగా.. ముగ్గురు మృతిచెందారు.

# మహారాష్ట్ర ఎన్నికలకు అభ్యర్థుల మొదటి జాబితా విడుదల చేసిన ఎన్సీపీ



**ముంబయి:** త్వరలో మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ(ఎన్సీపీ) 38 మంది అభ్యర్థులతో కూడిన మొదటి జాబితాను విడుదల చేసింది.పార్టీ అధినేత అజిత్ పవార్ అతడి కుటుంబానికి కంచుకోట అయిన బారామతి స్థానం నుంచి పోటీ చేస్తారని ప్రకటించింది.భారతీయ జనతా పార్టీ (బీజేపీ), శివసేన ఎన్సీపీలతో కూడిన మహాయుతి కూటమి ఎన్నికల్లో పోటీ చేస్తోంది. కాగా శివసేనపార్టీ 45మంది అభ్యర్థులతో మంగళవారం తొలి జాబితాను విడుదల చేసింది. ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ శిందే కోప్రి-పచ్‌పఖాడి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి బరిలోకి దిగుతున్నట్లుగా పేర్కొంది. అయితే ప్రతిపక్ష 'మహావికాస్ అఘాడీ' కూటమిలో సీట్ల పంపకంపై ఇంకా చర్చలు కొనసాగుతున్నాయి.మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు నవంబర్ 20న ఒకే దశలో పోలింగ్ జరగనున్నట్లు కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. నవంబర్ 23న ఓట్ల లెక్కింపు చేపట్టనున్నట్లువెల్లడించింది. అయితే శివసేన, ఎన్సీపీ చీలిక తర్వాత జరుగుతున్న తొలి అసెంబ్లీ ఎన్నికలు కావడంతో దేశవ్యాప్తంగా ఆసక్తి నెలకొంది. అసలైన శివసేన, ఎన్సీపీ ఏవో ప్రజలు తేల్చనున్నారు.

# చెట్ల నరికివేతకు న్యాయస్థానం అనుమతి అవసరమని నాకు తెలీదు

## సుప్రీంకి దిల్లీ ఎల్జీ సమాధానం



**దిల్లీ:** దేశ రాజధాని దిల్లీ లో చెట్ల నరికివేతకు న్యాయస్థానం అనుమతి ఉండాలనే విషయంపై తనకు అవగాహన లేదంటూ దిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా సుప్రీంకోర్టుకు తెలిపారు. ఆయన సమర్పించిన ప్రమాణపత్రంలో ఈ విషయాన్ని పేర్కొన్నారు.దిల్లీ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్‌పర్సన్‌గా కూడా వీకే సక్సేనా బాధ్యత వహిస్తున్నారు. రిడ్జ్ ప్రాంతంలో దాదాపు 600 చెట్లను నరికేయడంపై ఇటీవల సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలైంది. దీనిని పరిశీలించిన న్యాయస్థానం.. అక్రమంగా 600 చెట్లను నేల కూల్చడంపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారో అఫిడవిట్ ద్వారా తెలియజేయాలని ఎల్జీని ఆదేశించింది. దీనిపై తాజాగా ఆయన ప్రమాణపత్రం సమర్పించారు.తాను రిడ్జి ప్రాంతంలో మెడికల్ ఫెసిలిటీ నిర్మించాలనుకున్న ప్రదేశాన్ని ఫిబ్రవరి 3వ తేదీన సందర్శించినట్లు ఎల్జీ తన ప్రమాణప్రతంలో పేర్కొన్నారు. ఆ సమయంలో ఆ నిర్మాణ అవసరం, ప్రాధాన్యం, దానికి కేటాయించిన వనరుల అంశాలను మాత్రమే పరిగణనలోకి తీసుకొన్నట్లు తెలిపారు. తిరిగి వస్తున్న సమయంలో రోడ్డు విస్తరణ జరుగుతున్న స్థలంలో ఆగినట్లు తెలిపారు.నాడు కోర్టు అనుమతిలేకుండా చెట్లనునరికివేయ కూడదనే అంశాన్నిఎవరూ తనదృష్టికి తీసుకురాలేదనిపేర్కొన్నారు. అయితే.. ప్రాజెక్టు కోసం చెట్ల నరికివేతకు అనుమతి కోరుతూ మార్చి 21న డీడీఏ ద్వారా దరఖాస్తు చేసుకున్న తర్వాత ఆ విషయం తనకు తెలిసినట్లు ఎల్జీ వివరించారు. చెట్లను నరికివేయడానికి కాంట్రాక్టర్‌లకు డీడీఏ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్,ఆ విభాగానికిచెందిన కొందరు అధికారులు ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు.తాజాగా దీనిపై సుప్రీం విచారణ చేపట్టింది.


# బాంబు బెదిరింపుల పోస్టుల కట్టడికి మీ చర్యలేంటి..?

## సోషల్‌మీడియా సంస్థలపై కేంద్రం ఆగ్రహం

**దిల్లీ:** దేశీయంగా నడిచే, విదేశాలకు వెళ్లే పలు విమానాలకు బాంబు బెదిరింపు హెచ్చరికలు రావడం కలకలం సృష్టిస్తోంది. అయితే ఈ బెదిరింపులు ఎక్కువగా సామాజిక మాధ్యమాల వేదికగానే వస్తున్నట్లు ఇటీవల పౌర విమానయానశాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు తెలిపారు. ఈ క్రమంలోనే కేంద్రం ఆయా మాధ్యమాల ప్రతినిధులతో వర్చువల్‌గా భేటీ అయ్యింది. కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ మంత్రిత్వశాఖ సంయుక్త కార్యదర్శి సంకేత్ ఎస్.భోండ్వే అధ్యక్షతన జరిగిన ఈ భేటీలో సామాజిక మాధ్యమాల పనితీరుపై ఆయన అసహనం వ్యక్తంచేసినట్లు తెలుస్తోంది. ఈ భేటీలో 'ఎక్స్'(ట్విటర్), మెటాతో సహా పలు సామాజిక మాధ్యమాల ప్రతినిధులు హాజరయ్యారు. ఎక్స్ తీరు నేరాలను ప్రోత్సహిస్తున్నట్లుగా ఉందంటూ కేంద్రం మండిపడినట్లు సమాచారం. అదేవిధంగా ఇటువంటి బెదిరింపులు మాధ్యమాల వేదికగా వ్యాప్తి చేస్తుంటే మీరు ఎలాంటి చర్యలు చేపట్టారో తెలియజేయాలని ఆదేశించినట్లు తెలుస్తోంది. ఇక, గత వారం రోజుల్లోనే దాదాపు 100 విమానాలకు బాంబు బెదిరింపులు రావడంఆందోళ కలిగిస్తుంది. ఇలా బాంబు బెదిరింపులకు పాల్పడే వారిపై కఠినంగా వ్యవహరిస్తామని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు హెచ్చరించారు. అదేవిధంగా వారినినో ఫ్లై లిస్ట్‌లో చేర్చేలా భద్రత నిబంధనలనూ కఠినతరం చేస్తామని తెలిపారు. అదేవిధంగా ప్రస్తుత విమానయాన భద్రతా నిబంధనల సవరణకు ప్రయత్నిస్తున్నట్లు వెల్లడించారు.



# ముగిసిన మోదీ రష్యా పర్యటన.. దిల్లీకి పయనం




దిల్లీ: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రెండు రోజుల రష్యా పర్యటన ముగిసింది. 16వ బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సులో పాల్గొన్న ఆయన.. రష్యా అధ్యక్షుడు పుతిన్, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ సహా పలువురు దేశాధినేతలతో చర్చలు జరిపారు. ఉజ్బెకిస్థాన్, యూఏఈ అధ్యక్షులతోనూ భేటీ అయ్యారు. మోదీ రష్యా పర్యటన విజయవంతంగా కొనసాగిందని భారత విదేశాంగ శాఖ వెల్లడించింది.బ్రిక్స్ సదస్సులో ప్రసంగించిన మోదీ.. దౌత్యం, చర్చలకు భారత్ మద్దతిస్తుందని, యుద్ధానికి కాదని పునరుద్ఘాటించారు. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం, పశ్చిమాసియాలో కల్లోల పరిస్థితులు, ఆర్థిక అస్థిరత, వాతావరణ మార్పులు, ఉగ్రవాదం వంటి పలు సమస్యలపై ఆందోళన వ్యక్తం చేశారు. ప్రపంచాన్ని సరైన మార్గంలో తీసుకువెళ్లడంలో బ్రిక్స్ సానుకూల పాత్ర పోషిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.పర్యటన తొలిరోజు రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో భేటీ కాగా, రెండోరోజు చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో మోదీ ద్వైపాక్షిక చర్చలు జరిపారు. ప్రాంతీయంగా శాంతి-సుస్థిరత సత్వరం నెలకొనేందుకు తాము పూర్తి మద్దతు ఇస్తామని పుతిన్‌తో చెప్పారు. ఇటు భారత్-చైనా సరిహద్దులో శాంతి, స్థిరత్వం కొనసాగించడమే తమ ప్రధాన లక్ష్యంగా ఉండాలని జిన్‌పింగ్‌కు పిలుపునిచ్చారు. ఇదిలాఉంటే, మూడు నెలల్లోనే రష్యాలో మోదీ రెండోసారి పర్యటించారు.

# రాష్ట్రంలో దారుణమైన పరిస్థితులు ఉన్నాయి: వైఎస్ జగన్



**విశ్వంభర,గుంటూరు:** ప్రేమోన్మాది చేతిలో దాడికి గురై ప్రాణాలు కోల్పోయిన సహాన కుటుంబసభ్యులకు ఏపీ మాజీ సీఎం వైఎస్ జగన్ పరామర్శించారు. బుధవారం ఉదయం తాడేపల్లి నుంచి గుంటూరు జీజీహెచ్‌కు వెళ్లినజగన్.. ముందుగా మార్చురీలో సహాన మృతదేహాన్ని పరిశీలించారు. అనంతరం సహాన కుటుం బ కుటుంబసభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు.ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో శాంతి భద్రతలు దిగజారిపోయా యని అన్నారు. ఓ దళిత చెల్లి బలైపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. వీన్‌తో పాటు మరికొం దరు ఆమెను తీసుకెళ్లారని పేర్కొ న్నారు. సహాన శరీరంపై గాయాలు ఉన్నాయని పేర్కొన్నారు. వైసీపీ పాలనలో మహిళలకు భరోసా ఇచ్చామని తెలిపారు. దిశ యాప్ అందుబాటులోకి తీసుకొచ్చామని చెప్పారు. ఈ ఘటనపై ప్రభుత్వం ఏవిధంగా స్పందించిందో చూశామని అన్నారు. ప్రభు త్వంనుంచి ఎవరూ ముందుకు రాలేదని పేర్కొన్నారు. బాధిత కుటుంబానికితోడుగా ఉండలేకపోయారని ఆవేదన వ్యక్తం చేశారు.రాష్ట్రంలో దారుణ మైనపరిస్థితులు ఉన్నాయని జగన్ అన్నారు. రాష్ట్రంలో రెడ్‌బుక్ పాలన నడుస్తోందని మండిపడ్డారు. నిందితు డు నవీన్ టీడీపీకి చెందిన వాడు అని అన్నారు. చంద్ర బాబు తోనూ నిందితుడు ఫొటోలు దిగారని చెప్పారు. అందుకే నవీన్‌ను కాపాడేందుకు ప్రయత్నిస్తున్నారని అన్నారు. నిందితుడిని నిస్సి గ్గగా వెనకేసు కొస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో దారుణమైన పరిస్థితులు ఉన్నాయని అనడానికి సహాన ఘటనే నిదర్శమని పేర్కొన్నారు. గుంటూరులోసహాన కుటుంబసభ్యులను పరామర్శించిన జగన్.. వైఎస్ఆర్‌జిల్లా బద్వేలుకుబయల్దేరి వెళ్లారు.ప్రేమోన్మాది పెట్రోలు పోసి నిప్పు పెట్టడంతో ఇంటర్ విద్యార్థిని కుటుంబ సభ్యులను జగన్ పరామర్శించనున్నారు.

**అసలేం జరిగింది..**

గుంటూరు జిల్లా తెనాలికి చెందిన మధిర సహాన అనే యువతి ఆస్పత్రిలో నర్సుగా పనిచేస్తోంది. ఈ నెల 19వ తేదీన విధులు ముగించుకుని ఇంటికి వస్తున్న సమయం లో నవీన్ అనే వ్యక్తి ఆమెను కారులో ఎత్తుకెళ్లాడు. అనంతరం ఆమె పై దాడి చేయడంతో సహాన అపస్మారక స్థితిలోకి వెళ్లింది. దీంతోఆమెను ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించి..వారి తల్లిదండ్రు లకు సమాచారం అందించాడు. ఆ తర్వాత అక్కడి నుంచి పరారయ్యాడు. అయితే తమ కుమార్తె ఆస్పత్రిలో ఉందని తెలియడంతో కుటుంబసభ్యులు హుటాహుటినా ఆస్పత్రికి తీసుకెళ్లారు. అప్ప టికే సహాన బ్రెయిన్ డెడ్ కావడంతో ఆమెను రక్షించుకోవడానికి శతవిధాలుగా ప్రయత్నించారు. చివరకు గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. అక్కడే వెంటిలేటర్‌పై చికిత్స పొందుతూ చివరకు మరణించింది.

## అత్యాచారాలు, దాడులకు కారణం గంజాయి, డ్రగ్స్ : మాజీ మంత్రి పీతల సుజాత



**విశ్వంభర, అమరావతి:** మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పాలనతో ఏపీలో యువత భవిత నాశనమైందని మాజీ మంత్రి పీతల సుజాత ఆరోపించారు. అమరావతిలోని ఎన్టీఆర్ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. ఆడబిడ్డలపై అత్యాచారాలు, దాడులకు కారణం గంజాయి, డ్రగ్స్ అని మండిపడ్డారు. తాడేపల్లి ప్యాలెస్ సమీపంలో, సొంత నియోజకవర్గం పులివెందులలోనూ అత్యాచారాలు జరిగినప్పుడు, కాకినాడలో దుర్గాప్రసాద్, నెల్లూరులో హరిప్రసాద్ హత్యకు గురైనప్పుడు, ఆ దళిత కుటుంబాలను ఎందుకు పరామర్శించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్కడ వైకాపా నేతలే నిందితులని ఆరోపించారు.ఏపీలో దిశ యాప్ లేకపోవటం వల్లనే నేరాలు జరుగుతున్నాయని అబద్ధపు ప్రచారం చేస్తున్నారని, వైకాపా హయాంలో దిశ యాప్ ఉన్నప్పుడు అన్ని అఘాయిత్యాలు ఎలా జరిగాయని ప్రశ్నించారు. జగన్ పాలనలో అత్యాచారాలు, హత్యకు గురైన బాధిత కుటుంబాలకు తెదేపా ప్రభుత్వం ఆర్థిక సాయం అందించిందని సుజాత గుర్తుచేశారు. కఠిన సెక్షన్లతో, ఫాస్ట్ ట్రాక్స్ కోర్టులతో నిందితులకు శిక్షలు పడేలా చర్యలు తీసుకుంటోందన్నారు.

## 'నాకు అప్పగించిన బాధ్యతలను చిత్తశుద్ధితో నిర్వర్తిస్తా': ఏపీటిడ్కో ఛైర్మన్



**విశ్వంభర, విజయవాడ:** ఏపీ టిడ్కో ఛైర్మన్‌గా వేములపాటి అజయ్ కుమార్ బాధ్యతలు స్వీకరించారు. విజయవాడ ఆర్టీసీ పరిపాలనా భవనంలోని తన ఛాంబర్‌లో ఆయన టిడ్కో ఛైర్మన్‌గా ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక వ్యవహారాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేశ్, నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి తదితరులు తరలి వచ్చిఅభినందనలు తెలిపారు.తనకు అప్పగించినబాధ్యతలను చిత్తశుద్ధితోనిర్వహిస్తానని అజయ్ కుమార్ చెప్పారు. అనంతరం మంత్రి కందుల దుర్గేశ్ మాట్లాడుతూ టిడ్కో ఇళ్ల వ్యవహారంలో గత వైకాపా ప్రభుత్వం లబ్దిదారుల పట్ల అమానవీయంగా వ్యహరించిందని ఆరోపించారు. ఎన్డీయే ప్రభుత్వ హయాంలో టిడ్కో లబ్ధిదారులకు న్యాయం జరుగుతుందన్నారు.

## పులివెందుల వద్ద లోయలో పడిన ఆర్టీసీ బస్సు.. 25 మందికి గాయాలు



**విశ్వంభర, వేంపల్లి:** వైఎస్ఆర్ జిల్లా పులివెందుల సమీపంలో రోడ్డు ప్రమాదం జరిగింది. ఎదురుగా వస్తున్న వాహనాలను తప్పించబోయి ఆర్టీసీ పల్లె వెలుగు బస్సు 30 అడుగుల లోయలో పడింది. కదిరి నుంచి పులివెందులకు వస్తుండగా ఘటన చోటుచేసుకుంది. ప్రమాదంలో 25 మంది ప్రయాణికులకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను పులివెందుల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది.కదిరి నుంచి బయల్దేరిన ఆర్టీసీ బస్సు.. పులివెందుల సమీపంలోని డంపింగ్‌యార్డు వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న వాహనాలను తప్పించే క్రమంలో డ్రైవర్ బ్రేకులు వేశారు. దీంతో బస్సు స్కిడ్ అయి చెట్లను తాకుతూ పక్కనే ఉన్న లోయలో పడిపోయింది. క్షతగాత్రులను తెదేపా ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి, మున్సిపల్ ఛైర్మన్ వరప్రసాద్ పరామర్శించారు. బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లకు సూచించారు.

## పురుగుల మందు కొనిచ్చిన ప్రియుడు.. తాగి ఆత్మహత్య చేసుకున్న ప్రియురాలు

**విశ్వంభర,యు.కొత్తపల్లి:** ఆ యువకుడే తన సర్వస్వం అనుకుంది ఆ అమ్మాయి.. తనతోనే నూరేళ్ల జీవితం గడపాలని ఆశపడింది. కానీ ఆ అబ్బాయి మాత్రం అవసరాలను తప్ప ఆమెలోని ప్రేమను గుర్తించలేదు. తన కోరిక తీరగానే వేరే అమ్మాయితో పెళ్లికి సిద్ధమయ్యాడు. ఇదేంటని ప్రశ్నిస్తే ముఖం చాటేశాడు.నువ్వు లేకుండా నేను బతకలేనని చెబితే..ఛస్తేచావమని పురుగుల మందు కొనిచ్చాడు.. ఇన్నాళ్లూ తన వాడు అనుకునే వాడే చావమనడంతో ఆ బాధతోనే పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. ఈ హృదయ విదారక ఘటన ఏపీలోని తూర్పు గోదావరి జిల్లాలో చోటుచేసుకుంది.వివరాల్లోకి వెళ్తే.. తూర్పుగోదావరి జిల్లాలోని యు.కొత్తపల్లికి చెందిన ఉమామహేశ్వరరావుకు కాకినాడ గొడారి గుంటకు చెందిన యువతి (24)తో ఏడేళ్ల క్రితం పరిచయం ఏర్పడింది. 2017లో వీరిద్దరికి పరిచయమవ్వగా.. కొంతకాలానికే ఇద్దరూ ప్రేమగా మారింది. ఉమామహేశ్వరరావు ప్రేమలో పడిపోయిన ఆ యువతి అతనితో ఎంతో చనువుగా ఉంది.కొంతకాలం కిందట తమ ప్రేమను మరో మెట్టు ఎక్కించాలని భావించి పెళ్లి చేసుకోమని ఉమామహేశ్వరరావును కోరింది. దీనికి పెద్దలు ఒప్పుకోవడం లేదంటూ బుకాయించాడు. తన కోరిక తీరగానే ఉమామహేశ్వరరావు మరో యువతితో పెళ్లికి సిద్ధమయ్యాడు. వేరే యువతితో ఇటీవల ఉమామహేశ్వరరావు నిశ్చితార్థం కూడా చేసుకున్నాడు. ఈ విషయం తెలిసిన యామిని ప్రియుడిని నిలదీసింది. నువ్వు వేరే అమ్మాయిని చేసుకుంటే నా సంగతేంటి? అని ప్రశ్నించింది. తనను ఎందుకు మోసం చేశావంటూ బాధపడింది. నువ్వు లేకపోతే బతకలేనని.. పెళ్లి చేసుకోమని ప్రాధేయపడింది. కానీ ఉమా మహేశ్వరరావు మాత్రం ఆమె బాధను అర్థం చేసుకోలేదు. ఛస్తే చావు గానీ.. నా పెళ్లికి అడ్డురావద్దని కరాఖండీగా చెప్పేశాడు. దీంతో ప్రేమలో మోసపోయానన్న బాధలో పురుగుల మందు కొనుక్కోవడానికి ఫెర్టిలైజర్ షాపునకు వెళ్లింది. ఆమె వెనకాలే వెళ్లిన ఉమామహేశ్వరరావు పురుగుల మందుకు డబ్బులు చెల్లించి వెళ్లిపోయాడు.ఇన్నాళ్లూ ప్రేమించిన వాడే తనను చావమని చెప్పడంతో కుమిలిపోయిన సదరు యువతి పురుగుల మందు తాగేసింది. కుమార్తె మృతి తర్వాత ఆమె ఫోన్‌లో మెసేజ్‌లు చూసిన తల్లిదండ్రులు ఉమామహేశ్వరరావుపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు మంగళవారం నాడు ఉమామహేశ్వరరావును అరెస్టు చేశారు.

## మాజీ మంత్రి కుమారుడికి 14 రోజుల రిమాండ్.. రాజమండ్రి జైలుకు తరలింపు




**విశ్వంభర, అమరావతి** :వాలంటీర్ జనుపల్లి దుర్గాప్రసాద్ హత్య కేసులో వైసీపీ నేత, మాజీ మంత్రి పినిపె విశ్వరూప్ కుమారుడు శ్రీకాంత్‌ను అరెస్టుచేసి రాజమండ్రి సెంట్రల్ జైలుకు తరలించారు. మధురైలో అరెస్టు చేసిన ఏపీ పోలీసులు మంగళవారం రాత్రి 11 గంటల సమయంలో కొత్తపేట జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ గౌరీశంకర్‌రావు ఎదుట హాజరుపరిచారు. ఈ క్రమంలో శ్రీకాంత్‌కు 14 రోజుల రిమాండ్ విధించారు. వాలంటీర్ హత్య కేసులో శ్రీకాంత్‌ను మూడు రోజుల క్రితం తమిళనాడులోని మధురైలో ఏపీ పోలీసులు అరెస్టు చేశారు. శ్రీకాంత్‌ను అక్కడి న్యాయమూర్తి ముందు హాజరుపరిచి.. ట్రాన్సిట్ వారెంట్‌పై తాజాగా ఏపీకి తీసుకొచ్చారు.మంగళవారంరాత్రి ఆయన్ను కొత్తపేట డీఎస్పీ ఆఫీసుకు తీసుకొచ్చారు. రాత్రి 11 గంటల సమయంలో జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ గౌరీశంకర్‌రావు ముందు హాజరుపరిచారు. శ్రీకాంత్‌కు 14 రోజుల రిమాండ్ విధించడంతో ఆయన్ను రాజమండ్రి సెంట్రల్ జైలుకు తరలించారు.డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అయినవిల్లికి చెందిన వాలంటీర్ జనువల్లి దుర్గాప్రసాద్ 2022 జూన్ 6వ తేదీన హత్యకు గురయ్యాడు. ఈ హత్య వెనుక పినిపె శ్రీకాంత్ హస్తం ఉందని ముందు నుంచి ఆరోపణలుఉన్నాయి.. కానీ అప్పుడు వైసీపీ అధికారంలో ఉండటంతో ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఇటీవల కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ కేసు మళ్లీ ముందుకు సాగింది. ఈ కేసులో ఉప్పలగుప్తం మండలానికి చెందిన వడ్డీ ధర్మేశ్ హస్తం ఉందని నిర్ధారించి ఈ నెల 18న అతన్ని అరెస్టు చేశారు. వడ్డీ ధర్మేశ్‌ను విచారించి కీలక వివరాలు సేకరించారు.దుర్గాప్రసాద్‌నుహత్య చేయించేందుకునిర్ణయించిన శ్రీకాంత్..ధర్మేశ్ సాయంకోరి, మరో నలుగురికి ఆ బాధ్యత అప్పగించినట్లు విచారణలో గుర్తించినట్లు సమాచారం.

## ఏనుగు దాడిలో ఒకరు మృతి.. గ్రామంలో భయాందోళనలు

**విశ్వంభర, అమరావతి** : ఏపీ, కర్ణాటక రాష్ట్రాల్లోని సరిహద్దు జిల్లాలో భయాందోళనలు నెలకొని ఉన్నాయి. ఏనుగుల దాడితో గ్రామస్థులు భిక్కుభిక్కుమంటూ కాలం వెల్లదీస్తున్నారు. 15 రోజుల క్రితం ఏనుగుల గుంపు ఒకరిని తొక్కి చంపివేయగా నిన్న రాత్రి చిత్తూరు జిల్లాలో మరొకరిని చంపివేసింది.జిల్లాలోనిరామకుప్పం పిఎంకే తాండాలోరాత్రి ఒంటరి ఏనుగు గ్రామానికి చెందిన రెడ్యానాయక్‌పై దాడి చేసి చంపివేసిందనిస్థానికులు తెలిపారు. గ్రామస్థులు అటవీ అధికారులకు పోలీసు లకు సమాచారం అందించడంతో వారు బలగాలతో ఘటనా స్థలానికి చేరుకున్నా రు. మృతదేహాన్నిపోస్టుమార్టం కోసం ఆస్పత్రికి తరలించారు. అటవీ సమీప ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు.

## శ్రీవాణి బ్రేక్ దర్శనం.. జనవరి నెల టికెట్ల విడుదల



**విశ్వంభర, తిరుమల :** శ్రీవాణి బ్రేక్ దర్శన టికెట్ల 2025 జనవరి నెల కోటాను బుధవారం టీటీడీ విడుదల చేసింది. రోజుకు 500 టికెట్లు, 100 గదుల చొప్పున భక్తులకు అందుబాటులో ఉంచింది. వైకుంఠ ఏకాదశి పురస్కరించుకుని 2025 జనవరి 10 నుంచి 19వ తేది వరకు టికెట్ల విడుదలను వాయిదా వేశామని టీటీడీ అధికారులు వెల్లడించారు. భక్తులు గమనించి ఆ తేదీలను మినాహాయించి ఆన్‌లైన్‌లో టికెట్లను బుక్ చేసుకోవాలని కోరారు.

**శ్రీవారి హుండీ ఆదాయం రూ. 3.59 కోట్లు**

కలియుగ ప్రత్యక్షదైవంగా కొలవబడుతున్న వేంకటేశ్వరస్వామిని దర్శించుకునేందుకు భక్తులు తిరుమలకుచేరుకుంటున్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు కంపార్టుమెంట్ల నుంచి కాకుండా నేరుగా దర్శనానికి క్యూలైన్లో నిలబడ్డారు. టోకెన్లు లేని భక్తులకు 6 గంటల్లో దర్శనం కలుగుతుందని అధికారులు వివరించారు. మంగళవారం స్వామివారిని 64,359 మంది భక్తులు స్వామివారిని దర్శించుకోగా 20,711 మంది తలనీలాలు సమర్పించుకున్నారు. భక్తులు సమర్పించుకున్న మొక్కుల ద్వారా శ్రీవారి హుండీకి రూ. 3.59 కోట్లు ఆదాయం వచ్చిందని తెలిపారు.

**వీఐపీ బ్రేక్ దర్శనం చేయిస్తానని మోసం.. తిరుమలలో మరో దళారి పట్టివేత**

తిరుమలలో మరోసారి దర్శన టికెట్ల దందా బయటపడింది. పుదుచ్చేరి సీఎం సిఫారసు లెటర్‌తో బ్లాక్‌లో టికెట్లు అమ్మడంతో పాటు భక్తులను మోసం చేస్తున్న ఓ దళారి బాగోతం వెలుగులోకి వచ్చింది. వీఐపీ బ్రేక్ దర్శనం చేయిస్తానని నమ్మించి భక్తుల నుంచి భారీగా డబ్బులు వసూలు చేయడంతోపాటు వారిని 300 ప్రత్యేకదర్శనంలైన్‌లో వదిలేశాడు. దీంతో మోసపోయామని గ్రహించిన బాధితులు.. టీటీడీ విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదు చేయడంతో ఈ విషయం బయటపడింది.పుదుచ్చేరి ప్రభుత్వ పీఆర్వో అని చెప్పుకుని పద్మనాభన్ అనే దళారి తిరుమలలో తన చేతివాటం ప్రదర్శించారు. పుదుచ్చేరి సీఎం సిఫారసు లేఖపై ఆయన రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు పొందాడు. అయితే భక్తులకు మాత్రం వీఐపీ బ్రేక్ దర్శనం కల్పిస్తానని చెప్పి నమ్మబలికాడు.వీఐపీ బ్రేక్ దర్శనం కల్పిస్తానని నమ్మించి నెల్లూరుకు చెందిన ఐదుగురు భక్తుల నుంచి రూ.23వేలు వసూలు చేశాడు. అనంతరం వారిని 300 ప్రత్యేక ప్రవేశ దర్శనం లైన్‌లో వదిలేశాడు. ఇది గమనించిన సదరు భక్తులు దళారీని నిలదీశారు. వీఐపీ బ్రేక్ దర్శనం అని చెప్పి రూ.300 లైన్‌లోకి తీసుకొచ్చావేంటని ప్రశ్నించారు. దీనికి దళారి సరైన సమాధానంచెప్పలేదు. దీంతోవారు వెళ్లి టీటీడీవిజిలెన్స్ సిబ్బంది ఆశ్రయించారు.భక్తుల నుంచి ఫిర్యాదు స్వీకరించిన టీటీడీ విజిలెన్స్ అధికారులు.. ఈ దర్శన టికెట్ల అంశంపై విచారణ చేపట్టారు. పద్మనాభన్‌ను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం ఈ వ్యవహారంపై తిరుమల టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో టీటీడీ విజిలెన్స్ వింగ్ ఏవీఎస్వో శ్రీధర్ ఫిర్యాదు చేశారు.

## పెట్రోల్ దాడి ఘటనలో మృతి చెందిన విద్యార్థిని కుటుంబంతో మాట్లాడిన సీఎం చంద్రబాబు




**విశ్వంభర, బద్వేలు:** వైఎస్ఆర్ జిల్లా బద్వేలులో పెట్రోల్ దాడికి గురై మృతి చెందిన ఇంటర్ విద్యార్థిని కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలిచింది. ఆమె కుటుంబానికి సీఎం చంద్రబాబు రూ.10 లక్షల ఆర్థిక సాయం ప్రకటించారు. బుధవారం బాధిత కుటుంబ సభ్యులతో ముఖ్యమంత్రి ఫోన్‌లో మాట్లాడి పరామర్శించారు. అనంతరం ఇన్‌ఛార్జి కలెక్టర్ అదితి సింగ్, తెదేపా నేత శ్రీనివాసరెడ్డి చెక్కును అందజేశారు.పెట్రోల్ దాడికి గురై మృతి చెందిన విద్యార్థిని తల్లితో సీఎం చంద్రబాబు ఫోన్‌లో మాట్లాడారు. కుటుంబ సభ్యులకు అండగా ఉంటానని ధైర్యం చెప్పారు. నిందితుడిని అరెస్టు చేశారని.. కఠిన శిక్ష పడేలా చేస్తామని హామీ ఇచ్చారు. ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ద్వారా విచారణ జరుపుతామని చెప్పారు. బాలిక సోదరుడి చదువు బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుందన్నారు. ఆమె తల్లికి ఉపాధి కల్పించేలా ఏర్పాట్లు చేయాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు.

## వైసీపీకి వాసిరెడ్డి పద్మ రాజీనామా.. జగన్‌పై తీవ్ర విమర్శలు



**విశ్వంభర, గుంటూరు:**వైసీపీకి మరో షాక్ తగిలింది. ఆ పార్టీ మహిళానేత, రాష్ట్ర మహిళా కమిషన్ మాజీ ఛైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ రాజీనామా చేశారు. గత కొంతకాలంగా పార్టీ కార్యక్రమాలకుఆమె దూరంగా ఉంటున్నారు. ఈక్రమంలో వైకాపాను ఆమె వీడారు. రాజీనామా లేఖను వైకాపా కార్యాలయానికి వాసిరెడ్డి పద్మ పంపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైసీపీఅధ్యక్షుడు జగన్‌పై తీవ్ర విమర్శలు చేశారు.

**'గుడ్ బుక్' పేరుతో మరోసారి జగన్ మోసం**

"వైసీపీ పాలనలో మాజీ సీఎం జగన్ ప్రజలను అన్నివిధాలుగా మోసం చేశారు. ప్రభుత్వ మద్యం పేరిట పేద ప్రజలను దోచుకున్నారు. ఐదేళ్ల పాలనలో ఎప్పుడూ ప్రజా సమస్యలను పట్టించుకోలేదు. వైకాపాలో మహిళలకు ఎలాంటి ప్రాధాన్యత లేదు. ఎన్నో అవమానాలు ఎదురైనా క్రమశిక్షణ కలిగిన నేతగా పార్టీ కోసం పనిచేశాను. మహిళలపై జరుగుతున్న దాడులను వైకాపా రాజకీయంగా వాడుకోవడం బాధాకరం. గత ప్రభుత్వం హయాంలోనూ అనేక దాడులు జరిగాయి. సీఎం హోదాలో జగన్ ఎప్పుడూ బాధితులను పరామర్శించలేదు. మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలు, దాడులను ఆయన దృష్టికి తీసుకెళ్లినా కనీస చర్యలు తీసుకోలేదు. పార్టీని నడిపించడంలో, పాలనలో జగన్‌కు బాధ్యత లేదు. నియంతృత్వ ధోరణిని ప్రజలు మెచ్చుకోరని ఎన్నికల తీర్పు స్పష్టం చేసింది. జగన్ 'గుడ్ బుక్' పేరుతో మరోసారి మోసానికి సిద్ధమయ్యారు. నాయకులు, కార్యకర్తల కోసం ఉండాల్సింది 'గుడ్ బుక్' కాదు 'గుండె బుక్'" అని వాసిరెడ్డి పద్మ పేర్కొన్నారు.



# తెలుగు టైటాన్స్‌కు ఘోర పరాజయం

**విశ్వంభర, హైదరాబాద్:** ప్రోకబడ్డీ ప్రీమియర్ లీగ్ (పీకేఎల్) సీజన్ 11లో తెలుగు టైటాన్స్ పరాజయాల పరంపర కొనసాగుతోంది. వరుసగా రెండో మ్యాచ్‌లోనూ తెలుగు టైటాన్స్ చిత్తయ్యింది. హైదరాబాద్‌లోని గచ్చిబౌలి ఇండోర్ స్టేడియం వేదికగా జరిగిన మ్యాచ్‌లో తెలుగు టైటాన్స్ 2252 తేడాతో జైపూర్ పింక్ పాంథర్స్ చేతిలో చిత్తయ్యింది. జైపూర్ కెప్టెన్ అర్జున్ దేశ్‌వాల్.. 19 పాయింట్లతో సత్తా చాటడంతో తెలుగు టైటాన్స్ 30 పాయింట్ల తేడాతో ఘోర పరాజయాన్ని మూటగట్టుకుంది. అర్జున్ దేశ్‌వాల్‌కు తోడుగా అభిజిత్ మాలిక్(8) రాణించాడు. తెలుగు టైటాన్స్ తరఫున కెప్టెన్ పవన్ సెహ్రావత్ 7 పాయింట్స్, ఆశిష్ నర్వాల్, విజయ్ మాలిక్ ఐదేసి పాయింట్లతో టాప్ స్కోరర్లుగా నిలిచారు.

మ్యాచ్ ఆరంభం నుంచి ఇరు జట్లు హోరా హోరీగా తలపడ్డాయి. దాంతో ఫస్టాఫ్ ముగిసే సరికి 1813తో జైపూర్ ఐదు పాయింట్ల ఆధిక్యంలో నిలిచింది. సెకండాఫ్‌లో జైపూర్ దుమ్మురేపగా.. తెలుగు టైటాన్స్ చిత్తయ్యింది. జైపూర్ ఏకంగా 34 పాయింట్స్ సాధించగా.. తెలుగు టైటాన్స్ 9 పాయింట్స్‌కే పరిమితమైంది. తెలుగు టైటాన్స్‌ను మూడు సార్లు జైపూర్ ఆలౌట్ చేసింది.

సెకండాఫ్‌తో ఏకపక్షంగా మారిన ఈ మ్యాచ్‌లో తెలుగు టైటాన్స్ 41 రైడ్స్‌లో 13 సార్లే సక్సెస్ అయ్యింది. మరోవైపు జైపూర్ మాత్రం 40 ప్రయత్నాల్లో 23 సార్లు సక్సెస్ అవ్వడంతో పాటు ఒకసారి సూపర్ రైడ్ సాధించింది. ట్యాక్లింగ్‌లో తెలుగు టైటాన్స్ టీమ్ మరీ దారుణంగా విఫలమైంది. 31 ప్రయత్నాల్లో 5 సార్లు మాత్రమే సక్సెస్ అవ్వగా.. జైపూర్ 22 ప్రయత్నాల్లో 13 సార్లు పాయింట్స్ సాధించింది. దూకుడైన ఆటతో తెలుగు టైటాన్స్ మూల్యం చెల్లించుకుంది. విజయంతో ఈ టోర్నీని ప్రారంభించిన తెలుగు టైటాన్స్ వరుసగా రెండు మ్యాచ్‌ల్లో ఓడిపోవడాన్ని అభిమానులు జీర్ణించుకోలేకపోతున్నారు.

# రెండో టెస్ట్‌కు రిషబ్ పంత్ ఉంటాడా..?

## టీమిండియా హెడ్‌కోచ్ గౌతమ్ గంభీర్ కీలక అప్‌డేట్




**విశ్వంభర, క్రీడావిభాగం :** తొలి టెస్టులో న్యూజిలాండ్ చేతిలో 8 వికెట్ల తేడాతో పరాజయాన్ని చవిచూసిన టీమిండియా మరో పోరుకు సిద్ధమైంది. మూడు టెస్టుల సిరీస్‌లో భాగంగా పుణె వేదికగా గురువారం నుంచి రెండో టెస్టు ఆడనుంది. తొలి ఇన్నింగ్స్‌లో 46 పరుగులకే కుప్పకూలి అపకీర్తి మూటగట్టుకున్నప్పటికీ, ఆ తర్వాత టీమిండియా పుంజుకుని గొప్పగానే పోరాడింది. కానీ గెలుపు తీరాలకు చేరుకోలేకపోయింది. టెస్టు సిరీస్‌ను నిలుపుకోవాలంటే రేపటి నుంచి ప్రారంభంకానున్న రెండో టెస్టులో భారత్ తప్పక సత్తాచాటాలి. కివీస్‌ను చిత్తు చేసి సిరీస్‌పై గురిపెట్టాలి. అంతేగాక వరల్డ్ టెస్టు ఛాంపియన్‌షిప్ ఫైనల్ బెర్తు రేసులో నిలవడానికి పుణె టెస్టు టీమిండియాకు ఎంతో కీలకం. అయితే రేపటి మ్యాచ్‌లో భారత తుదిజట్టుపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

గాయపడిన శుభ్‌మన్ గిల్, రిషబ్ పంత్ పూర్తిగా కోలుకున్నారా? సర్ఫరాజ్ ఖాన్, కేఎల్ రాహుల్‌లలో ఎవరికి చోటు దక్కుతుందనే ఉత్కంఠ ఏర్పడింది. గిల్ గాయపడటంతో తుదిజట్టులో చోటు దక్కించుకన్న సర్ఫరాజ్ 150 పరుగుల కీలక ఇన్నింగ్స్‌తో ఆకట్టుకన్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో రాహుల్‌ను తప్పించి సర్ఫరాజ్ తుదిజట్టులో అవకాశం ఇవ్వాలని డిమాండ్ వినిపిస్తోంది. కాగా, మీడియా సమావేశంలో పాల్గొన్న గంభీర్ భారత తుదిజట్టుపై స్పష్టత ఇచ్చాడు.

గిల్, పంత్ కోలుకున్నారని గంభీర్ చెప్పాడు. అలాగే గిల్ తుదిజట్టులోకి వస్తున్నట్లు వివరించాడు. కేఎల్ రాహుల్‌కు మద్దుతు ఇస్తున్నట్లు తెలిపాడు."గాయం కారణంగా శుభ్‌మన్ గిల్ గత మ్యాచ్‌లో ఆడలేదు. అంతేకానీ జట్టు నుంచి తప్పించినట్లు కాదు. అతని మెడకు గాయమైంది. బంగ్లాదేశ్ సిరీస్‌లో అతని ప్రదర్శన ఆకట్టుకుంది. అతను కచ్చితంగా తుదిజట్టులో ఉంటాడు. మిగిలిన వాళ్ల గురించి ఇంకా ఖరారు కాలేదు. ప్లేయింగ్ 11 రేపు ఖరారు అవుతుంది. పుణె టెస్టు మ్యాచ్‌ను గెలవగలిగే కాంబినేషన్‌తో తుదిజట్టు ఉంటుంది" అని గంభీర్ పేర్కొన్నాడు.

# రాష్ట్రస్థాయి చెస్ పోటీలు ప్రారంభం



**విశ్వంభర, హనుమకొండ :** తెలంగాణ చెస్ అసోసియేషన్ సహకారంతో వరంగల్ జిల్లా చదరంగ సమాఖ్య ఆధ్వర్యంలో హనుమకొండలోని తిరుమల తిరుపతి కళ్యాణ మండపంలో తెలంగాణ అండర్ 15 బాలబాలికల రాష్ట్రస్థాయి చదరంగ పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా నిర్వహణ కార్యదర్శి కన్నా మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా సుమారు వంద మంది చెస్ క్రీడాకారులు ఈ పోటీలలో పాల్గొంటున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో వరంగల్ రెజ్లింగ్ అసోసియేషన్ అధ్యక్షులు రాజ్‌కుమార్, ఆర్బిటర్స్ సాయి ప్రదీప్ శ్రీనివాస్, ప్రేమ్‌సాగర్, వైశాలి, తదితరులు పాల్గొన్నారు.

# పొట్టి క్రికెట్‌లో జింబాబ్వే రికార్డ్

విశ్వంభర, క్రిడావిభాగం : ట్వంటీ20 క్రికెట్ లో జింబాబ్వే ప్రపంచ రికార్డ్ సృష్టించింది. గత రికార్డులను అన్నింటినీ తుడిచివేస్తూ 20 ఓవర్లలోనే ఏకంగా 344 పరుగులు చేసింది. ట్వంటీ20 ప్రపంచకప్ సబ్ రీజినల్ ఆఫ్రికా క్వాలిఫైయర్ టోర్నీలో భాగంగా గాంబియాపై జింబాబ్వే నాలుగు వికెట్లు కోల్పోయి 344 పరుగులు చేసింది. 2023లో మంగోలియాపై నేపాల్ 20 ఓవర్లలో 314 పరుగులు చేసింది. ఈ రికార్డును జింబాబ్వే తుడిచిపెట్టింది. ఓపెనింగ్ బ్యాటర్ బ్రియాన్ బెన్నెట్ (50), మారుమణి (62) శుభారంభం ఇచ్చారు. 5.4 ఓవర్లలో 98 పరుగులు చేశారు. మారుమణి 19 బంతుల్లోనే 62 పరుగులు చేశాడు. కెప్టెన్ సికిందర్ రాజా 43 బంతుల్లో 7 ఫోర్లు, 15 సిక్సులతో 133 పరుగులు చేశాడు. జింబాబ్వే తరఫున అంతర్జాతీయ ట్వంటీ20లో సెంచరీ చేసిన తొలి ఆటగాడిగా సికిందర్ చరిత్ర సృష్టించాడు.

**అంతర్జాతీయ టీ20ల్లో అత్యధిక ఇన్నింగ్స్ స్కోర్లు**

| | |
|---|---|
| జింబాబ్వే: 344/4 vs గాంబియా (2024), | నేపాల్: 314/3 vs మంగోలియా (2023) |
| టీమిండియా: 297/6 vs బంగ్లాదేశ్ (2024), | జింబాబ్వే: 286/5 vs సీషెల్స్ (అక్టోబర్ 2024) |
| ఆఫ్ఘనిస్తాన్: 278 vs ఐర్లాండ్ (2019) , | చెక్ రిపబ్లిక్: 278/4 vs టర్కీ (2019) |
| మలేషియా: 268/4 vs థాయిలాండ్ (2023), | ఇంగ్లాండ్: 267/3 vs వెస్టిండీస్ (2023) |
| ఆస్ట్రేలియా: 263/3 vs శ్రీ లంక (2016) , | శ్రీలంక: 260/6 vs కెన్యా (2007) |



# 2 నుంచి ఉద్యోగుల పోరుబాట

- జనవరి 30 వరకు ఆందోళనలు
- ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల ఐకాస వెల్లడి
- కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి 10 నెలలైనా ఫలితం శూన్యమని ఆవేదన



**విశ్వంభర, హైదరాబాద్:** 'తెలంగాణ వస్తే బతుకులు మారతాయని విశ్వసించాం.. జీతాలు, భత్యాలు పెండింగ్‌లో పడతాయని అనుకోలేదు. మా సమస్యలు తీరుస్తామని ఎన్నికల ప్రణాళికలో హామీ ఇచ్చిన కాంగ్రెస్.. అధికారంలోకి వచ్చి 10 నెలలలైనా పరిష్కరించలేదు. అందుకే ఉద్యమబాట పట్టక తప్పడం లేదు' అని తెలంగాణ ఉద్యోగుల ఐకాస సమావేశం ప్రకటించింది. టీఎన్‌జీవో కేంద్ర కార్యాలయంలో మంగళవారం 206 ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల, కార్మిక సంఘాలతో కూడిన టీజీఈజాక్ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. అనంతరం పలు భాగస్వామ్య సంఘాల నేతలతో కలిసి ఐకాస ఛైర్మన్ మారం జగదీశ్వర్, జనరల్ సెక్రటరీ ఏలూరి శ్రీనివాసరావు విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. అయిదు డీఏలు పెండింగ్‌లో ఉండటం చరిత్రలో ఎన్నడూ చూడలేదని జగదీశ్వర్ అన్నారు. తాము దాచుకున్న జీపీఎఫ్ డబ్బులు కూడా ఇవ్వట్లేదన్నారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి ఎన్నోసార్లు వినతిపత్రాలిచ్చినా.. కనీసం కూర్చొని చర్చించే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దసరాలోపు రెండు డీఏలు వస్తాయనుకున్నామని, ఇప్పుడు దీపావళిపై ఆశలు పెట్టుకున్నామని తెలిపారు. తెలంగాణ వచ్చాక ఉద్యోగ సంఘాలకు గౌరవం లేకుండా పోయిందని వ్యాఖ్యానించారు. తమ సమస్యలపై 26న జరిగే మంత్రివర్గ సమావేశంలో చర్చించి పరిష్కరించాలని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అలా చేస్తారన్న నమ్మకం ఉందన్నారు.

### సీఎస్ ఒక్కపూట చర్చిస్తే పరిష్కారం

కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో పెట్టిన ఆరు ప్రధాన డిమాండ్లను పరిష్కరించాలని మొరపెట్టుకున్నా పట్టించుకోలేదని ఐకాస జనరల్ సెక్రటరీ ఏలూరి శ్రీనివాసరావు విమర్శించారు. కనీసం 44 ఆర్థికేతర సమస్యల పరిష్కారానికి కూడా పూనుకోలేదని, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఒక్కపూట సంఘాలతో కూర్చొని చర్చిస్తే వాటిని తీర్చవచ్చన్నారు. మంత్రివర్గ సమావేశంలో సానుకూల ప్రకటన వస్తుందనుకుంటున్నామని చెప్పారు. సమావేశంలో ఐకాస నేతలు చావ రవి, సదానందంగౌడ్, వంగా రవీందర్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, ముజీబ్, సత్యనారాయణ, అశోక్‌కుమార్, లింగారెడ్డి, కటకం రమేష్, లక్ష్మయ్య, పర్వతి సత్యనారాయణ, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

**ఏకగ్రీవంగా తీర్మానించిన ఆరు ప్రధాన డిమాండ్లు**

1. 2022 జులై 1 నుంచి పెండింగ్‌లో ఉన్న అయిదు డీఏలను విడుదల చేయాలి. బకాయిలను నగదు రూపంలో చెల్లించాలి.
2. పెండింగ్‌లోని అన్ని బిల్లులను మంజూరు చేయాలి. ఇకుబేర్ వ్యవస్థను రద్దు చేయాలి. ఖజానాశాఖ ద్వారా బిల్లులను క్లియర్ చేసి పాత విధానాన్ని పునరుద్ధరించి ఉద్యోగులకు చెల్లించాలి.
3. ధరల పెరుగుదల ప్రకారం 51 శాతం ఫిట్‌మెంట్ ఇవ్వాలి. 2వ వేతన సంఘం (పీఆర్‌సీ) సిఫార్సుల నివేదికను తెప్పించుకొని అమలు చేయాలి.
4. ప్రభుత్వం, ఉద్యోగులు/పెన్షనర్ల సమాన కంట్రిబ్యూషన్‌తో ఈహెచ్‌ఎస్ అమలు చేయాలి.
5. సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ పథకాన్ని పునరుద్ధరించాలి.
6. జీవో 317ను సమీక్షించాలి. దాని బాధితుల ఫిర్యాదులన్నీ పరిష్కరించాలి.

### ఇదీ ఉద్యమ కార్యాచరణ

నవంబరు 2: అన్ని జిల్లాల్లో జిల్లా కలెక్టర్లకు కార్యాచరణ లేఖల అందజేత.
4, 5 తేదీలు: జిల్లాల వారీగా ప్రజాప్రతినిధులకు వినతిపత్రాల సమర్పణ.
6వ తేదీ: ఐకాస రాష్ట్ర కార్యవర్గ సమావేశం.
7 నుంచి డిసెంబరు 27 వరకు: 10 ఉమ్మడి జిల్లాల్లో సదస్సులు.
జనవరి 34 వరకు: నల్లబ్యాడ్జీలతో విధులకు.. భోజన విరామంలో నిరసనలు.
జనవరి 21: అన్ని జిల్లాల్లో మౌన ప్రదర్శనలు.
23వ తేదీ: రాష్ట్రవ్యాప్తంగా బైక్ ర్యాలీలు.
30వ తేదీ: రాష్ట్రంలోని అన్ని కార్యాలయాల వద్ద మానవహారాలు.

# హోం మంత్రిని నియమించండి.. శాంతి భద్రతలు కాపాడండి

*** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కేటీఆర్ సూచన**
*** హత్యకు గురైన వృద్ధ దంపతుల కుటుంబ సభ్యులకు పరామర్శ**

**విశ్వంభర, హైదరాబాద్ :** తక్షణమే హోం మంత్రిని నియమించి రాష్ట్రంలో శాంతి భద్రతలను కాపాడాలని సీఎం రేవంత్ రెడ్డికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సూచించారు. హైదరాబాద్ నగరంలో శాంతిభద్రతలు పూర్తిగా దెబ్బతిన్నాయని కేటీఆర్ పేర్కొన్నారు. అంబర్‌పేట్‌లోని సాయిబాబా నగర్‌లో ఇటీవలే వృద్ధ దంపతులు లింగారెడ్డి, ఊర్మిళ దేవి దారుణ హత్యకు గురికాగా, వారి కుటుంబ సభ్యులను స్థానిక ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్‌తో కలిసి కేటీఆర్ పరామర్శించారు.

ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. సీనియర్ సిటిజెన్స్ లింగారెడ్డి, ఊర్మిళదేవిని పట్టపగలు చంపడం దారుణమన్నారు. హైదరాబాద్‌లోని ప్రతి ఒక్కరిని ఈ హత్యలు కలిచివేశాయన్నారు. ఆ వృద్ధ దంపతుల ముగ్గురు కుమార్తెలు బాధలో ఉన్నారని తెలిపారు. కేసీఆర్ ప్రభుత్వంలో 10 లక్షలు సీసీ కెమెరాలు పెట్టడం జరిగింది. ఏ బస్తీకి ఆ బస్తీ సీసీ కెమెరాలు పెట్టడం జరిగిందన్నారు. పోలీసులకు ఫ్రీ హ్యాండ్ ఇచ్చి పనిచేయమన్నాం.. శాంతిభద్రతలు బాగుండే రాష్ట్రంలో ఇప్పటి వరకు ఈ కేసును పోలీసులు ఛేధించలేకపోయారు అని కేటీఆర్ తెలిపారు.

రాష్ట్రంలో శాంతిభద్రతలు సరిగ్గా లేవని జగిత్యాలలో ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి చెప్పారు. సీఎం రేవంత్ రెడ్డికి చెప్తుతున్నాం ఒక్క హోం మంత్రిని నియమించండి. పోలీసులని మా మీద ఉసిగొల్పడం కాదు, అశోక్ నగర్‌లో పిల్లలు మీద దాడులు చేయించడం కాదు.. శాంతిభద్రతలను కాపాడండి. సమర్ధవంతమైన పోలీస్ అధికారులు చాలా మంది ఉన్నారు.. వారికి ఫ్రీడమ్ ఇవ్వండి.. పని చేయనివ్వండి అని కేటీఆర్ సూచించారు. ఎవరో వస్తారు.. ఏదో చేస్తారు అని ప్రజలు ఎదురు చూడకండి. హైదరాబాద్‌లో ఎక్కడైనా ఇబ్బంది ఉంటే మాకు చెప్పండి మీకు అండగా మేం ఉంటాం. పని చేయని సీసీ కెమెరా లును బాగు చేయించాల్సిన బాధ్యత ప్రభుత్వంపైన ఉంటుంది. మీతో కాకపోతే మా సొంత ఖర్చులతో అయినా చేయిస్తామని కేటీఆర్ చెప్పారు.

ఇప్పటికైనా మీరు చెంపలేసుకుంటారా..? ఫిరాయింపులపై సీఎంను సూటిగా ప్రశ్నించిన కేటీఆర్

పార్టీ ఫిరాయింపులకు పాల్పడ్డ ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని బీఆర్ఎస్ పార్టీ పోరాడుతున్న సంగతి తెలిసిందే. ఇదే అంశంపై కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి కూడా తీవ్రంగా స్పందించారు. పార్టీ ఫిరాయింపులు అప్రజాస్వామికమని, కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని జీవన్ రెడ్డి డిమాండ్ చేశారు. జీవన్ రెడ్డి వ్యాఖ్యలపై స్పందిస్తూ కేటీఆర్ ఎక్స్ వేదికగా ప్రశ్నించారు.

మీ సొంత పార్టీ నేతనే.. మీరు చేసిన ఎమ్మెల్యేల ఫిరాయింపులు అప్రజాస్వామికమని, దుర్మార్గమైన చర్య అని సూటిగా వేలెత్తి చూపుతున్నారని కేటీఆర్ పేర్కొన్నారు. ఇప్పటికైనా మీరు లెంపలేసుకుంటారా..? జీవన్ రెడ్డి లాంటి సీనియర్ నాయకుడే.. ఇది కాంగ్రెస్ విధానాలకు వ్యతిరేకం అని.. మీ దిగజారుడు రాజకీయాలపై దుమ్మెత్తి పోశారని కేటీఆర్ తెలిపారు.

ఇప్పటికైనా మీరు చేసిన తప్పును ఒప్పుకుంటారా..? క్షమాపణ చెబుతారా..? మీరు గడప గడపకు వెళ్లి చేర్చుకున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై చట్టప్రకారం వేటు వేయాల్సిందేనని పట్టుబడుతున్నారు. ఇప్పటికైనా ఫిరాయింపు ఎమ్మెల్యేలపై చర్యలు ఉంటాయా..? ఇప్పుడు రాయితో కొట్టాల్సింది ఎవరిని..? ఫిరాయించిన ఎమ్మెల్యేలనా..? ప్రోత్సహించిన మిమ్ములనా..? అని కేటీఆర్ ప్రశ్నించారు.

# ఫిరాయింపులు హైకమాండ్ నిర్ణయమే..

- జీవన్ రెడ్డి ఆవేదనతో మాట్లాడుతున్నారు
- టీపీసీసీ చీఫ్ కీలక వ్యాఖ్యలు



**విశ్వంభర, హైదరాబాద్:** ఇతర పార్టీల ఎమ్మెల్యేలను చేర్చుకోవాలన్నది హైకమాండ్ నిర్ణయమని పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ లిపారు. ఆ ప్రకారమే ఎమ్మెల్యేలను చేర్చుకున్నామని ఆయన స్పష్టం చేశారు.కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి అసమ్మతి నేపథ్యంలో టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. పార్టీ ఫిరాయింపులను కాంగ్రెస్ ప్రభుత్వం ప్రోత్సహించడంపై అసంతృప్తి వ్యక్తం చేయడంపై ఆయన స్పందించారు. ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి ప్రతిష్ఠకు ఎక్కడా భంగం వాటిల్లదని మహేశ్‌కుమార్ గౌడ్ తెలిపారు. గంగారెడ్డి హత్యపై ఉన్నతాధికారులతో మాట్లాడామని పేర్కొన్నారు. హత్య కేసులో విచారణ జరుగుతుందని.. త్వరలోనే అన్ని విషయాలు తెలుస్తాయని తెలిపారు. ఘటన జరిగిన వెంటనే జీవన్ రెడ్డితో మాట్లాడానని చెప్పారు. జీవన్ రెడ్డి ఆవేదనతో మాట్లాడుతున్నారని వ్యాఖ్యానించారు. కొత్తగా వచ్చిన నాయకులు పాత నాయకులను కలుపుకోవాలని సూచించారు. జగిత్యాలలోనే కాదు ఇతర ప్రాంతాల్లోనూ ఇలాంటి సమస్యలు ఉన్నాయని చెప్పారు.

నేనూ కాంగ్రెస్ నాయకుడినే అని చెప్పుకోవాల్సిన దుస్థితి వచ్చింది..జీవన్‌రెడ్డి

ఎమ్మెల్సీ, కాంగ్రెస్ సీనియర్ నాయకులు జీవన్ రెడ్డి బుధవారం మరోసారి తన ఆవేదన వెళ్లగక్కారు. కాంగ్రెస్ పార్టీపై తనకు ఎలాంటి కోపం లేదని.. ఇది తనకు సొంతిళ్లు లాంటిదని చెప్పారు. కాంగ్రెస్ పార్టీలో తనకు నాలుగు దశాబ్దాల అనుబంధం ఉందని.. కానీ ఇప్పుడు తన అనుభవమే ప్రశ్నార్థకంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పుడు ఒక అశక్తుడిలా మారిపోయానని.. నాలుగు నెలలుగా అవమానాలకు గురువుతున్నానని బయటపెట్టారు. నేనూ కాంగ్రెస్ నాయకుడినే అని చెప్పుకోవాల్సిన పరిస్థితి వచ్చిందని వాపోయారు. కాంగ్రెస్ పార్టీలో కొంతకాలంగా జరుగుతున్న పరిణామాలు తీవ్ర అసంతృప్తి కలిగిస్తున్నాయని జీవన్ రెడ్డి తెలిపారు. కాంగ్రెస్ విధానాలకు ఫిరాయింపులు వ్యతిరేకమని తెలిపారు. బీఆర్ఎస్ నుంచి చేరిన వారిపై అనర్హత వేటు వేయాల్సిందేనని డిమాండ్ చేశారు. ఫిరాయింపులు మంచిది కాదని హైకమాండ్‌కు చెప్పానని పేర్కొన్నారు. ఇక దానిపై నిర్ణయం పార్టీ ఇష్టమేనని తెలిపారు. ఫిరాయింపులపై తన నిర్ణయం మాత్రం మారదని స్పష్టం చేశారు. ఫిరాయింపుల కారణంగా బీఆర్ఎస్ ఎవరో.. కాంగ్రెస్ ఎవరో అర్థం కావడం లేదని జీవన్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. అసలైన కాంగ్రెస్ నేతలు కూడా తాము కాంగ్రెస్సే అని చెప్పుకోవాల్సిన దుస్థితి వచ్చిందని చెప్పారు. రాష్ట్రంలో కాంగ్రెస్‌కు సంపూర్ణ మెజారిటీ ఉందని తెలిపారు. ఎంఐఎంను మినహాయించినా కాంగ్రెస్ సుస్థిరంగానే ఉంటుందని పేర్కొన్నారు. కాబట్టి కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై వేటు వేయాలని కోరారు. పార్టీ ఫిరాయిస్తే సస్పెండ్ చేయాలని చట్టంలోనూ ఉందని గుర్తుచేశారు.

### మాదే అసలైన కాంగ్రెస్ కుటుంబం : సంజయ్‌కుమార్

జగిత్యాలలో తమదే అసలైన కాంగ్రెస్ కుటుంబం అని జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ స్పష్టం చేశారు. ఇదే జీవన్ రెడ్డి ఎన్టీఆర్ మంత్రి వర్గం నుంచి బయటకు వచ్చేసి నాదెండ్ల భాస్కర్‌రావు మంత్రివర్గంలో చేరి ఇంకో పార్టీతో కలవలేదా అని ప్రశ్నించారు. కాంగ్రెస్‌లో తనకు అవకాశాలు రాకపోవడంతోనే బీఆర్ఎస్ నుంచి పోటీ చేయాల్సి వచ్చిందని సంజయ్‌కుమార్ తెలిపారు. తాను ఇంకా కాంగ్రెస్ సభ్యత్వం తీసుకోలేదని తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధి కోసమే ప్రభుత్వంతో కలిసి పనిచేస్తున్నానని పేర్కొన్నారు. దానికి జీవన్ రెడ్డి పదే పదే పార్టీ ఫిరాయింపులు అని మాట్లాడటం సమంజసం కాదని సూచించారు. జీవన్ రెడ్డి రాజకీయ లబ్ధి కోసమే మాట్లాడుతున్నారని విమర్శించారు.

### నాలుగేళ్ల చిన్నారిపై

# అత్యాచారయత్నం

*** నిందితుడి అరెస్టు**

**విశ్వంభర, కుత్బుల్లాపూర్ :** దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని భౌరంపేటలో ఈనెల 12న నాలుగేళ్ల చిన్నారిపై యోగి అనే వ్యక్తి అత్యాచారానికి పాల్పడ్డాడని బాధిత కుటుంబం మేడ్చల్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోక్సో చట్టం కింద ఆ వ్యక్తిపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు డీసీపీ కోటిరెడ్డి తెలిపారు. ఈ ఘటనపై సమగ్ర దర్యాప్తు జరుగుతోందని, వైద్య నివేదికలు రాగానే తదుపరి చర్యలు తీసుకుంటామని ఆయన వెల్లడించారు. ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా ఈ కేసుపై దర్యాప్తు జరిపి నిందితుడిని కఠినంగా శిక్షించాలని ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ డీసీపీ కోటిరెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తల్లి తండ్రులు తమ పిల్లల్ని నిత్యం కనిపెట్టుకొని ఉండాలని వారు సూచించారు.

# బండి సంజయ్‌కు కేటీఆర్ లీగల్ నోటీసులు

**విశ్వంభర, హైదరాబాద్:** కేంద్రమంత్రి బండి సంజయ్‌కు బీఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ లీగల్ నోటీసులు పంపారు. ఇటీవల నిర్వహించిన మీడియా సమావేశంలో బండి సంజయ్ తన పరువుకు నష్టం కలిగించేలా వ్యాఖ్యలు చేశారన్నారు. ఫోన్ ట్యాపింగ్, డ్రగ్స్ వ్యవహారాల్లో తనపై నిరాధార ఆరోపణలు చేశారంటూ నోటీసులు ఇచ్చారు. వారంలోపు క్షమాపణలు చెప్పకపోతే చట్టపరమైన చర్య తప్పదన్నారు.



# బాధితులకు అండగా ఉంటాం

**బీజేపీ నేతల హామీ**

**ఈటల నేతృత్వంలో మూసీ పరివాహక ప్రాంతంలో పర్యటన**

**విశ్వంభర, మల్కాజిగిరి:** మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా రామంతాపూర్‌లోని బాలకృష్ణానగర్‌లో మూసీ పరివాహక ప్రాంతాన్ని బీజేపీ ప్రతినిధి బృందం పరిశీలించింది. ఎంపీ ఈటల రాజేందర్ నేతృత్వంలో ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్, శిల్పారెడ్డి, స్థానిక కార్పొరేటర్ అక్కడి పరిస్థితులపై ఆరా తీశారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఇళ్లను కూల్చివేస్తారనే ప్రచారం జరుగుతోందని.. తమను ఆదుకోవాలని ఈటల రాజేందర్‌ను స్థానికులు కోరారు. దశాబ్దాలుగా ఇక్కడ నివసిస్తున్నామని.. ఇక్కడి నుంచి పొమ్మంటే ఎక్కడికి వెళ్లాలని ఆందోళన వ్యక్తం చేశారు. బాధితులకు అండగా ఉంటామని బీజేపీ నేతలు హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా ఈటల రాజేందర్ మాట్లాడుతూ.. ఎన్నో కష్టాలు పడి ఇళ్లు కట్టుకున్న వారిని ఆందోళనకు గురి చేస్తున్నారని విమర్శించారు. 3040 ఏళ్ల పాటు కష్టపడి సంపాదించిన డబ్బుతో ఇళ్లు కట్టుకున్నారని చెప్పారు. పేద, మధ్య తరగతి ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నారని విమర్శించారు. శని, ఆదివారం వస్తే చాలు.. వారంతా భయభ్రాంతులకు గురవుతున్నారని చెప్పారు. పేదల ఇళ్లు కూలగొడితే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. బాధితులకు మద్దతుగా ఇందిరాపార్కు వద్ద ధర్నా చేస్తామన్నారు. పేదల జీవితాలతో ఆటలు వద్దని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

### నిర్బంధాల మధ్య ప్రజాభిప్రాయసేకరణ..

# అప్రజాస్వామికం

**మాజీ మంత్రి హరీశ్‌రావు**

**విశ్వంభర, హైదరాబాద్ :** యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేటలో నిర్మించతలపెట్టిన అదానీ అంబుజా సిమెంట్ పరిశ్రమపై నిర్వహిస్తున్న ప్రజాభిప్రాయ సేకరణకు బీఆర్ ఎస్ నేతలు వెళ్లకుండా అడ్డుకోవడం దుర్మార్గమని మాజీ మంత్రి హరీశ్ రావు అన్నారు. నల్గొండ జిల్లాలో బీఆర్ ఎస్ నాయకులను అరెస్టు చేయడం పట్ల ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. స్వేచ్ఛగా జరగాల్సిన ప్రజాభిప్రాయ సేకరణను, నిర్బంధాల మధ్య నిర్వహించడం అప్రజాస్వామికమని విమర్శించారు. ప్రజాపాలన అంటూ నిర్బంధ పాలన కొనసాగించడం సిగ్గుచేటని కాంగ్రెస్ ప్రభుత్వంపై మండిపడ్డారు. అక్రమంగా అరెస్టులు చేసిన బీఆర్ఎస్ నాయకులు, ప్రజా సంఘాల నేతలు, పర్యావరణవేత్తలను తక్షణమే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# తరుముకొస్తున్న తీవ్ర తుఫాను

*** రాష్ట్రంలో రెండురోజులు వానలు..**

**విశ్వంభర, హైదరాబాద్:** తెలంగాణలో శని, ఆదివారాల్లో పలు జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం పేర్కొంది. బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం బలపడి తుఫానుగా మారింది. ప్రస్తుతం దానా తుఫాను వాయువ్య దిశగా గంటకు 15 కిలోమీటర్ల వేగంతో కదులుతోందని.. ప్రస్తుతం బెంగాల్‌కు ఆగ్నేయంగా 600 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమైందని పేర్కొంది. వాయువ్య దిశగా పయనించి గురువారం తెల్లవారు జామున తీవ్ర తుఫానుగా బలపడుతుందని చెప్పింది. ఉత్తర ఒడిశా, పశ్చిమ బెంగాల్ తీరాల మధ్య పూరీ, సాగర్ ద్వీపం మధ్య భితార్కనికా, ధమరా మధ్య 2425 తేదీల మధ్య తుఫాను తీరం దాటుందని చెప్పింది. గంటకు 100 నుంచి 120 కిలోమీటర్ల వేగంతో బలమైన గాలులు వీస్తాయని వాతావరణ కేంద్రం హెచ్చరించింది. గురు, శుక్రవారాల్లో రాష్ట్రంలో పొడి వాతావరణం ఏర్పడుతుందని , శనివారం భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లో అక్కడక్కడ ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని చెప్పింది. ఆదివారం భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, కామారెడ్డి జిల్లాల్లో అక్కడక్కడ వానలు పడే సూచనలున్నాయని వివరించింది. ఈ క్రమంలో ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్ట్‌ను జారీ చేసింది.



# ఓటీటీలో రిలీజ్‌కు సిద్ధమైన తమన్నా క్రైమ్ థ్రిల్లర్



స్టార్ హీరోయిన్ తమన్నా భాటియా ప్రస్తుతం సినిమాల విషయంలో జోరు చూపిస్తూ ముందుకెళ్తోంది. ఓ వైపు లీడ్ రోల్స్ మరోవైపు స్పెషల్ సాంగ్స్ చేసుకుంటూ కెరీర్‌లో రాణిస్తోంది. తాజాగా ఇప్పుడు మరో క్రైమ్ థ్రిల్లర్ సినిమాతో ప్రేక్షకుల్ని అలరించేందుకు సిద్ధమైంది. ఈ చిత్రం నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ కానుంది. సికందర్ కా ముకద్దర్ పేరుతో ఇది రానుంది. చిత్రంలో తమన్నాతో పాటు జిమ్మీ షెర్గిల్, అవినాష్ తివారీ కూడా ప్రధాన పాత్ర పోషించారు. రూ.60 కోట్ల విలువైన వజ్రం చోరీ చుట్టూ తిరిగే కథతో ఇది తెరకెక్కింది.

"60 కోట్ల విలువైన వజ్రం చోరీ. ఓ సుదీర్ఘమైన వెతుకులాట. ఓటమిని అంగీకరించని ఓ ఇన్‌స్పెక్టర్. సికందర్ కా ముకద్దర్ త్వరలోనే నెట్‌ఫ్లిక్స్‌లోకి రానుంది" అనే క్యాప్షన్‌తో బిహైండ్ ది సీన్స్ పేరుతో మేకింగ్ వీ డియో ను విడుద ల చేసింది నెట్‌ఫ్లిక్స్. ఇందులో ప్రధాన పా త్రలపై చిత్రీకరించిన సన్నివేశాలను చూపించారు. చివరిలో సినిమా దర్శకుడు నీరజ్ పాండే కనిపించారు. త్వరలోనే స్ట్రీమింగ్ డేట్‌ను అనౌన్స్ చేయనున్నారు.

ఈ సికందర్ కా ముకద్దర్ మూవీని ప్రముఖ దర్శకుడు నీరజ్ పాండే డైరెక్ట్ చేశారు. నీరజ్ పాండే ఈ మధ్యే చెన్గిజ్‌తోపాటు అజయ్ దేవగన్, టబు నటించిన ఔరో మే కహా దమ్ థా చిత్రానికి దర్శకత్వం వహించారు. రీసెంట్‌గా తమన్నా 'స్త్రీ 2'లో స్పెషల్ సాంగ్ చేసి ప్రేక్షకుల్ని ఆకట్టుకుంది.

కాగా, గత కొంత కాలంగా ఓటీటీలపై ఎక్కువ దృష్టి పెట్టింది తమన్నా. 11th అవర్, నవంబర్ స్టోరీ, మాస్టర్ చెఫ్, జీ కర్దా, ఆఖ్రీ సచ్ వంటి ప్రాజెక్ట్‌లను ఓటీటీల్లో చేసింది. ప్రస్తుతం డేరింగ్ పార్ట్నర్స్(హిందీ) కోసం పని చేస్తోంది. ఇక థియేటర్ రిలీజ్ విషయానికొస్తే ఆమె ఓదెల 2 చిత్రంలో నటిస్తోంది. ప్రస్తుతం చిత్రీకరణ జరుపుకుంటున్న ఈ చిత్రం త్వరలోనే విడుదల కానుంది.

# పుష్ప-2కు శ్రద్ధా కపూర్ గ్రీన్ సిగ్నల్..?



టాలీవుడ్ స్టార్ దర్శకుడు సుకుమార్ సినిమాలలో స్పెషల్ సాంగ్‌లు ఎంత ఫేమస్ అనేది ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. తన మొదటి సినిమా ఆర్యలో మొదలైన ఈ సెంటిమెంట్ నాన్నకు ప్రేమతో సినిమాలో తప్ప ప్రతి సినిమాలో కొనసాగుతుంది. అ అంటే అమలాపురం, 36-24-36, రింగ రింగా, డియాలో డియాలా, జిగేల్ రాణి, లండన్ బాబు, ఊ అంటావా మావ.. సాంగ్‌లతో ప్రేక్షకులకు అలరించాడు. అయితే ఆయన దర్శకత్వంలో వస్తున్న తాజా చిత్రం పుష్ప ది రూల్. ఐకానిక్ స్టార్ అల్లు అర్జున్ హీరోగా నటిస్తున్న ఈ చిత్రం బ్లాక్ బస్టర్ హిట్ పుష్ప సినిమాకు సీక్వెల్‌గా వస్తుంది. రష్మిక మందాన్న కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రం డిసెంబర్ 06న ప్రేక్షకుల ముందుకు రానుంది. అయితే ఈ సినిమాలో స్పెషల్ సాంగ్‌కు సంబంధించి ఒక సాలిడ్ న్యూస్ సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతుంది. ఈ సినిమాలో బాలీవుడ్ భామ శ్రద్ధ కపూర్ ఐటం సాంగ్ చేయబోతున్నట్లు తెలుస్తుంది. ఇటీవలే స్త్రీ 2 సినిమాతో బ్లాక్ బస్టర్ అందుకుంది ఈ భామ. అయితే పుష్పకి ఉన్న క్రేజ్‌కి శ్రద్ధ కపూర్ అయితేనే సరిగ్గా సరిపోతుందని అందుకనే ఈ భామను ఇందులో తీసుకుబోతున్నట్లు సమాచారం. 'పుష్ప 2' ఐటమ్ నంబర్ లో శ్రద్ధా కపూర్ అలరిస్తుందా లేదా అనేది పక్కన పెడితే.. ఈ పాన్ ఇండియా సినిమాకి ఆమె కచ్చితంగా ప్లస్ అవుతుంది. శ్రద్ధా ఉండటం హిందీ మార్కెట్ లో బాగా కలిసొస్తుంది. అందులోనూ ఇటీవలే 'స్త్రీ 2' భారీ బ్లాక్ బస్టర్ విజయాన్ని అందుకుని విపరీతమైన క్రేజ్ సంపాదించుకుంది. కాబట్టి అల్లు అర్జున్ సినిమాకి శ్రద్ధా కపూర్ తప్పకుండా అదనపు ఆకర్షణగా నిలిచే అవకాశం ఉంది. అసలు ఇవన్నీ ఆలోచించే సుక్కూ ఆమెను స్పెషల్ సాంగ్ కోసం సెలెక్ట్ చేసుకున్నారేమో అని సమాచారం.

# రాజాసాబ్ పుట్టినరోజు కానుక..



రెబల్ స్టార్ ప్రభాస్ పుట్టినరోజు సందర్భంగా 'ది రాజా సాబ్' మేకర్స్, అభిమానుల కోసం ఓ డిఫరెంట్ మోషన్ పోస్టర్ ను విడుదల చేశారు. అందులో డార్లింగ్ ఇంతకుముందు ఎప్పుడూ చూడని విధంగా సరికొత్తగా కనిపించారు. ఈ పోస్టర్‌లో ప్రభాస్ సింహాసనంపై కూర్చొని సిగార్ కాలుస్తూ రాజు లుక్ లో దర్శనమివ్వడం విశేషం. ఇక ఈ మోషన్ పోస్టర్ బ్యాగ్రౌండ్ మ్యూజిక్ కూడా అదిరిపోయింది.

ప్రముఖ దర్శకుడు మారుతి డైరెక్షన్‌లో హారర్ కామెడీ జానర్‌లో రాజాసాబ్ తెరకెక్కుతున్న విషయం తెలిసిందే. ఇప్పటికే చాలావరకు షూటింగ్ కంప్లీట్ చేసుకున్న ఈ మూవీ.. మిగిలిన చిత్రీకరణను వీలైనంత త్వరగానే పూర్తి చేసే పనిలో చిత్ర బృందం ఉంది.

ఈ మూవీలో బాలీవుడ్ సీనియర్ స్టార్ హీరో సంజయ్ దత్ కీలక పాత్రలో కనిపించనున్నారు. ప్రభాస్ సరసన నిధి అగర్వాల్, మాళవిక మోహనన్, రిద్ధి కుమార్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్నారు.

ఎస్ఎస్ థమన్ సంగీతం అందిస్తున్నారు. తెలుగుతో పాటు హిందీ, తమిళం, మళయాళం, కన్నడలో పాన్ ఇండియా స్థాయిలో ఈ చిత్రం వచ్చే ఏడాది ఏప్రిల్ 10న రిలీజ్ కానుంది.

# గంగవ్వపై కేసు నమోదు

బిగ్‌బాస్ గంగవ్వ చిక్కుల్లో పడ్డారు. జగిత్యాలలో ఆమెపై కేసు నమోదైంది. యూట్యూబ్ ఛానల్ 'మై విలేజ్ షో' కోసం గంగవ్వ చేసిన ఓ వీడియోలో రామచిలుకను ఉపయోగించడం ఆమెకు చిక్కులు తెచ్చిపెట్టింది. 2022 మేలో తీసిన ఆ వీడియోలో ఒక రామచిలుకను ఉపయోగించడంపై ఫిర్యాదు అందడంతో జగిత్యాల ఎఫ్ఆర్‌వో కేసు నమోదు చేశారు. గంగవ్వతో పాటు యూట్యూబర్ రాజుపై కూడా అటవీ శాఖ అధికారులు కేసు నమోదు చేశారు. వన్యప్రాణి సంరక్షణ చట్టాల కింద ఈ కేసు నమోదు చేసినట్లు



జగిత్యాల ఎఫ్ఆర్‌వో పద్మారావు తెలిపారు. జంతు సంరక్షణ కార్యకర్త గౌతమ్ చేసిన ఫిర్యాదు మేరకు గంగవ్వ, రాజుపై కేసు నమోదు చేసినట్లు FRO పద్మారావు తెలిపారు. యూట్యూబ్‌లో వ్యూస్ కోసం రామచిలుకను హింసించి, వన్యప్రాణుల సంరక్షణ చట్టాన్ని ఉల్లంఘించారని గౌతమ్ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ కేసులో యూట్యూబర్ రాజు రూ. 25 వేలు జరిమానా చెల్లించారు.

యూట్యూబ్ ఛానల్ వీడియో కోసం చిలుకను ఉపయోగించడంపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ జంతు సంరక్షణ కార్యకర్త గౌతమ్.. జగిత్యాల జిల్లా ఫారెస్ట్ అధికారికి అక్టోబర్ 6న లేఖ రాశారు. 2022 మే 20న 'మై విలేజ్ షో' యూట్యూబ్ ఛానల్‌లో పోస్ట్ చేసిన ఒక వీడియోలో రామచిలుకను ఉపయోగించారని గౌతమ్ ఆరోపించారు. 'గంగవ్వ చిలుక పంచాంగం' పేరుతో ఈ వీడియోను పబ్లిష్ చేశారు. జ్యోతిషం కోసం చిలుకను ఉపయోగించారు. ఇందులో గంగవ్వతో పాటు రాజు కూడా ఉన్నారు. వన్యప్రాణి సంరక్షణ చట్టంలోని షెడ్యూల్ 4 ప్రకారం భారతీయ చిలుకను మనం సంరక్షించుకుంటున్నామని, కాబట్టి ఈ అంశంపై దర్యాప్తు చేయాలని గౌతమ్ తన ఫిర్యాదులో కోరారు.

# కంగువపై అంచనాలు పెంచిన సూర్య !



కోలీవుడ్ స్టార్ హీరో సూర్య కెరీర్ లో అత్యంత భారీ బడ్జెట్ తో తెరకెక్కుతున్న మూవీ కంగువా. తమిళ మాస్ డైరెక్టర్ శివ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా పీరియాడిక్ బ్యాక్ డ్రాప్ తో రూపొందుతుంది. ఇప్పటికే సినిమా నుంచి రిలీజ్ అయిన సూర్య లుక్, టీజర్, ట్రైలర్ సినిమాపై ఓ రేంజ్ లో అంచనాలు పెంచేశాయి. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుపుకుంటున్న ఈ సినిమా నవంబర్ 14 న వరల్డ్ వైడ్ గ్రాండ్ గా రిలీజ్ కానుంది.

రిలీజ్ టైం దగ్గర పడటంతో మేకర్స్ ప్రమోషన్స్ స్పీడ్ పెంచారు. ఇందులో భాగంగానే మూవీ టీమ్ తాజాగా ప్రెస్‌మీట్ నిర్వహించింది . ఇందులో సూర్య, హీరోయిన్ దిశాపటానీ, బాలీవుడ్ నటుడు బాబీ డియోల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కంగువా గురించి సూర్య పలు ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. ఈ మూవీ కచ్చితంగా హాలీవుడ్ సినిమాలను గుర్తు చేస్తుందని అన్నారు.

ప్రెస్ మీట్ లో సూర్య మాట్లాడుతూ.." మనం బ్రేవ్‌హార్ట్, లార్డ్ ఆఫ్ ది రింగ్స్, గేమ్ ఆఫ్ థ్రోన్స్, అపోకలిప్టో వంటి చిత్రాలను ఇష్టపడతాం. వాటిని చూసి ఆశ్చర్యానికి గురవుతాం కూడా. ఆ సినిమాలు చాలాసార్లు చూశాం. మేము కూడా ఇప్పుడు అలాంటి సినిమాలే చేయబోతున్నాం. ఒక 100 సంవత్సరాలు వెనక్కి వెళితే ఎలా ఉంటుంది? అనే ఆలోచన శివకు వచ్చింది.

అప్పటి ప్రజలు ఎలాంటి జీవితాన్ని గడిపారు? వారికి ఎదురైన కష్టాలేంటి? అనే విషయాలను తెరపై ఆవిష్కరిస్తే బాగుంటుందని చెప్పాడు. ఆ విధంగానే కంగువాను మీ ముందుకు తీసుకొస్తున్నాం. విజువల్ ఎఫెక్ట్స్, కథ విషయంలో శివ చాలా ప్రతిభావంతుడు. అతను థియేటర్‌లో కంగువా చూశాక మీకే తెలుస్తుంది.." అంటూ చెప్పుకొచ్చారు. దీంతో సూర్య కామెంట్స్ సినిమాపై మరింత హైప్ పెంచింది.

# కాఫీ తాగితే గుండె జబ్బులు రావు..! అధ్యయనంలో వెల్లడి

**విశ్వంభర, ఫీచర్ :** ఈ మధ్య కాలంలో హార్ట్ అటాక్ లు పెరగడానికి అతి పెద్ద కారణం పేళవమైన జీవన శైలి, జంక్ ఫుడ్ , వ్యాయామలేమి, ఒత్తిడి , స్మోకింగ్, ఆల్కహాల్, నిద్రలేమి ఇవన్నీ కూడా ఆరోగ్యంపై తీవ్రమైన ప్రభావం చూపుతుంది. దాంతో అతి చిన్న వయస్సులోనే చాలా మంది రక్తపోటు, మధుమేహం తో పాటు గుండె సంబంధిత వ్యాధుల భారీన పడుతున్నారు. అయితే కాఫీని రెగ్యులర్ గా తాగడం వల్ల గుండె సంబంధిత వ్యాధులను తగ్గించుకోవచ్చని అధ్యయనంలో కనుగొన్నారు.

సంవత్సరాలుగా, కాఫీ గుండె ఆరోగ్యంపై పరిశోధనలు జరుగుతూనే ఉన్నాయి. అయినప్పటికీ, మితమైన కాఫీ వినియోగం వాస్తవానికి గుండె సంబంధిత వ్యాధుల ప్రమాదాన్ని తగ్గిస్తుందని ఇటీవలి అధ్యయనాలు చూపెడుతున్నాయి. ఇటీవలి అధ్యయనం ప్రపంచవ్యాప్తంగా కాఫీ ప్రియులకు ఉల్లాసాన్ని కలిగించింది, మితమైన కాఫీ వినియోగం గుండె సంబంధిత వ్యాధుల ప్రమాదాన్ని గణనీయంగా తగ్గిస్తుందని సూచిస్తుంది. జర్నల్ ఆఫ్ అమెరికన్ హార్ట్ అసోసియేషన్‌లో ప్రచురించిన పరిశోధన ప్రకారం, రోజూ కాఫీ తాగడం వల్ల ప్రమాదాన్ని తగ్గించవచ్చు.

*** 11% గుండె వైఫల్యం: 21,000 మంది పెద్దలపై జరిపిన ఒక అధ్యయనంలో మితంగా కాఫీ తాగే వారిలో గుండె ఆగిపోయే ప్రమాదాన్ని 11% తగ్గించిందని వెల్లడించింది.**

*** 17% స్ట్రోక్ రిస్క్ తగ్గింది,. 21 అధ్యయనాల విశ్లేషణలో మితంగా కాఫీ తాగే వారు (రోజుకు 3-4 కప్పులు) స్ట్రోక్ ముప్పు 17% తక్కువగా ఉంటుందని కనుగొన్నారు.**

*** కర్ణిక దడ 12% తగ్గింది: మితంగా కాఫీ తాగేవారిలో కర్ణిక దడ ప్రమాదాన్ని 12% తగ్గించిందని పరిశోధనలో తేలింది.**

*** కార్డియోవాస్కులర్ మరణాలు 10% తగ్గాయి: 400,000 మంది పెద్దలపై జరిపిన ఒక అధ్యయనంలో మితమైన కాఫీ వినియోగం హృదయనాళ మరణాలను 10% తగ్గించిందని కనుగొన్నారు.**

## అధ్యయనం ఫలితాలు

10 సంవత్సరాలకు పైగా నిర్వహించబడిన ఈ అధ్యయనం 30,000 మంది పాల్గొన్న వారి నుండి డేటాను విశ్లేషించింది. మితంగా కాఫీ తాగే వారు(రోజుకు 34 కప్పులు) దీనితో పరస్పర సంబంధం కలిగి ఉందని పరిశోధకులు కనుగొన్నారు:

***మెరుగైన హృదయనాళ ఆరోగ్యం కలిగి ఉంటారు**

*** గుండె ఇన్ఫ్లమేషన్ వాపు వంటివి తగ్గుతాయి**

***మెరుగైన ఇన్సులిన్ సెన్సిటివిటీ కలిగి ఉంటారు**

***మెరుగైన రక్తనాళాల పనితీరు**

## కాఫీ కార్డియోవాస్కులర్ బెనిఫిట్స్ వెనుక ఉన్న సైన్స్

గుండె ఆరోగ్యంపై కాఫీ ఆరోగ్యకరమైన ప్రయోజనాలు కలిగి ఉండటానికి ముఖ్య కారణం యాంటీఆక్సిడెంట్లు, పాలీఫెనాల్స్ మరియు ఇతర బయోయాక్టివ్ సమ్మేళనాలు దాని గొప్ప కూర్పుకు కారణమని పరిశోధనలు సూచిస్తున్నాయి. ఈ సమ్మేళనాలు యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలను కలిగి ఉంటాయి, ఇన్సులిన్ సెన్సిటివిటీని మెరుగుపరుస్తాయి మరియు నైట్రిక్ ఆక్సైడ్ ఉత్పత్తిని పెంచుతాయి, ఇది రక్త నాళాలను విశ్రాంతి తీసుకోవడానికి సహాయపడుతుంది.

## ముఖ్యంగా గుర్తించుకోవాల్సిన అంశాలు

1 కాఫీలో ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నప్పటికీ అందులో అధిక చక్కెర, క్రీమ్ మరియు సిరప్‌లను నివారించండి. అధిక కాఫీ వినియోగాన్ని తగ్గించాలి. 5 కప్పుల కంటే ఎక్కువ తీసుకోకూడదు

2. బ్రూయింగ్ విధానం: కాఫీ రకాలు: ఫిల్టర్ చేయని కాఫీ అధిక కెఫెస్టోల్ మరియు కహ్వీల్ స్థాయిల కారణంగా కొలెస్ట్రాల్‌ను పెంచవచ్చు..

3. వ్యక్తిగత సున్నితత్వం: జన్యు సిద్ధత, వయస్సు మరియు ఆరోగ్య స్థితిని బట్టి కాఫీ ప్రభావాలు మారవచ్చు.

4. ఇతర ఆరోగ్య పరిస్థితులు: కాఫీ కొన్ని మందులతో సంకర్షణ చెందుతుంది లేదా అధిక రక్తపోటు, ఆందోళన లేదా నిద్రలేమి వంటి పరిస్థితులను మరింత తీవ్రతరం చేస్తుంది.

## గమనిక

మితమైన కాఫీ వినియోగం, రోజుకు 34 కప్పులుగా నిర్వచించబడింది, స్ట్రోక్, గుండె వైఫల్యం మరియు కర్ణిక దడ వంటి గుండె సంబంధిత వ్యాధుల ప్రమాదాన్ని తగ్గిస్తుంది. అయితే, వ్యక్తిగత కారకాలు మరియు మొత్తం జీవనశైలిని పరిగణించాలి. కాఫీతో గుండె సంబంధిత ప్రయోజనాలను పొందేందుకు, వీటిని ఎంచుకోండి:

మితమైన కాఫీ వినియోగం మీ దినచర్యకు ఆరోగ్యకరమైన అదనంగా ఉంటుందని ఈ అధ్యయనం సూచిస్తుంది.

సమతుల్యత పాటించండి

కాఫీ తాగడానికి ముందు ఫిల్టర్ బ్రూయింగ్ పద్ధతులు గుర్తుపెట్టుకోండి. అప్పుడు మీ హృదయం మీకు కృతజ్ఞతలు తెలుపుతుంది!

## ఏదైనా ఆరోగ్య సమస్యలున్నప్పుడు కాఫీతాగే ముందు

1. మీ కాఫీ వినియోగం గురించి మీ రెగ్యులర్ డాక్టర్ ను సంప్రదించండి.

2. మీ రక్తపోటు మరియు హృదయ స్పందన రేటును తరచూ చెక్ చేయించుకోండి.

3. రెగ్యులర్ వ్యాయామం మరియు సమతుల్య ఆహారంతో సహా ఆరోగ్యకరమైన జీవనశైలితో కాఫీని సమతుల్యం చేసుకోండి.

మీ దినచర్యలో మితమైన కాఫీ వినియోగాన్ని చేర్చడం ద్వారా, మీరు గుండె సంబంధిత వ్యాధుల ప్రమాదాన్ని తగ్గించవచ్చు, మొత్తం హృదయ ఆరోగ్యాన్ని మెరుగుపరచవచ్చు.

**ఇక్కడ అందించిన సమాచారం సాధారణ అంచనాలు మాత్రమే. నిపుణుల సలహా తీసుకోవండం మంచిది.**



Edited, Printed, Published & Owned by Dr. KACHAM SATYANARAYANA. Printed at DVM Multi Colour Offset Printers, Dilsukhnagar, Hyderabad - 500060. Telangana. Published at #204, 2nd Floor, Badam Complex, Opp. Metro Pillar No. 1560, Chaitanyapuri X Road, Hyderabad - 500060. Telangana.EDITOR: Dr. KACHAM SATYANARAYANA. Cell: 9441222429 | Email: vishwambhara.daily@gmail.com